అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 08-03-2025
సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 11 | సంచిక : 16 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 14 పేజీలు | వెల : 6.50



10న గ్రూప్-1 ప్రొవిజినల్ మార్కుల ప్రకటన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ ప్రొవిజినల్ మార్కుల వివరాలను ఈనెల పదో తేదీన ప్రకటిస్తామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) తెలిపింది. శుక్రవారం టీజీపీఎస్సీ పాలకమండలి సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న అనేక నోటిఫికేషన్ల స్థితిగతుల గురించి సమీక్షించారు. అనంతరం టీజీపీఎస్సీ చైర్మెన్ బుర్రా వెంకటేశం వివిధ నోటిఫికేషన్లకు సంబంధించిన జీఆర్ఎల్, ఫలితాల విడుదల కోసం షెడ్యూల్‌ను ఆమోదించి ఒక ప్రకటన విడుదల చేశారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గతేడాది ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిందని తెలిపారు. ఈనెల 11న గ్రూప్-2 రాతపరీక్షల జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 14న గ్రూప్-3 జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను ప్రకటిస్తామని వివరించారు. ఈనెల 17న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యూవో) రాతపరీక్షల తుది ఫలితాలను విడుదల చేస్తామని తెలిపారు. ఈనెల 19న ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (ఈవో) పరీక్షలకు సంబంధించిన జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను విడుదల చేస్తామని పేర్కొన్నారు.

ఉద్యోగాలిప్పిస్తామంటే ఫిర్యాదు చేయండి

గ్రూప్-1 నియామకాలకు సంబంధించి ఎలాంటి తప్పుడు, తప్పుదారి పట్టించే సమాచారాన్ని నమ్మొద్దని బుర్రా వెంకటేశం అభ్యర్థులను కోరారు. టీజీపీఎస్సీ రాజ్యాంగబద్ధమైన సంస్థ అనీ, ప్రతిభావంతులైన అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేయడానికి సూచించిన అన్ని నియమాలు, విధానాలను పాటిస్తుందని వివరించారు. గతంలో పేర్కొన్న విధంగా ఎవరైనా మధ్యవర్తులు కమిషన్ సిబ్బందితో కానీ మరే అధికారులతో కానీ పరిచయాలు ఉన్నాయనీ, ఉద్యోగాలు కల్పిస్తామనీ, సమాచారాన్ని పొందడంలో సహాయం చేస్తామంటూ ఎవరైనా అభ్యర్థులను సంప్రదిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఆధారాలతో సహా ఫిర్యాదు చేయాలని కోరారు. ఆ సమాచారాన్ని పోలీసు ఫిర్యాదుతో కలిపి కమిషన్‌కు తెలియజేయడానికి 9966700339 మొబైల్ నెంబర్ లేదా జఱఅస్ర్రఱశ్రీుఱఅఎవవంజూం౬.స్రశీఙ.ఱఅ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఉద్యోగాలను కల్పిస్తామనే తప్పుడు వాగ్దానాలు ఇచ్చిన మధ్యవర్తులు లేదా వ్యక్తుల గురించి ఇప్పటి వరకు కమిషన్‌కు ఒక్క ఫిర్యాదు/సమాచారం కూడా అందలేదని తెలిపారు. సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న వార్తలు పూర్తిగా నిరాధారమని పేర్కొన్నారు. కమిషన్‌ను అప్రతిష్టపాలు చేయడం, నిరుద్యోగ యువతలో గందరగోళం/అశాంతి సృష్టించడం అనే ఉద్దేశంతో మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. అటువంటి వ్యక్తులపై దృఢమైన సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి కమిషన్ వెనుకాడబోదని ఆయన హెచ్చరించారు. కమిషన్ పారదర్శకమైన పూర్తిస్థాయి నియామక విధానాలను అనుసరిస్తుందనేది అభ్యర్థులు గమనించాలని సూచించారు. తప్పుదారి పట్టించే వృత్తి/వ్యక్తుల గురించి నేరుగా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. అటువంటి వారిపై కఠినంగా వ్యవహరించడానికి వీలుగా పోలీసు ఫిర్యాదును ఆధారాలతోపాటు కమిషన్‌కు పంపాలని సూచించారు.

టీజీపీఎస్సీ షెడ్యూల్

నోటిఫికేషన్ పేరు	ఫలితాల ప్రకటన/జీఆర్ఎల్
1. గ్రూప్-1	మార్చి 10న అభ్యర్థికి వచ్చిన ప్రొవిజినల్ మార్కుల వివరాల ప్రకటన
2. గ్రూప్-2	మార్చి 11న జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్) విడుదల
3. గ్రూప్-3	మార్చి 14న జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్) విడుదల
4. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్	మార్చి 17న తుది ఫలితాల ప్రకటన
5. ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్	మార్చి 19న జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్) విడుదల

గొర్రెల మంద పై కుక్కల దాడి

11 గొర్రెలు మృతి, గాయపడ్డ 20 గొర్రెలు

నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలో ఘటన



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

గొర్రెల మందపై కుక్కలు దాడి చేసిన ఘటనలో 11 గొర్రెలు మృత్యువాత పడగా, మరో 20 గొర్రెలు తీవ్రంగా గాయపడిన ఘటన నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం నాగపూర్ గ్రామంలో శుక్రవారం జరిగింది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగపూర్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బసకొండ బాలమల్లేష్ తన గొర్రెల మందను రోజులాగే గురువారం రాత్రి కొట్టంలో ఉంచాడు. శుక్రవారం తెల్లవారుజామున గొర్రెల కొట్టం వద్దకు వచ్చి చూడగా కుక్కలు మంద పై దాడి చేయడం చూసి వాటిని తరిమేశాడు. అనంతరం కొట్టంలోకి వెళ్లి చూడగా పలు గొర్రెలు మృతి చెందగా, మరి కొన్ని తీవ్రంగా గాయపడి ఉన్నాయి. గొర్రెల కొట్టంలోకి కుక్కలు చొరబడి దాడి చేయగా 11 గొర్రెలు మృత్యువాత పడగా, మరో 20గొర్రెలు గాయపడ్డట్టు బాధితుడు బాల మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడ్ని అడిగి వివరాలు తెలుసుకున్నారు. కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన విషయాన్ని ఉదయమే పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా ఎవరూ వచ్చి చూడలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని బాల మల్లేష్ వేడుకున్నారు.

సమగ్రసర్వేపై స్వతంత్ర కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. కమిటీ సభ్యులుగా డాక్టర్ సుఖదేవ్, రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, ప్రొఫెసర్ శాంత సిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, ప్రొఫెసర్ భూక్య భంగ్య ప్రత్యేక ఆహ్వానితులుగా జీన్ డ్రీజ్ ఉంటారని తెలిపారు. ఈ నిపుణుల కమిటీ సర్వేపై అధ్యయనం చేసి నివేదికను నెల రోజుల్లో ప్రణాళిక శాఖకు అందజేయాలని సూచించారు. సామాజిక న్యాయానికి పునాది వేయాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సర్వే నిర్వహించిందని గుర్తు చేశారు. ప్రతి 150 ఇళ్లను ఒక బ్లాక్ గా ఏర్పాటు చేసుకొని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పారదర్శకంగా సర్వే జరిపించినట్టు తెలిపారు. దానిపై వస్తున్న విమర్శల్లో నిజమెంతో సామాజిక వేత్తల అధ్యయనంతో తేలిపోనుందని అన్నారు. సమావేశంలో ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

గర్ల్స్ హాస్టల్‌లో స్పై కెమెరా

నవతెలంగాణ-అమీన్‌పూర్

గర్ల్స్ హాస్టల్‌లో రహస్యంగా పెట్టిన స్పై కెమెరాను విద్యార్థినులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. అమీన్‌పూర్ మున్సిపాల్టీ కిష్టారెడ్డిపేట పరిధిలోని మైత్రి విల్లాస్‌లో బండారు మహేశ్వర్ 2021 నుంచి లక్ష్మీ గర్ల్స్ హాస్టల్‌ను నిర్వహిస్తున్నారు. అయితే ఈ హాస్టల్‌లో తాజాగా ఓ స్పై కెమెరాను విద్యార్థినులు గుర్తించారు. దాంతో అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

ముస్లిం మహిళలే టార్గెట్

ఏఐతో అశ్లీల చిత్రాలు | సోషల్ మీడియాలో హిందూత్వశక్తుల పైశాచికానందం

- అసభ్య కంటెంట్‌తో ప్రజల మధ్య వైషమ్యాలు
- మోడీ సర్కారు ఉదాసీన వైఖరి
- కఠిన చర్యలు తీసుకోవాలి : సామాజిక కార్యకర్తలు, మేధావుల డిమాండ్





కృత్రిమ మేధ(ఏఐ) ప్రస్తుతం ప్రపంచంపై తన ప్రభావాన్ని చూపెడుతున్నది. ప్రతీ రంగాన్ని శాసించే శక్తి ఏఐకు ఉన్నదన్నది సాంకేతిక నిపుణుల మాట. దీంతో ఇప్పటికే కొన్ని కంపెనీలు ఏఐ వైపు మళ్లటంలో శ్రద్ధ వహిస్తున్నాయి. ఈ సాంకేతిక పరిజ్ఞానం విషయంలో రోజురోజుకూ కొత్త మార్పులు వస్తున్నాయి. అమెరికా,చైనా దేశాలు కృత్రిమ మేధ విషయంలో పోటీ పడుతున్నాయి. పొరుగుదేశం చైనా 'డీప్ సీక్'తో ముందుకొచ్చి ప్రపంచంలో సంచలనం సృష్టించింది. అమెరికా 'చాట్‌జీపీటీ'కి సవాలు విసిరింది.

న్యూఢిల్లీ : భారత్‌లో మాత్రం పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. ప్రతి విషయంలోనూ చైనా, అమెరికాలతో పోటీ పడి ముందుకెళ్తున్నామని చెప్పుకునే మోడీ ప్రభుత్వం.. అటు వైపు ప్రభావవంతంగా పని చేయటం లేదన్నది నిపుణుల మాట. ముఖ్యంగా, భారత్‌లో ఈ ఏఐని మంచి విషయాల కంటే చెడు, పనికిరాని విషయాల కోసం ఎక్కువగా వాడుతున్నట్టు వారు వివరిస్తున్నారు.


గత 11ఏండ్ల మోడీ పాలనలో దేశంలో హిందూత్వ శక్తులు చెలరేగిపోతున్నాయి. మైనారిటీలు, ముఖ్యంగా ముస్లింలే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్నాయి. వారిపై మానసికంగా, భౌతికంగా ఎన్నో దాడులు చేస్తున్నాయి. హిందూత్వశక్తుల ఈ పైత్యపు చేష్టలు సామాజిక మాధ్యమాలకూ ఎక్కాయి. ముస్లిం మహిళలే టార్గెట్‌గా అసభ్యపు కంటెంట్‌ను సృష్టిస్తున్నాయి. ఇందుకు కృత్రిమ మేధను ఉపయోగిస్తున్నాయి. ఏఐ సహాయంతో సదరు ముస్లిం మహిళలు లేదా ముస్లిం మహిళల రూపంలో ఉన్నటువంటి అశ్లీల చిత్రాలను సృష్టిస్తున్నాయి.

హిందూత్వ శక్తుల ఆగడాలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఈ విధమైన అభ్యంతరకరమైన రాతలు, పోస్టులు పెడుతూ సమాజంలో వైషమ్యాలు తీసుకొస్తున్నాయని సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "నా ఫాలోవర్ల సంఖ్య పెరుగుతున్నప్పటి నుంచి నా ట్విట్టర్ డీఎంలో హిజాబీ మహిళల పోర్నోగ్రఫిక్ చిత్రాలు వస్తున్నాయి. నా చిత్రాలను కూడా మార్ఫ్ చేస్తామని సదరు మెసేజ్‌లు చేస్తున్న వ్యక్తులు నన్ను బెదిరిస్తున్నారు. ప్రస్తుతం ఏఐ టూల్స్ చాలా అడ్వాన్స్‌డ్‌గా మారాయి. కాబట్టి అలాంటి చిత్రాలను కలిగి ఉన్న మెసేజ్‌లూ పెరిగాయి" అని ఢిల్లీకి చెందిన కవి, సామాజిక కార్యకర్త నబియా ఖాన్ తన ఆందోళనను వ్యక్తం చేశారు. 2021లో సంచలనం రేపిన 'సల్లీ డీల్స్' యాప్‌లో హిందూత్వ శక్తులు టార్గెట్ చేసిన కొందరు ప్రముఖ సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులలో నబియా ఖాన్ కూడా ఒకరు. ఏఐ-పవర్డ్ జనరేషన్ టూల్స్ సహాయంతో హిందూత్వ శక్తులు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి కొన్ని ప్రముఖ సోషల్ మీడియాలో రెచ్చిపోతున్నాయి. కొన్ని మాత్రం.. తమ ఖాతాలు, పేజీలను ఈ పనుల కోసమే వాడుతూ ఇంటర్నెట్‌లో ముస్లిం మహిళల సెమీ-పోర్నోగ్రఫిక్ చిత్రాలను పోస్ట్ చేస్తున్నాయి. ఇవి చాలా అభ్యంతరకరంగా ఉంటున్నాయి. వేరొక మతానికి చెందిన వ్యక్తితో ముస్లిం మహిళ అత్యంత సన్నిహితంగా ఉన్నటువంటి ఫోటోలను ఏఐ ద్వారా హిందూత్వ శక్తులు తయారు చేస్తున్నాయి. ఇందులో ఆ వ్యక్తి సదరు మతానికే చెందినవాడని చూస్తే చెప్పే విధంగా ఫోటోలు ఉంటాయి. ముస్లిం మహిళలు ధరించే బుర్ఖా, హిజాబ్‌ల గురించి చులకన చేసే విధంగా, వారి సాంప్రదాయాలను అపహాస్యం చేసేలా ఈ పోస్ట్‌లు ఉన్నాయి. హిజాబ్, బుర్ఖాల విషయంలో బీజేపీ రాజకీయాలు సర్వసాధారణమే. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కర్నాటక వంటి రాష్ట్రంలో ఈ అంశంపై పెద్ద చర్చే జరిగింది. బీజేపీ, హిందూత్వ శక్తులు ఆ సమయంలో ఈ ఘర్షణల వెనక ఉన్నాయన్నది విశ్లేషకులు చెప్తున్నారు. కాబటి.. ప్రస్తుత విషయంలోనూ వాటి హస్తం ఉన్నదనే విషయాన్ని కచ్చితంగా చెప్పొచ్చని అంటున్నారు. సల్లీ డీల్స్ యాప్ ద్వారా గతంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని ఈ సందర్భంగా నబియా ఖాన్ గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు ఏఐ ఇమేజ్‌లలో ముస్లిం మహిళలను చూపిస్తున్న విధంగానే నబియా అనే ముస్లిం స్త్రీపై దాడి జరిగిందని వివరించారు. భారత ముస్లింలను అవమానించటమే వారి(హిందూత్వ శక్తులు) లక్ష్యమని ఆమె అన్నారు. ముస్లిం సమాజాన్నే అవమానించేలా కొన్ని సామాజిక మాధ్యమ ఖాతాల పేర్లు ఉంటున్నాయి. వారి ఆచారాలను అవహేళన చేసే విధంగా ఇవి ప్రతిబింబిస్తున్నాయి. ముస్లిం మహిళలను ఒక లైంగిక వస్తువుగా, వేశ్యగా చిత్రీకరిస్తూ వారిని అవమాన పరుస్తున్నాయి. ముస్లిం యువతులను ట్రాప్ చేసి వారిని మతం మార్చేలంటూ మరికొన్ని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ పేజీలు, ఖాతాలు విచ్చలవిడిగా పని చేస్తున్నాయి. అశ్లీల వీడియోలు, చిత్రాలను వాడుకొని ముస్లిం మహిళలు, ఆ సమాజానికి వ్యతిరేకంగా మీమ్స్‌ను తయారు చేస్తున్నాయి హిందూత్వ శక్తులు.

ఇక కొన్ని ఇన్‌స్టా పేజీలలోనైతే.. హిందు మతంలోని కులాల పేర్లు ఉన్నాయి. 'జాలిమ్ పండిట్', 'జాలిమ్ బ్రాహ్మన్', 'జాలిమ్ ఠాకూర్' వంటివి ఇందులో కొన్ని. ఈ పేర్లు పెత్తందారీ కులాలకి చెందినవి. ఈ పేజీలో కొన్ని మాత్రం ముస్లిం మహిళలను అసభ్యకరంగా, అభ్యంతరకరంగా చూపించటానికే పని చేస్తున్నాయి. అయితే, ఓబీసీ, దళిత కులాల పేర్లను జోడిస్తూ పేర్లను కలిగి ఉన్న పేజీలు మాత్రం తమ విశ్లేషణలో ఎక్కడా కనబడలేదని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు.

ఈ మొత్తం తతంగం వెనక పెత్తందారీ కులాలకు చెందినవారి హస్తం కూడా ఉన్నదని వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముస్లిం మహిళలను టార్గెట్ చేసుకోవటం ఇది కొత్తేమీ కాదని సామాజిక కార్యకర్తలు చెప్తున్నారు. 2002 గుజరాత్ అల్లర్లలోనూ ముస్లింలను, ముఖ్యంగా ఆ మతానికి చెందిన మహిళలపై జరిగిన దాడులను గుర్తు చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ పరివారమంతా ఆదర్శమూర్తిగా, జాతీయవాదిగా ప్రేమించే వి.డి సావర్కర్ గతంలో చేసిన మాటలనూ వారు ఉటంకిస్తున్నారు. 'హిందూ రాజులు ప్రతీకారచర్యలో భాగంగా ముస్లిం మహిళలపై లైంగికదాడి, వేధింపులకు పాల్పడటం చేసి ఉండాల్సింది' అని సావర్కర్ 'సిక్స్ గ్లోరియస్ ఎపోక్స్'లో చెప్పారని వివరిస్తున్నారు.

వాస్తవానికి భారత్ అనేది ఒక లౌకిక దేశం. అయితే, బీజేపీ కేంద్రంలో, ఇతర రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నది. హిందూత్వ శక్తులకు మద్దతు పలుకుతున్నది. వారు చేసే ఇలాంటి దారుణ పనులకు అభ్యంతరం చెప్పటం లేదు. ఐటీ చట్టం, రాజద్రోహం వంటి వాటిని మీడియా, సామాజిక కార్యకర్తలపై ప్రయోగించి భావ ప్రకటనా, పత్రికా స్వేచ్ఛను హరించే మోడీ సర్కారుకు.. సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ విషపు ప్రచారం కనిపించటం లేదా? అని సామాజిక కార్యకర్తలు, మేధావులు ప్రశ్నిస్తున్నారు.



పంట రక్షణే ప్రమాదమై..

విద్యుద్ఘాతంతో అన్నదమ్ములు మృతి





నవతెలంగాణ-జహీరాబాద్

అడవి పందుల నుంచి పంటను రక్షించుకునేందుకు చేపట్టిన ప్రయత్నం విఫలమై అన్నదమ్ములు విద్యుద్ఘాతంతో మృతి చెందారు. బైండింగ్ వైరును పంట చుట్టూ ఏర్పాటు చేసి.. 11 కేవీ విద్యుత్ వైర్ల ద్వారా నేరుగా కరెంట్ షాక్ ఇద్దామని ప్రయత్నిస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇద్దరూ మరణించారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం గోవింద్‌పూర్‌లో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకల జగన్(48), ఎరుకల మల్లేశం అనే అన్నదమ్ములు వారి చెరకు పంటను అడవి పందుల నుంచి కాపాడుకోవడానికి పంట చుట్టూ బైండింగ్ వైరుతో రక్షణ ఏర్పాటు చేశారు. ఆ బైండింగ్ తీగలకు పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ లైన్ ద్వారా కరెంట్ ఇవ్వాలనుకున్నారు. గురువారం సాయంత్రం ఏడు గంటల సమయంలో కొండీల ద్వారా కరెంటు ఇవ్వడానికి జగన్ ప్రయత్నిస్తుండగా విద్యుద్ఘాతంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి అక్కడికక్కడే మృతి చెందాడు. అది గమనించిన మల్లేష్ ఆ వైరును పక్కకు లాగేద్దామని పట్టుకోగానే.. అతడికి కూడా కరెంట్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

చాకచాక్యంగా వ్యవహరించిన బాలుడు..

14 ఏండ్ల వయస్సున్న బన్నీ.. మృతులైన తన మామలతో పొలం దగ్గరికి వెళ్లాడు. ప్రమాదం జరిగిన వెంటనే మామల చేతిలో ఉన్న వైరును పట్టుకోకుండా.. తన వద్ద ఉన్న కర్రతో కొట్టాడు. వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో అక్కడే ఉన్న గొడ్డలితో కొట్టి రక్షించడానికి ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో వెంటనే ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. సమాచారం అందుకున్న వెంటనే చిరాగ్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, 8 నెలల క్రితం అదే పొలం వద్ద మృతుల తండ్రి నాగన్న పాముకాటుతో మృతిచెందారు. మళ్లీ అక్కడే అన్నదమ్ములిద్దరూ మరణించడంతో వారి కుటుంబంతో పాటు.. గ్రామంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు జగన్ మొదటి భార్యకు ఇద్దరు పిల్లలున్నారు. ఆమె మృతిచెందడంతో మరో వివాహం చేసుకోగా.. ఆమెకు కూడా ఇద్దరు పిల్లలు ఉన్నారు. మల్లేష్‌కు ముగ్గురు పిల్లలు. తండ్రుల మృతితో ఆ పిల్లలందరూ అనాథలయ్యారు.

శాఖాపరంగా ఆదుకునేందుకు కృషి : విద్యుత్ శాఖ

పొలం పై నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ వైర్లే ప్రమాదానికి కారణమని, మృతుల కుటుంబ సభ్యులను ఆదుకోవాలని బంధువులు ఆందోళన చేశారు. దాంతో సెట్విన్ కార్పొరేషన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులతో చర్చలు జరిపి విద్యుత్‌శాఖ పరంగా వారి కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. దాంతో బంధువులు ఆందోళన విరమించారు.

ఆపరేషన్ 'డి'..

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లింది. ఎన్‌డీఆర్ఎఫ్ బృందం 110 మందిని తీసుకొని లోకో ట్రైన్ టన్నెల్‌లోకి వెళ్లింది. పర్యవేక్షణకు డోగ్రా రెజిమెంట్ ఆర్మీ కమాండెంట్ పరీక్షిత్ మెహ్రా, ఎన్‌డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ డా.హర్షిత్ వెళ్లారు. బెల్జియన్ మాలినోయిస్ బ్రీడ్‌కు చెందిన క్యాడవర్ శునకాలను టన్నెల్ లోపలికి తీసుకెళ్లారు. 15 ఫీట్ల లోపల ఉన్నా.. మృతదేహాలను గుర్తించడం వీటి ప్రత్యేకత అని అధికారులు చెబుతున్నారు. ఇవి కేరళ వాయనాడ్ వరద సమయంలో చిక్కుకున్న వారిని, బురదలో కూరుకున్న మృతదేహాలను పసిగట్టడంలో కీలక పాత్ర పోషించాయి. అక్కడి పరిస్థితులను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్ బాదావత్ ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నారు. ఉబికి వస్తున్న నీరు, పేరుకుపోతున్న బురదతో కార్మికుల ఆనవాళ్ల గుర్తింపు సవాలుగా మారింది. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సెక్రెటరీ కల్నల్ కీర్తి ప్రతాప్ సింగ్ శుక్రవారం టన్నెల్‌ను సందర్శించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఆయనకు రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ టన్నెల్‌కు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులను వివరించారు. సిస్మాలజీ బృందం పరీక్షల ద్వారా టన్నెల్ లోపల 13.6 కిలోమీటర్ల ప్రాంతంలో టీబీఎంపై రాళ్లు, మట్టి పడి యంత్రం ధ్వంసమైందని అధికారులు తెలిపారు. అందులోనే 8 మంది చిక్కుకుపోయుంటారని వివరించారు. అధికారుల బృందం దోమలపెంట రేంజ్‌లోని తాటిగుండాల సెక్షన్ పరిధిలోని కుడ్డిపెంట ప్రాంతంలో భూ పరిస్థితిని అంచనా వేసి పరీక్షలు నిర్వహించింది. దీని ఆధారంగా తదుపరి సహాయక చర్యలు కొనసాగించనున్నారు. నలుగురు సభ్యులతో కూడిన అన్వీ రోబోటిక్ నిపుణుల బృందం టన్నెల్‌లోకి వెళ్లింది. రోబోటిక్ నిపుణులతోపాటు ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ కూడా లోపలకు వెళ్లారు. సొరంగంలో కనిపించకుండా పోయిన వారిని క్యాడవర్ శునకాలు గుర్తించే పనిలో ఉన్నాయి. ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్, రోబోటిక్ నిపుణులు టన్నెల్‌లో పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. శుక్రవారం రోబోటిక్ సహాయంతో మరింత ముందుకు కదిలారు. టన్నెల్ లోపల బ్యాటరీ సమస్య ఉందని, రోజ్‌కట్టర్ అవసరం అని సమాచారం అందించిన వెంటనే లోకో మోటార్‌లో అధికారులు లోపలికి పంపారు.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 08-03-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 | సంచిక : 16 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 14 పేజీలు | వెల : 6.50

గ్రేటర్ హైదరాబాద్‌లో మరోసారి ఓటీఎస్

ఆస్తి పన్ను చెల్లింపులో డిస్కౌంట్

- జీహెచ్ఎంసీలో 90 శాతం వడ్డీని మాఫీ చేస్తూ వన్ టైమ్ సెటిల్‌మెంట్ సౌకర్యం



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ ప్రాపర్టీ ట్యాక్స్ పాత బకాయిలపై వడ్డీని మాఫీ చేస్తూ సర్కారు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 90 శాతం వడ్డీని మాఫీ చేస్తూ వన్ టైమ్ సెటిల్‌మెంట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. దాంతో 2024-25 సంవత్సరానికి కేవలం 10 శాతం వడ్డీతో బకాయిదారులంతా తమ ఆస్తిపన్ను చెల్లించే వసూలుబాటు కలుగుతుంది. ఇప్పటి వరకు రూ.6680 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ పేరుకుపోగా దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వ ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిలు కూడా రూ.5 వేల కోట్లకు పెరుకుపోయాయి. ఈ మొత్తం రూ.11వేల 680కోట్ల బకాయిలకు వడ్డీ మాఫీ చేస్తే కొంతైనా మొండి బకాయిలు వసూలవుతాయని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న జీహెచ్ఎంసీకి ఈ వడ్డీ మాఫీతో నెలాఖరు వరకు సుమారు రూ.500 కోట్లవరకైనా ట్యాక్స్ వసూలై, ఆర్థికంగా ఉపశమనం కల్గిస్తుందన్న ఆలోచనలతోనే ప్రభుత్వం వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీంను అమల్లోకి తెచ్చినట్టు తెలిసింది. ఈ ఉత్తర్వులు ఈ నెలాఖరు వరకు అమల్లో ఉంటాయని సర్కారు స్పష్టం చేసింది. మొండి బకాయిలు వసూలు చేసుకునేందుకు జీహెచ్ఎంసీ ఇప్పటికే సుమారు 6లక్షల 30వేలకుపైగా నోటీసులు జారీ చేసింది. వీటిలో కొన్నింటికి వారెంట్లను జారీ చేయగా, ఇప్పటి వరకు 469 ఆస్తులను సీజ్ చేసింది. వాటి బకాయిలు ఇప్పటి వరకు రూ.19 కోట్లను వసూలు చేయగా, గురువారం ఒక్క రోజే సీజింగ్ ప్రాపర్టీల నుంచి సుమారు రూ.6.6 కోట్లు వసూలైనట్టు అధికారులు తెలిపారు. మరో రూ.443 కోట్ల ట్యాక్స్‌ను ఈ నెలాఖరులోపు వసూలు చేయాలన్న లక్ష్యం ఉంది.

పునర్విభజన ప్రక్రియపై సమైక్య పోరు

చేతులు కలపాలని కోరుతూ దక్షిణాది, తూర్పు రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ లేఖ



చెన్నై : లోక్‌సభా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను వ్యతిరేకిస్తూ సమైక్య ఫ్రంట్‌ను ఏర్పాటు చేసేందుకు కలిసి రావాల్సిందిగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ దక్షిణాది, తూర్పు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరారు. వచ్చే జనాభా లెక్కల ప్రకారం ఆ ప్రక్రియను అమలు చేసినట్టైతే జనాభా పెరుగుదలను విజయవంతంగా నియంత్రించిన రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం గణనీయంగా ...10లో

10న గ్రూప్-1 ప్రొవిజినల్ మార్కుల ప్రకటన

11న గ్రూప్-2, 14న గ్రూప్-3 జీఆర్ఎల్ విడుదల

- 17న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాలు
- 19న ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ జీఆర్ఎల్ జారీ : టీజీపీఎస్సీ చైర్మెన్ బుర్రా వెంకటేశం

వివరాలు 2లో..

దక్షిణాదిపై బీజేపీ ప్రతీకారం

నియోజకవర్గాల పునర్విభజనను అందుకు ఆయుధంగా వాడుతోంది

- ఏం చేసినా దక్షిణాదిలో కమలం పార్టీ జీరోనే
- గుజరాత్ మోడల్‌కు కాలం చెల్లింది
- తెలంగాణ నమూనానే దేశానికి ఆదర్శం : ఇండియా టుడే కాంక్లేవ్‌లో సీఎం ఎ.రేవంత్ రెడ్డి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ లేదని, అందుకే ఆ రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకుంటున్నదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విమర్శించారు. గుజరాత్ నమూనాకు కాలం చెల్లిందని, తెలంగాణ నమూనానే దేశానికి ఆదర్శమని స్పష్టం చేశారు. శుక్రవారం నాడిక్కడ ఇండియా టుడే కాంక్లేవ్‌లో సీఎం ఎ.రేవంత్ రెడ్డి మాట్లా డారు. "గుజరాత్ నమూనాలో ఏ విధమైన సంక్షేమం లేదు. ఏమైనా అభివృద్ధి ఉందనుకుంటే అదీ లేదు. మోడీ ప్రధాని అయిన తర్వాత గుజరాత్ మార్కెటింగ్‌కు ఎవరైనా అంబాసిడర్ ఉన్నారా? లేరా? మోడీనే సొంతంగా గుజరాత్ కోసం ఉన్నారు. మోడీ ఈ దేశానికి ప్రధాని. ప్రధానమంత్రి హోదాలో.. దేశంలో ఏమూలకైనా పెట్టుబడులు వస్తే వాటికి ఆయన మద్దతు ఇవ్వడం లేదు. ఎవరైనా దేశానికి పెట్టుబడులు పెట్టడానికి వస్తే గుజరాత్ కు వెళ్లి పెట్టుబడులు పెట్టమని చెబుతున్నారు. ఇదేం పద్ధతి..?" అని ప్రశ్నించారు. "మాది అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన నమూనా. ఈ మూడు మా ప్రాధాన్యాంశాలు. మేం అహ్మదాబాద్, ముంబయి, బెంగళూర్, ఢిల్లీతో పోటీ పడడం లేదు. మేం న్యూయార్క్, సియోల్, టోక్యోతో పోటీ పడాలనుకుంటున్నాం. మా తెలంగాణ నమూనాతో ఎవరూ పోటీ పడలేరు" అని అన్నారు. "అందుకే మేం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తున్నాం. 30 వేల ఎకరాల్లో అద్భుతమైన నగరం నిర్మించే పని ప్రారంభించాం. ఐదేండ్ల తర్వాత వచ్చి చూడండి. ప్రపంచంలో అత్యుత్తమ నగరం నిర్మించబోతున్నాం. గుజరాత్‌లో అటువంటి నగరం ఎక్కడైనా ఉందా..? కోవిడ్ సమయంలో ఔషధాలు ఎక్కడ తయారయ్యాయి. మూడో వంతు ఔషధాలు మేం సరఫరా చేశాం. దేశంలోని 35 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లో ఉత్పత్తి అవుతు న్నాయి. ఐటీ గురించి మేం ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అహ్మదాబాద్‌లో ఐటీ ఏం ఉంది" అని ప్రశ్నించారు.

"హైదరాబాద్ ఇప్పుడు ప్రారంభమైంది కాదు. కులీ కుతుబ్ షాహీ నుంచి ప్రారంభమైంది. కులీ కుతుబ్ షా తరువాత నిజాం సర్కార్, తరువాత బ్రిటిష్ ప్రభుత్వం, స్వాతంత్ర్యం తరువాత మర్రి చెన్నారెడ్డి, ...10లో

కేంద్రంపై పోరు

13లో

నేడు ప్రజాభవన్‌లో అన్ని పార్టీల ఎంపీలతో భేటీ

పెండింగ్ సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

రిజర్వేషన్ల చట్టబద్ధతపై చర్చించనున్న సర్కార్

12 నుంచి అసెంబ్లీ

గెజిట్ నోటిఫికేషన్ జారీ

- బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణపై చర్చ



వివరాలు 13లో



దిశానిర్దేశం

ఏప్రిల్ 27న బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారీ బహిరంగ సభ


- ఫామ్‌హౌస్‌లో ముఖ్యనేతలతో కేసీఆర్ సమాలోచనలు

నవతెలంగాణ-మర్కుక్

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలపై పార్టీ అధినేత కేసీఆర్ శుక్రవారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై కేసీఆర్ చర్చించినట్టు తెలిసింది. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ 27న బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారీ బహిరంగసభను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అలాగే ఏప్రిల్ 10న హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రతినిధుల సమావేశం ఉంటుందని సమాచారం. సిల్వర్ జూబ్లీ పేరుతో హైదరాబాద్ లేదా వరంగల్‌లో బహిరంగ సభకు ప్లాన్ చేస్తున్నారు. కాగా, ఈ నెల 9 నుంచి ...13లో

కొత్త ఐటీ చట్టం గోప్యతకు ముప్పు

ప్రజలు, విపక్షాలు బిల్లును వ్యతిరేకించాలని కేటీఆర్ విజ్ఞప్తి 13లో



సమగ్రసర్వేపై

స్వతంత్ర కమిటీ

చైర్మెన్‌గా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమగ్ర కుటుంబ సర్వేపై అధ్యయనానికి సామాజికవేత్తలతో స్వతంత్ర హోదాతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఆ సర్వేలోని సమాచారాన్ని విశ్లేషణ చేసి పొరపాట్లకు అవకాశం లేకుండా మేధావులు, సామాజిక శాస్త్రవేత్తలు కృషి చేయాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సలహా కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి చైర్మెన్‌గా, రిటైర్డ్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య వైస్ చైర్మెన్‌గా, ప్రవీణ్ చక్రవర్తి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని భట్టి ...2లో

కార్మికుల కడుపుకొట్టి

యాజమాన్యాలకు దోచిపెడతారా?

కనీస వేతనాలను సవరించాల్సిందే... 1.20 కోట్ల మంది కష్టాలను పట్టించుకోండి

- అక్కడ మోడీ.. ఇక్కడ రేవంత్ శ్రమజీవులను దోచుకోవటంలో దొందు దొందే : ధర్నాలో చుక్కారాములు, పాలడుగు భాస్కర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పెరిగిన ధరలకనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాల్సిందేనంటూ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కారాములు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కమిషనరేట్ వద్ద సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు సవరించి ఫైనల్ జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. 'కార్మికుల కష్టాలు పట్టించుకోని ప్రభుత్వం డౌన్ డౌన్, 2024 జనవరి నెలలో ఇచ్చిన డ్రాఫ్ట్ జీవోలను సవరించి కనీస వేతనం పెంచాలి, 2021లో ఐదు రంగాల షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ ఫైనల్ నోటిఫికేషన్లను గెజిట్ చేయాలి, కనీస వేతనాల సలహామండలిలో అన్ని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి, వూయ్ వాంట్ జస్టిస్ అంటూ నినదించారు. సర్కార్ స్పందించకపోతే పోరాటం తప్పదంటూ హెచ్చరించారు.

ధర్నానుద్దేశించి చుక్కా రాములు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 1.20 కోట్ల మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారికి వర్తించే 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతనాలను వారి 2006-12 మధ్య సవరించారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడి 11 ఏండ్లయినా నేటికీ వారి వేతనాలు ఎందుకు పెంచలేదో చెప్పాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సమావేశాలకు, ప్రతిపాదనలకే పరిమితమైందని విమర్శించారు. అడ్వైజరీ బోర్డు నుంచి ప్రతిపాదనలు తీసుకుని ఫైనల్ జీఓలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పాలకుల నిర్లక్ష్యం మూలంగా లక్షలాది మంది కార్మికులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు విపరీతంగా పెరిగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ద్రవ్యోల్బణం సగటున 6శాతంగా ఉందని తెలిపారు. కార్మికుల అవసరాలు కూడా పెరిగాయన్నారు. ఇతర వినియోగ వస్తువుల అవసరాలు, ఖర్చులు అదనంగా ఉంటున్నాయని చెప్పారు. వీటిని పరిగణలోకి తీసుకు ని 15వ ఐఎల్‌సీ తీర్మానం, ఆక్రాయిడ్ ఫార్ములా, 1992 సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా లెక్కించి వేతనాలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో 2021 జూన్‌లో 5 రంగాల షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ కనీస వేతనాలు సవరిస్తూ ఫైనల్ నోటిఫికేషన్లు ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ.. యాజమాన్యాల ఒత్తిడికి లొంగి గెజిట్ చేయకుండా కార్మికులకు అన్యాయం చేసిందని విమర్శించారు.దీన్ని బట్టే పాలకులు ఎవరి పక్షమో అర్థమవుతుందని విమర్శించారు. కనీస వేతనాల జీవోలను సవరించటం ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఎలాంటి లోటు లేదనీ, అయినా ప్రభుత్వం కార్మికుల వేతనాల పట్ల ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కనీస ...13లో

21 మంది ఐపీఎస్‌ల బదిలీలు

ఎస్పీలు, కమిషనర్లకు స్థాన చలనం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో కొన్ని జిల్లాల ఎస్పీలు, నగర కమిషనర్లకు స్థానచలనం కలిగింది. రాష్ట్ర ఎస్పీఎఫ్ డీజీ అనిల్ కుమార్‌ను రాష్ట్ర పోలీస్ పర్సనల్ అదనపు డీజీగా బదిలీ చేశారు. రామగుండం కమిషనర్ ఎం.శ్రీనివాసులును సీఐడీ ఐజీగా, వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను రామగుండం కమిషనర్‌గా, సూర్యాపేట్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌కు డీఐజీగా పదోన్నతి ఇచ్చి వరంగల్ సీపీగా నియమించారు.పెద్దపల్లి డీసీపీ చేతనను రాష్ట్ర మహిళా భద్రత విభాగం ఎస్పీగా, కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ ఇంటెలిజెన్స్ విభాగానికి, యాదాద్రి డీసీపీ రాజేష్ చంద్రను కామారెడ్డి ఎస్పీగా, నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయిచైతన్యను నిజామాబాద్ సీపీగా, ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలంను కరీంనగర్ ...13లో



ఆపరేషన్ డి

ఎస్ఎల్‌బీసీలో కార్మికుల కోసం అన్వేషణ

- సిస్మాలజీ బృందం పరీక్షలు
- టన్నెల్‌లోకి బెల్జియన్ మాలినోయిస్ బ్రీడ్ క్యాడవర్ శునకాలు
- మట్టి పడి టీబీఎం యంత్రం ధ్వంసం
- అందులోనే 8 మంది చిక్కుకున్నట్టు అనుమానాలు

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికుల కోసం రెస్క్యూ ఆపరేషన్14వ రోజుకు చేరింది. రెస్క్యూ బృందాలు ఆపరేషన్ 'డి'ని అమలు చేస్తున్నాయి. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కార్మికుల అన్వేషణకు శుక్రవారం ఉదయం 7.15 నిమిషాలకు క్యాడ్‌వార్ డాగ్స్ బృందం ...2లో

ఏప్రిల్ నుంచి

ఉద్యోగుల బిల్లులు చెల్లిస్తాం

నెలకు రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్లు విడుదల చేస్తాం

- బకాయిల కోసం ఉద్యోగులు తిరగాల్సిన పనిలేదు : ఉద్యోగ జేఏసీ నేతల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పెండింగ్ బిల్లుల కోసం ఉద్యోగులు తిరగాల్సిన పనిలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఏప్రిల్ నుంచి ఉద్యోగులను పెండింగ్ బిల్లులను ప్రాధాన్యతా క్రమంలో చెల్లిస్తామని చెప్పారు. నెలకు రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్ల వరకు విడుదల చేస్తామని వివరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ ఉద్యోగ జేఏసీ నేతలతో భట్టి విక్రమార్క సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన రూ.పదివేల కోట్ల బకాయిలను చెల్లించామని అన్నారు. దశాబ్దాలుగా పనిచేసిన ఉద్యోగులు దాచుకున్న డబ్బు కోసం పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాను అర్థం చేసుకుని ఒక నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించిన రూ.ఐదు వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో ఉంచిందని వివరించారు. గత 14 నెలల కాలంలో కొంత బకాయిలు జమ అయ్యాయని చెప్పారు. పాత, కొత్త పెండింగ్ బిల్లులు రూ.10 వేల కోట్లు తమ ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. మరో రూ.ఎనిమిది వేల కోట్ల బకాయిలు మిగిలి ఉన్నాయని ...13లో

ఇంజినీరింగ్ కోర్సుపై అనాసక్తి

- ఆసక్తి చూపని విద్యార్థులు
- తక్కువ ప్లేస్‌మెంట్ రేటే కారణం
- ఖాళీగా మిగిలిపోతున్న లక్షలాది సీట్లు : ఏఐసీటీఈ డేటా
- ప్రత్యామ్నాయ కోర్సుల వైపు స్టూడెంట్స్ చూపు



దేశంలోని సాంకేతిక రంగంలో ఇంజినీరింగ్ విద్య అనేది చాలా కీలకం. ప్రపంచంతో పోటీ పడే విధంగా దేశ భవిష్యత్తును ఈ కోర్సులు తీర్చి దిద్దుతాయనటంలో ఎలాంటి సందేహమూ లేదు. అంతేకాదు.. కోర్సు పూర్తయిన తర్వాత విద్యార్థులు ఎక్కువ జీతాలతో ఉద్యోగాలను పొందేందుకు దారిని కూడా చూపిస్తాయి. అందుకే.. గత కొన్నేండ్ల క్రితం వరకు ఇంజినీరింగ్ కోర్సులకు డిమాండ్ ఎక్కువ. ఈ కోర్సుల్లో చేరటానికే విద్యార్థులు ఆసక్తి చూపేవారు.

తగ్గిన ప్లేస్‌మెంట్లు

న్యూఢిల్లీ : ప్రస్తుతం దేశంలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. విద్యార్థుల ఆలోచన తీరు మారింది. ఒకప్పుడు ఇంజినీరింగ్ కోర్సుల్లో ఎన్‌రోల్‌మెంట్ ఎక్కువగా ఉండేది. ప్లేస్‌మెంట్ రేట్లు కూడా చక్కగానే ఉండేవి. అయితే, భారత్‌లోని ఇంజినీరింగ్ కాలేజీలలో మాత్రం ఎన్‌రోల్‌మెంట్, ప్లేస్‌మెంట్ రేట్లు తగ్గాయి. ఒకప్పుడు వెలుగువెలిగిన ఇంజినీరింగ్ కోర్సులు.. ఇప్పుడు వెలవెలబోతున్నాయని విద్యావేత్తలు, నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు. భారత్‌లో టెక్నికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటర్ అయిన ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) సమాచారమూ ఇదే విషయాన్ని వివరిస్తుండటం గమనార్హం. దేశంలో ఇంజినీరింగ్ కోర్సులకు డిమాండ్ తగ్గిందనీ, గత కొన్నేండ్లుగా ఇదే పరిస్థితి ఉన్నదని ఏఐసీటీఈ డేటా వివరిస్తున్నది. ఒకప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన వృత్తి విద్యగా ఇంజినీరింగ్ కోర్సుకు మంచి గౌరవం, డిమాండ్ ఉండేది. అయితే, గత కొన్నేండ్లుగా మాత్రం ఈ కోర్సులో చేరేవారి సంఖ్య మాత్రం తగ్గిపోయింది. దేశవ్యాప్తంగా 2019-20 నుంచి 2023-24 మధ్య మూడువేలకు పైగా ప్రభుత్వ అనుబంధ, ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీలలో 64 లక్షల సీట్లకు గానూ 45.50 లక్షల సీట్లు భర్తీ అయ్యాయి. దాదాపు రెండు లక్షల బీటెక్ సీట్లు అంటే 30 శాతం భర్తీ కాకుండా ...13లో

ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు సవాల్‌గా మారాయి. దేశవ్యాప్తంగా 2019-20 నుంచి 2022-23 మధ్య దాదాపు 34.30 లక్షల మంది విద్యార్థులు అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరారు. అయితే, 16.4 లక్షల మందికి, అంటే 47.7 శాతం మంది విద్యార్థులు మాత్రమే ప్లేస్‌మెంట్‌లో విజయం సాధించటం గమనించాల్సిన అంశం.

సంపాదకీయం

వ్యంగ్యానికి సంకెళ్లు



'వికటన్' వెబ్‌సైట్‌ను కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అన్‌బ్లాక్ చేయాలని మద్రాస్ హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వు వ్యంగ్యానికి కేంద్ర ప్రభుత్వం వేసిన సంకెళ్లను సడలించడమే! ఇది స్వాగతించదగినది. అయితే, వివాదానికి మూలమైన కార్టూన్‌ను తాత్కాలికంగా తొలగించాలని చెప్పడం ద్వారా కేంద్ర నిరంకుశాధికారాల్ని న్యాయస్థానం నిర్ద్వంద్వంగా తోసిపుచ్చకపోవడం ప్రజాస్వామ్య ప్రియులకు, భావ ప్రకటనా స్వేచ్ఛను బలపరిచే వారికీ బాధ కలిగిస్తుంది. అమెరికాలో నివసించడానికి తగు చట్టబద్ధ పత్రాలు లేవన్న కారణంతో వేలాదిమంది భారతీయ సంతతి పౌరులను అక్రమ వలసదారులని ముద్రవేసి, వారిని ఆ దేశం నుండి వెళ్లగొడుతున్న సంగతి లోకానికి ఎరుకే. అయితే, వారిని

జాతీయోద్యమ కాలం నుండి వందేళ్ల చరిత్రగల 'వికటన్' వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసిన కేంద్ర మంత్రిత్వశాఖ కనీసం ఆ సమాచారాన్ని పదిహేను రోజులకు కూడా తెలియజేయకపోవడంతో మద్రాస్ హైకోర్టు గడప తొక్కవలసి వచ్చింది. ఈ నేపథ్యంలో జరిగిన విచారణలో ధర్మాసనం 'వికటన్' వెబ్‌సైట్‌ను అన్‌బ్లాక్ చేయాలని ఉత్తర్వులీయడం సానుకూలమైనదే! అయితే, ఆ కార్టూన్‌ను తాత్కాలికంగా తొలగిస్తేనే అన్‌బ్లాక్ చేయాలనడాన్ని ఎవరూ సమర్థించలేని పరిస్థితి. ఏది ఏమైనా మోడీ సర్కారు నిరంకుశ పోకడలపై ప్రజాస్వామ్యానికి నాలుగవ స్తంభంగా పేరున్న మీడియా ఇలా ప్రచురించడం, నిర్బంధం విధిస్తే దాన్ని ప్రశ్నించడం అభినందనీయం.

కరుడుగట్టిన నేరస్తులు లేదా ఉగ్రవాదుల మాదిరి కాళ్లను గొలుసులతో బంధించి, చేతులకు సంకెళ్లు వేసి మాతృదేశానికి పంపడంతో యావత్ భారతీయులు తల్లడిల్లిపోయారు. అయినా పాలక బీజేపీకి, ప్రధాని మోడీకి ఇది పట్టలేదు. పైపెచ్చు తగిన పత్రాలు లేకుండా మరో దేశంలో నివసించడం నేరమేనంటూ భారతీయ మూలాలున్న పౌరులను కించపరుస్తున్నారు. ఇటీవల కేంద్ర మంత్రి ఖట్టర్ దారుణమైన వ్యాఖ్యలు మరింత బాధాకరం.

అక్రమ వలసదారుల పేరిట మన పౌరులను గొలుసులు, బేడీలతో అమృతసర్ విమానాశ్రయానికి తరలించిన సమయంలోనే ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ల భేటీ జరిగింది కానీ భారత సంతతి పౌరులకు జరిగిన అవమానాన్ని గురించి ప్రశ్నించడం కాదు సరికదా కనీస ప్రస్తావన కూడా చేయలేదు. ఇటువంటి దుర్మార్గాన్ని ఎండగడుతూ 'వికటన్' వెబ్‌సైట్ ఒక కార్టూన్‌ను ప్రచురించింది. ఇరు దేశాధినేతల భేటీలో ప్రధాని నరేంద్ర మోడీ సంకెళ్లతో పాల్గొన్నట్లు దాంట్లో చిత్రించడం వాస్తవ పరిస్థితిని కళ్లకు కట్టింది. ఒక్క కార్టూన్‌లో ట్రంప్ దుర్మార్గాన్ని, నరేంద్ర మోడీ అచేతనత్వాన్ని, భారతీయుల ఆవేదననూ వ్యక్తం చేసిందనడంలో ఎలాంటి సందేహం లేదు. భారతీయ ఆత్మను, భారతీయుల ఆవేదననూ ప్రతిబింబించిన ఆ కార్టూన్‌పై ఆగ్రహించిన తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడం, సమాచార ప్రసారశాఖ 'వికటన్' వెబ్‌సైట్ మొత్తాన్ని బ్లాక్ చేయడమూ ఆగమేఘాలపై జరిగిపోయాయి. ఎన్నో ఆశలతో అమెరికాకు వెళ్లి అరదండాలతో వెనుదిరిగిన వేలాది మంది భారత యువతీయువకుల గురించి ఏమాత్రం చింతించని కమలం పార్టీ నేతలు ఈ కార్టూన్‌కు అంతలా కలత చెంది, ఆ వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయించడం వారి నిరంకుశ పోకడలకు నిలువెత్తు నిదర్శనం. 1975-77 మధ్య దేశంలో సాగిన మీడియా సెన్సార్‌కు దీనికి ఏమీ తేడా లేదు కదా! అందుకే నరేంద్ర మోడీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలులో ఉందన్న కొందరి వ్యాఖ్యలు ఎంతమాత్రం సత్యదూరం కాదు.

జాతీయోద్యమ కాలం నుండి వందేళ్ల చరిత్రగల 'వికటన్' వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసిన కేంద్ర మంత్రిత్వశాఖ కనీసం ఆ సమాచారాన్ని పదిహేను రోజులకు కూడా తెలియజేయకపోవడంతో మద్రాస్ హైకోర్టు గడప తొక్కవలసి వచ్చింది. ఈ నేపథ్యంలో జరిగిన విచారణలో ధర్మాసనం 'వికటన్' వెబ్‌సైట్‌ను అన్‌బ్లాక్ చేయాలని ఉత్తర్వులీయడం సానుకూలమైనదే! అయితే, ఆ కార్టూన్‌ను తాత్కాలికంగా తొలగిస్తేనే అన్‌బ్లాక్ చేయాలనడాన్ని ఎవరూ సమర్థించలేని పరిస్థితి. ఏది ఏమైనా మోడీ సర్కారు నిరంకుశ పోకడలపై ప్రజాస్వామ్యానికి నాలుగవ స్తంభంగా పేరున్న మీడియా ఇలా ప్రచురించడం, నిర్బంధం విధిస్తే దాన్ని ప్రశ్నించడం అభినందనీయం. న్యాయస్థానం పరిమితంగానైనా ఊరట నివ్వడం మంచిదే! అయితే విపత్కర పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న 'వికటన్' వెబ్‌సైట్‌కు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియాతో సహా తమిళనాట అనేక మీడియా సంస్థలు సంఘీభావం తెలపడం శుభసూచికం. నిరంకుశ పోకడలను ఆదిలోనే ప్రశ్నించాలి, ఎదుర్కోవాలి, తిప్పికొట్టాలి. లేకపోతే అది తొండ ముదిరి ఊసరవెల్లి అయిన చందంగా ఒకనాటి హిట్లర్, ముస్సోలినీల పాలనను తిరిగి తేవాలనుకుంటున్న శక్తుల ప్రమాదం పెరుగుతుంది. ప్రజాస్వామ్య ప్రియులు, భారత రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా స్వేచ్ఛ పరిఢవిల్లాలని కోరుకునే వారందరూ అప్రమత్తంగా ఉండాలి. ముప్పును నివారించుకోవాలి!

"మార్చి 8" ఉత్సవం కాదు, మహోజ్వల పోరాట ఘట్టం


సతీష్ బైరెడ్డి
9949219213


ఏదైనా ప్రజాఉద్యమ చరిత్రను మరుగునపర్చాలన్నా దాని స్ఫూర్తిని చంపేయాలన్నా దాన్ని ఉత్సవంగా మారిస్తే సరిపోతుందని పాలకులు అన్ని దేశాల్లో ప్రయత్నిస్తూనే ఉన్నారు. దానికి ఉదాహరణ అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినమైన మార్చి ఎనిమిదికంటే మరొకటుండదు. సరిగ్గా మనం గమనిస్తే దీన్ని వక్రీకరించినంతగా మరొక రోజు మనకు కనిపించదు.

పద్దెనిమిదో శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక విప్లవం విస్తరించిన నేపథ్యంలో ప్రధానంగా యూరప్, అమెరికా దేశాల్లో కార్మికులపైన శ్రమదోపిడీ కూడా అంతగానే విస్తరించింది. మహిళా కార్మికులైతే పనిచేస్తున్న చోట, ఇంట్లోనూ దోపిడీ, హింసనూ ఎదుర్కోవాల్సి వచ్చింది.బట్టల మిల్లుల్లో పనిచేసే స్త్రీలు అయితే రోజుకు పదహారు గంటల పాటు బలవంతంగా పనిచేయాల్సి వచ్చింది. గాలి, వెలుతురుతో పాటు ఇతర సదుపాయాల లేమి వల్ల వారు తీవ్రమైన అనారోగ్యానికి గురై ప్రధానంగా కంటిచూపును కోల్పోయారు. తమ చంటి పిల్లలకు పాలివ్వకుండా నిరంతరాయంగా పనిచేయాల్సి రావడం వల్ల మరుగుదొడ్లల్లో పిల్లలకు చాటుగా పాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలీ చాలని వేతనాలు, లైంగిక వేధింపులు అనేక రూపాల్లో అవమానాలు, అణచివేత నిత్యకృత్యమై తరుణంలో మహిళా కార్మిక లోకాన్ని ఉద్యమించక తప్పని స్థితికి నెట్టివేశాయి. ఈ నేపథ్యంలోనే 1908 మార్చిలో న్యూయార్క్‌లో 15వేల మంది మహిళా కార్మికులు పని గంటలు తగ్గించాలని, సమాన పనికి సమాన వేతనమందించాలని, వేతనంతో కూడిన ప్రసూతి సెలవుకై, పిల్లల బాగోగులు, వారికి ఉచిత విద్యను అందించడం, ఓటింగు హక్కులు కల్పించాలని, పనిచేసే చోట మెరుగైన పరిస్థితులను ఏర్పర్చాలని మహా ప్రదర్శనను నిర్వహించారు. చారిత్రాత్మకమైన ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా మహిళలను మరింత సంఘటితపరిచేలా, నిర్మాణాత్మకమైన పోరాటాలకు పురికొల్పేలా చేసింది. నిజానికి ఈ గొప్ప పరిణామం వెనుక అర్ధ శతాబ్దానికి పైగా సాగిన అనేక అసంఘటిత పోరాటాలు, చరిత్రకు చేరని ఎన్నో ఘటనలు ఉన్నాయి. అమెరికన్ సోషలిస్టు పార్టీ, జర్మనీకి చెందిన సోషల్ డెమోక్రటిక్ పార్టీ నాయకురాలు క్లారా జెట్కిన్‌తో పాటు రోజా లగ్జెంబర్గ్ లాంటి వాళ్లు భూస్వాములకు, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా మహిళా శక్తిని సమీకరించి క్రియాశీలకంగా వ్యవహించారు.

అమెరికన్ సోషలిస్టు పార్టీ మొదటగా మహిళా ఉద్యమ స్ఫూర్తిని చాటేలా ఫిబ్రవరి 28ని మొదటి మహిళా దినంగా ప్రకటించింది. నేడు జరుపుకుంటున్న మార్చ్ 8ని 1910లో కోపెన్ హెగెన్‌లో క్లారా జెట్కిన్ ప్రతిపాదించగా వంద దేశాల ప్రతినిధులు ఆమోదించారు. 1911 మార్చ్ 25న న్యూయార్క్ నగరంలో ట్రయాంగిల్ అగ్ని ప్రమాదంగా ప్రసిద్ధమైన అక్కడి బట్టల మిల్లులో జరిగిన భారీ అగ్ని ప్రమా దంలో 146 మంది ప్రధానంగా 123 మంది మహిళా కార్మికులు తమ ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ మొత్తంలో కూడా 14 నుండి 23 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళా కార్మికులే ఎక్కువగా ఉన్నారు. అదే కాలంలో ముంచుకొచ్చిన మొదటి ప్రపంచ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ, ప్రపంచవ్యాప్త శాంతిని కాంక్షిస్తూ రష్యన్ మహిళలు నినదించారు. మొత్తంగా మార్చ్ 8 అనేది ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక మహిళా పోరాట దినంగా ప్రాచుర్యం పొంది, ముందు తరాలను మరింతగా ప్రేరేపించి పోరాట జెండాను విడవకుండా సమాన హక్కులు, స్వేచ్ఛకై మహిళా విముక్తికై ఎలుగెత్తేలా నిలిచిపోయింది. 1975 నుండి ఐక్యరాజ్య సమితి కూడా ఈరోజు ప్రాధాన్యతను గుర్తించి ప్రతిఏడాది ఏదో ఒక కొత్త నినాదంతో ఈ పోరాట దినాన్ని జరుపుకోవడం ప్రారంభించింది.

ఇంతటి సుదీర్ఘమైన, చైతన్యవంతమైన, ఉద్వేగభరితమైన చరిత్ర కలిగి సగం ప్రపంచానికి సంబంధించిన రోజును 'ఉత్సవం'గా మార్చే పనికి ప్రయత్నాలు ప్రపంచీకరణకు అడుగులు పడడంతోనే మొదలైనా ఆయా దేశాల్లోని భూస్వామ్య వర్గాలు, మతచాందస శక్తులు, పెట్టుబడి దారులు కొత్త చరిత్రను నిర్మించిన మహిళా ఉద్యమ చైతన్యాన్ని నీరుగార్చేలా, దారితప్పించేలా నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నారు. నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో ముడిసరుకులకై సహజ వనరుల వేటలో, మార్కెట్ విస్తరణలో భాగంగా మహిళా శ్రమను చౌకగా పొందే దోపిడీ యత్నాల్లోనూ మహిళా దినం మరింత పలచబడింది. స్త్రీని విలాస వస్తువుగా చూసిన భూస్వామ్యం, సరుకుగా మార్చిన పెట్టుబడి వీటన్నింటికి తార్కిక లెజిటిమసీని ఇచ్చిన మత గ్రంథాలు, మహిళా ఉద్యమాన్ని కొత్త రూపాల్లో అణిచివేస్తున్నాయి. ఎన్ని రూపాల్లో అణిచివేయవచ్చో, ఎన్ని రంగాల్లో అణిగిమణిగి ఉండేలా చేయవచ్చో వాటన్నిటికి కట్టుబాట్లు, సిద్ధాంత రూపాలను అన్ని మత గ్రంథాలు బోధించాయి.

సంఘంలో ఆమె స్థానమంటూ ప్రత్యేకంగా ఏమీలేదని, పురుషుడి వల్లే ఆమె స్థానం నిర్ణయించబడుతుందని, తనంతట తానుగా తన ఉనికిని వ్యక్తిగా చాటుకునే అవకాశమే లేకుండా సామాజిక అణిచివేత కొనసాగుతున్న నేపథ్యంలోనే పెట్టుబడుల ప్రవాహం, మార్కెట్ విస్తరణతో కొత్త రూపంలో అదే స్థితిని కొనసాగించేలా 'ఉత్సవ' నినాదాలు ఊపందుకున్నాయి. భారతదేశ సందర్భంలో అయితే స్త్రీని దేవతీకరించి, ఆదర్శీకరించి ఉత్తమ గుణాలు కలిగిన వ్యక్తి అని కీర్తించే బ్రాహ్మణీయ సంస్కృతి వారిని మరింతగా ఒంటింటి కుందేళ్ళుగా మార్చి వేసింది. ప్రశ్నించడాన్ని, స్వేచ్ఛకై ఎలుగెత్తడాన్ని బరితెగింపుగా ప్రచారం చేస్తూ మరింత అణిచివేతను అమలు చేస్తున్నది. మరోవైపు నూతన ఆర్థిక విధానాల అమలు తర్వాత వినియోగదారీ సంస్కృతి విచ్చలవిడిగా పెరిగిపోయి మహిళలపై మరింతగా ఇంటాబయటా హింస పెరిగి పోయింది. ప్రభావవంతమైన సినిమా మాధ్యమంలో, మీడియా వ్యాపార ప్రకటనల్లో స్త్రీల చిత్రీకరణ వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా, కేవలం పురుషున్ని సంతోషపెట్టే శారీరక నిర్మాణంగానే చూపించడం పెరిగిపోయింది. ఐటమ్ సాంగ్స్ సంస్కృతి వికృతి రూపం తీసుకుని స్త్రీని కేవలం వినోద వస్తువుగా స్థిరపరిచే వ్యాపార ధోరణి ప్రమాదకర స్థితికి చేరుకున్నది. యాసిడ్ దాడులు, పెట్రోల్ పోయడాలు, నడి బజారులో నరికి వేయడాలు, లైంగికదాడుల ఘటనలు యథావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి.



మైదాన ప్రాంతాల్లో స్త్రీలపై జరిగే అనేక ఘోర వృత్తాంతాలు కొన్నైనా వెలుగు చూసే అవకాశమున్నా అడవుల్లో ఆదివాసీ పల్లెల్లో ఆదివాసీ మహిళలపై మిలటరీ బలగాలు ఒక అణిచివేత సాధనంగా రేప్‌ను ప్రవేశపెట్టిన దుర్మార్గం బయటి ప్రపంచానికి పూర్తిగా తెలియడం లేదు. 'నిర్భయ' చట్టం వచ్చిన తర్వాత మహిళలపై ఇరవైఏడు శాతం లైంగికదాడులు అధికంగా నమోదయ్యాయి. ఇన్ని దుర్మార్గాలు ఇంటా బయటా మహిళలపై జరుగుతుంటే పాలకులు నినాదాలకు పరిమితమయ్యారు.' బేటీ బచావో..బేటీ పడావో' నినాదమిచ్చిన మోడీ అనుచరగణం అంతా స్త్రీలు కురుచ దుస్తులు ధరిస్తున్నారనో, దేశ సంస్కృతిని మంటగలుపుతున్నారనో వీధుల్లో వీరంగం సృష్టిస్తూ సాంస్కృతిక పోలీసింగ్‌కు పాల్పడుతున్నారు. సనాతన వాదులంతా పితృస్వామ్య బ్రాహ్మణీయ విలువలు మరింత బలపడేలా తమ ఎజెండాకు పదును పెడుతున్నారు. 'నస్త్రీ స్వాతంత్ర మర్హతి' అని చెప్పిన శాస్త్రాల సంఘపరివార్ పెద్దలు స్త్రీలు వంటింటికే పరిమితం కావాలని బాహాటంగానే ఘోషిస్తున్నారు.

ఏదైన చారిత్రక సన్నివేశాన్ని, పోరాట స్ఫూర్తిని, చైతన్యాన్ని, విముక్తి పథాన్ని చూపించే శక్తి ఉన్న ఏ సందర్భాన్నైనా వక్రీకరించి, బలహీనపరిచి తమ ప్రయోజనాలకు, తాము రక్షణగా నిలబడ్డ వారి ప్రయోజనాలకు విఘాతం కలుగకుండా చూసుకుంటారు పాలకులు. సరిగ్గా మార్చ్ 8ని కూడా అలాగే మార్చి వేశారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని ఆర్భాటం చేస్తున్నారు. కార్పొరేట్స్, ఆస్తిపర వర్గాల మహిళలు, ఉన్నతోద్యోగ స్థానంలో ఉన్నవాళ్లు, అధికార పీఠాల్లో వారందరికి ఇది ఏనాడో ఉత్సవమైంది. న్యూ ఇయర్ లాగానో, వాలెంటైన్స్ డేలాగానో మార్చివేసి కేక్ కట్ చేయడానికి, అభినందనలు చెప్పుకోవడానికి పార్టీలు చేసుకునే స్థాయికి దిగజార్చారు. ఫ్యాషన్ పరేడ్లు, వంటల పోటీలు, ముగ్గుల పోటీలను నిర్వహించి స్త్రీని 'దేవత' అని, భూదేవంత 'సహనశీలి' అని కుటుంబ బరువును, బయటి భారాన్ని నెత్తిన వేస్తున్నారు.

వ్యక్తులుగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవించే హక్కులను నిరాకరించి 'శాస్త్రాల'నుసారం, మతం విధించిన పరిమితులకు లోబడి నడుచుకోవాలని ఈ శక్తులు నిర్దేశిస్తున్నాయి. శిశు మందిరాలల్లో చదువులు స్త్రీలకు శిలాశాసనాలను విధిస్తున్నాయి. జాతీయ వాదం పేరుతో హిందూ బ్రాహ్మణీయ ఫాసిజంను అమలు పరుస్తూ మహిళల సాంస్కృతిక హక్కుల్ని అణిచివేస్తున్నాయి. ప్రతి ప్రభాతాన టీవీ ఛానళ్ల నుండి ప్రవహించే ప్రవచనాలన్నీ స్త్రీల చుట్టూ సనాతన ఇనుప కంచెలను వేస్తున్నాయి. భక్తి పేరుతో సృజనాత్మకత లేకుండా పారాయణాలను చేయిస్తూ మహిళ మనోవికాసానికి అడ్డుగోడల్ని నిర్మిస్తున్నారు. శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధ వైఖరిని అలవర్చుకొని ఆధునిక జీవన శైలిని ప్రదర్శించే మహిళలను ప్రాశ్చాత్య సంస్కృతికి బానిసలయ్యారంటూ ప్రచారం చేస్తున్నారు. స్వతంత్ర వ్యక్తిత్వాన్ని, ఉన్నతమైన అభిప్రాయాలను కలిగి ఉండి తమ జీవితాన్ని తామే నిర్దేశించుకుంటామంటే సహించని 'సంఘ్' జీవులు వీరు. ఫ్లవర్ వాజ్‌లో పువ్వుల్లా, షోకేసుల్లో బొమ్మల్లా ఉండాలని అనుకువ, వినయం, విధేయతల చాటున స్త్రీలను తోలుబొమ్మలుగా ఆడించే ఈ శక్తులకు స్త్రీలు స్వేచ్ఛగా ఆలోచించడం, స్వేచ్ఛాయుత జీవితం గడపడం కంటగింపుగా మారింది.

ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి స్థితి నెలకొని ఉంటే పాలకులకు, వాళ్ల ఊడిగం చేస్తున్న కార్పొరేట్స్‌కి ప్రతి సందర్భంలోంచి పైసలు పిండుకోవడం కావాలి. 'ఉత్సవ విగ్రహం' అనే మాట ప్రజా బాహుళ్యంలో బహుళ ప్రచారం పొందినది. ఉత్సవ విగ్రహమనేది ప్రయోజనకరమైనది కాదని, అది ఉత్త విగ్రహమేనని దాని సారాంశం. ఏదైన చారిత్రక సన్నివేశాన్ని, పోరాట స్ఫూర్తిని, చైతన్యాన్ని, విముక్తి పథాన్ని చూపించే శక్తి ఉన్న ఏ సందర్భాన్నైనా వక్రీకరించి, బలహీనపరిచి తమ ప్రయోజనాలకు, తాము రక్షణగా నిలబడ్డ వారి ప్రయోజనాలకు విఘాతం కలుగకుండా చూసుకుంటారు పాలకులు. సరిగ్గా మార్చ్ 8ని కూడా అలాగే మార్చి వేశారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని ఆర్భాటం చేస్తున్నారు. కార్పొరేట్స్, ఆస్తిపర వర్గాల మహిళలు, ఉన్నతోద్యోగ స్థానంలో ఉన్నవాళ్లు, అధికార పీఠాల్లో వారందరికి ఇది ఏనాడో ఉత్సవమైంది. న్యూ ఇయర్ లాగానో, వాలెంటైన్స్ డేలాగానో మార్చివేసి కేక్ కట్ చేయడానికి, అభినందనలు చెప్పుకోవడానికి పార్టీలు చేసుకునే స్థాయికి దిగజార్చారు. ఫ్యాషన్ పరేడ్లు, వంటల పోటీలు, ముగ్గుల పోటీలను నిర్వహించి స్త్రీని 'దేవత' అని, భూదేవంత 'సహనశీలి' అని కుటుంబ బరువును, బయటి భారాన్ని నెత్తిన వేస్తున్నారు. పావలా వడ్డీలు, కుట్టు మిషన్లు, బ్యూటీ పార్లర్లు, ఫ్యాషన్ డిజైనింగ్లను నేర్పి వాటినే 'మహిళా సాధికారత'గా ప్రచారం చేసుకుంటున్నారు. వీటికి తోడు 'ఉత్సవం' అయితే కాస్మోటిక్స్, ఫ్యాషన్ దుస్తులను ఉత్పత్తి చేసే కార్పొరేట్స్‌కి అది కాసులపంటగా మారుతుంది. పండుగలా జరుపుకునే రోజులు పోరాటాలను, త్యాగాలను, విముక్తి పథాలను గుర్తుకు తెస్తాయంటారా?

రెక్కలు ముక్కలు చేసుకొని కంపెనీల్లో కాలిపోతున్న మహిళా కార్మికులు, అసంఘటిత రంగంలో కునారిల్లుతున్న అసంఖ్యాక మహిళలు, కుదేలైన వ్యవసాయంలో రుణగ్రస్తులై బతుకులెల్లదీస్తున్నవారు ఇంటికే పరిమితం చేయబడి బయటి ప్రపంచాన్ని కనే అవకాశం లేనివాళ్లంతా తమ చుట్టూ అల్లుకున్న దోపిడీ కంచెల్ని బద్దలుకొట్టి విముక్తి గీతం పాడుకోవడం కోసం ఉద్దేశించబడినది ఈ శ్రామిక మహిళా పోరాట దినం. మహిళల్ని పరాయీకరించి బానిసలుగా చేసిన, వారి శ్రమ శక్తిపై పురుషులకు అధికారమిచ్చిన కుల, మత, పితృస్వామిక చట్రా లను కూల్చివేయకుండా ఉండడం కోసం, వస్తు వ్యామోహపు ప్రవాహంలో కొట్టుకుపోయేలా చేయడం కోసమే పోరాట దినం ఉత్సవమైంది. శ్రమ విముక్తి పోరాటంతోనే మహిళా విముక్తి దాగి ఉందన్న సత్యాన్ని మరుగున పరిచేందుకు పోరాటాన్ని నీరుగార్చి 'వేడుక'ను చేస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే గనుక అన్ని దినోత్సవాల్లాగే మార్చి8 కూడా మారిపోతుంది. దీన్ని ప్రతిఘటించడమే మహిళల కర్తవ్యం కావాలి.

మహిళా సాధికారత - సమానత్వం


జి. నాగమణి

శతాబ్దాల కాలంగా సమానత్వ సాధనకై జరిగిన ఉద్యమాలను, పోరాటాలను సమీక్షించుకుని భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించుకొనే రోజు మార్చి8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం. లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి, వివిధ సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో మహిళలు సాధించిన విజయాలకిది ప్రతీక. ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వారోత్సవాలుగా, పక్షోత్స వాలుగా జరుపుకుం టున్నాము. ఈ సందర్భంగా ఇంటా బయట మహిళలెదు ర్కొంటున్న సమస్యలు, వారిపై జరుగుతున్న శారీరక మానసిక దాడులు, వాటిని అధిగమించే చర్యల గురించిన అనేక విషయాలపై చర్చలుంటాయి. ప్రతి సంవత్సరం ఒక థీమ్‌ను ఈ సందర్భంగా ప్రకటిస్తారు. 2025 సంవత్సర థీమ్ " మహిళలు, బాలికలందరికీ హక్కులు, సమానత్వం, సాధికారత" మహిళల సమాన హక్కులు, అధికారం, అవకాశాలను వాడుకోవడానికి తగిన చర్యలు తీసుకోవా లని కోరుతుంది. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు, బాలికల పురోగతిని అడ్డుకునే వ్యవస్థాగత అవరోధాలను తొలగించడానికి తక్షణ చర్యలను హైలైట్ చేస్తుంది.



మనదేశంలో మహిళలు నాటినుండి నేటిదాక పనికి గుర్తింపు విలువ కట్టని ఈ అసమసమాజంలో అన్నీ తామై, అన్నింటా తామై అవిశ్రాంతంగా శారీరక, మేధో శ్రమచేస్తూనే సమాజాభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. భారత రాజ్యాంగం అందించిన హక్కులు, బాధ్యతలు వాటికి సంబంధించిన చట్టాల పట్ల అవగాహన కలిగి పురుషులతో సమానంగా ముందుకుపోతున్నారు నేటి మహిళలు. పురుషులతో సమానంగా తమను గుర్తించాలని, తమ వాటా తమకు ఇవ్వాలనే స్పృహతో ఉద్యమిస్తున్నారు. నింగినేల మాదేనంటు ఆటంకాలను, ఆంక్షలను ఎదిరిస్తూ దూసుకుపోతున్నా కంటికి కనిపించని అద్దాలగోడలు వారి అభివృద్ధిని నిరోధిస్తూనే ఉన్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో, నిర్ణాయక పదవుల్లో వారి శాతం 10-20గానే ఉంటున్నది. విద్య, వైద్యం, సేవ, తదితర రంగాల్లో సంఖ్యాపరంగా అధికమైనా నేతృత్వ స్థాయికి చేరడంలో వివక్షతకు గురవుతూనే ఉన్నారు. మహిళా సాధికారతలో 15 - 18 సం.రాల వయసు అమ్మాయిలు 40శాతం వరకు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు. 1997 నేషనల్ సర్వే ప్రకారం కేవలం కేరళ, మిజోరాం రాష్ట్రాలు మాత్రమే అక్షరాస్యత శాతాన్ని చేరుకున్నాయి జాతీయ కుటు ంబ సర్వే ప్రకారం ప్రపంచ అక్షరాస్యత రేటు భారత దేశంలో స్త్రీలు 70.3శాతం ఉంది. అంగన్ వాడీలు, ఆశావర్కర్లు, ఐకెపి, ఐటీ, ప్రయివేటు, కాంట్రాక్టు, కెజిబివి టీచర్లు, ఔట్ సోర్సింగ్ పేరుతో చాలామంది శ్రమదోపిడీకి గురవుతున్నారు.

'ఆకాశంలో సగం.. అవనిలో సగం.. సమాజంలో సగం" అన్నట్టు నేడు మహిళలున్నా రెండవ శ్రేణి పౌరులుగానే పరిగణింపబడుతున్న తరుణంలో హక్కులకై ఉద్యమిస్తున్న ఘట్టాలు ఒక భాగమైతే, జీవించే హక్కును సైతం కాలరాస్తూ ప్రజాస్వామ్యంలో రాజ్యాంగాన్ని పరిహసించేసే విధంగా లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, పక్నిస్తే పనిష్మెంట్లు నానాటికీ పెరుగుతున్న దుస్థితి. బిల్కిస్ బానో రేప్ కేసులో నేరస్తులకు క్షమాభిక్ష పెట్టి సన్మానించడం, దేశానికి ప్రతిష్టాత్మక పథకాలు సాధించిన మహిళా రెజ్లర్ల ఆక్రందనలు, మణిపూర్ మారణహోమం ఇన్ని జరుగుతున్నా పాలకవర్గాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం మనల్ని మళ్లీ మనువాద ప్రమాదపు అంచులకు నెట్టివేస్తున్నట్టు స్పష్టమౌతుంది. ఆయా రంగాల్లో మొదటి స్థానంలో చెప్పుకోదగిన మహిళలెందరో ఉన్నారు. ఈ సందర్భంగా వారిని మనం గుర్తుచేసుకోవాలి. మన మొదటి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ, వైద్యురాలు ఆనందీబాయి జోషి, ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయి పూలె, మహిళా దినోత్సవ వ్యవస్థాపకురాలు క్లారా జెట్కిన్, తొలి మహిళా గవర్నర్ సరోజినీ నాయుడు, ఆటోరిక్షా డ్రైవర్ షీలా దావ్రే, ఢిల్లీ నగరంలో బస్సు నడిపిన తెలంగాణ బిడ్డ సరిత మొదలైన వారు. నాటినుండి నేటిదాక ఎందరో మహిళామణులు వివిధ రంగాల్లో కృషిచేసి మనకు ఆదర్శమూర్తులు, మార్గదర్శకులుగా నిలిచారు. ప్రజాసంక్షేమాన్ని, మహిళా సంక్షేమాన్ని, బాలికల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ, రాజ్యాంగ హక్కులను అమలుచేసే దిశగా చట్టాలు చేస్తే ప్రస్తుత పరిస్థితులలోమార్పు సాధ్యమౌతుంది. సొంత ఎజెండా అమలుకై చాపకింద నీరులా ప్రత్యామ్నాయ రాజ్యాంగాన్ని రూపొందించేందుకు పాలకులు సిద్ధమౌతున్న పరిస్థితి కనిపిస్తున్నా పౌరసమాజం గుర్తించలేకపోవడం గమనార్హం.

నేడు మతం కళ్లతో మనుషుల్ని చూస్తూ, విడదీస్తూ వివాదాలు సృష్టిస్తున్న పాలకులు మహిళలను మనువాద దృష్టితోనే చూస్తున్నారు. దేశప్రజలంతా సమానులేనన్న భారత రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ మతధర్మాన్ని మనుధర్మాన్ని బోధిస్తున్నారు. సామాన్యులు ఉన్నత చదువులు చదువుతున్న యువతులు సైతం మతాచార వేడుకల్లో ఇబ్బడిముబ్బడిగా పాల్గొంటున్నారు. పని ప్రదేశాల్లా కూడా ఈ ఆచారాలను విస్తరింపచేస్తూ జనామోదాన్ని పొందుతున్నారు. ఇది ప్రమాదకరమైన పరిస్థితి. మహిళల హక్కులు బాధ్యతలకై జరిపే ఉద్యమాల్లో మహిళల వ్యక్తిత్వాన్ని, నాన్ని, వారి క్రియాశీలతను తగ్గించే, ఆంక్షలను విధించే ఆచారాలపై గళమెత్తాలి. శాస్త్రీయ, తార్కిక, హేతువాద దృక్పథాన్ని ప్రచారంచేయాలి. సమాన పనికి సమాన వేతనం, సెలవులే కాదు "మహిళల హక్కులు మానవ హక్కులేనన్న" నినాదాన్ని అందరూ అందుకోవాలి. "దేశ స్వావలంబన అభివృద్ధిలో మేము సైతం ఉన్నాం, మా భాగస్వామ్యాన్ని గుర్తించండి" అని ఎలుగెత్తి చాటాలి. "స్త్రీ పురుష సమానత్వ సాధనను వేగవంతం చేస్తాం. అందుకు అవసరమైన అన్ని చర్యలను చేపడతాం" అని పాలకుల చేత ప్రకటింపచేసే స్థాయిలో మన ఉద్యమ కార్యాచరణ ఉండాలి. ఆ దిశగా మనమంతా సంఘటితంగా పయనిద్దామని ఈ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతినబూనుదాం.

'ఆమె'కు అడుగడుగునా అవమానమేనా?


నాదెండ్ల శ్రీనివాస్
9676407140

స్త్రీ లేనిదే జననం లేదు.స్త్రీ లేనిదే గమనం లేదు.స్త్రీ లేనిదే సృష్టిలో జీవం లేదు.స్త్రీ లేనిదే అసలు సృష్టే లేదు. అలాంటి స్త్రీ నేటికీ సమానత్వాన్ని అందుకోలేకపోతున్నది. ఆమె పట్ల ఆధునికయుగంలోనూ అడుగడుగునా అవమానం, వివక్షే కొనసాగుతున్నది. గృహిణి లేకుండా ఇల్లు నడపడం అసాధ్యం అయినప్పటికీ మహిళ తన ప్రాముఖ్యతను నిరూపించుకోవాల్సి వస్తోంది.ప్రపంచం ఆధునికంగా మారి ఉండవచ్చు కానీ చాలా మంది మహిళలు ఇప్పటికీ పురుషుల నిర్ణయాలపైనే ఆధారపడవలసి ఉంది. 21వ శతాబ్దంలో జీవిస్తున్న నేటి యువత ఆధునిక ఆలోచనలతో ముందుకుసాగాలని భావిస్తోంది. తనకంటూ ఒక ప్రత్యేకత సంపాదించుకోవాలని ప్రయత్నిస్తోంది. అయినప్పటికీ నేటికీ ప్రపంచ వ్యాప్తంగా చాలామంది మనస్సులో పురుషాధిక్యత గురించి ఆలోచన ఇప్పటికీ ప్రబలంగా ఉంది. ఇప్పటికీ ఒక మహిళ తనను తాను నిరూపించుకోవడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. భారతదేశంలో ఆడపిల్లలు బాల్య వివాహాలకు మాత్రమే కాదు కట్న కానుకలకు కూడా బలిపశువులవుతూనే ఉన్నారు.కొన్నిచోట్ల చదువుకున్న స్త్రీ కూడా తన విలువను చాటుకోవడానికి కష్టపడాల్సి వస్తోంది. స్త్రీ,పురుషుల మధ్య సమానత్వం కేవలం చర్చలు,పేపర్లలో ప్రస్తావనకు, డిబేట్స్‌కు మాత్రమే పరిమితమవ్వడం విచారకరం.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనేది లింగ సమానత్వం కోసం వాదిస్తూనే మహిళలు సాధించిన సామాజిక,ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలను గుర్తించే ఒక ప్రపంచ కార్యక్రమం. ఈ ఏడాది 2025 సందర్భంగా మహిళలపై హింసను అంతం చేయడానికి మద్దతు అనే థీమ్‌తో మహిళా దినోత్సవం జరుపుకుంటున్నాము. మంచిదే కానీ, మహిళలపై జరుగుతున్న హత్యల్లో 28 శాతం కుటుంబ సభ్యులే చేస్తున్నారని నేషనల్ క్రైమ్ బ్యూరో లెక్కలు చెప్తున్నాయి. 2022లో ఆత్మహత్య చేసుకున్న 45,028 మందిలో సగానికి పైగా గృహిణులే ఉన్నారు. 2022లో భారత్‌లో ఎన్.సి.ఆర్.బి నివేదిక ప్రకారం బాలికలు, మహిళలపై హింసకు సంబంధించి 4,28,000 కేసులు నమోదయ్యాయి. అందులో 7.9 శాతం లైంగికదాడి కేసులు, 21.8 శాతం భౌతిక దాడులు, 31.8 శాతం గృహ హింస కేసులు నమోదైనట్లు నివేదిక తెలుపుతున్నది. నమోదు కాని కేసులు లెక్కకు మించి ఉన్నాయి. 2030 నాటికి మహిళలకు, బాలికలకు సాధికారిత, లింగ సమానత్వాన్ని సాధించాలని ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో ఐదవదిగా పేర్కొంది.స్త్రీ పురుషుల మధ్య ప్రాకృతిక విభజనను సామాజిక కోణం నుంచి అర్థం చేసుకోవటానికి బదులుగా సామాజిక అసమానతలకు ప్రకృతిని అన్వయించి ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనే ధోరణి సహించరాని విషయం.

ఆధునిక ప్రపంచంలో అవకాశాలను అందిపుచ్చుకోవడంలో సగటుజీవికి పేదరికం అడుగడుగునా అడ్డుపడుతోంది.పేదరికం కోట్ల మందిని కనీస అవసరాలకు దూరం చేసింది. ఫలితంగా మరింత మంది పేదరికంలోకి జారుతున్న పరిస్థితి. ఈ ప్రభావం పురుషులతో పోలిస్తే మహిళలపై అధికంగా ఉందని అనేక అధ్యయనాలు చాటుతున్నాయి.దీనివల్ల రాబోయే రోజుల్లో పరిస్థితులు లింగపరమైన అసమానతలకు దారితీస్తూ, మహిళలు మరింత పేదరికంలోకి జారుకునే ప్రమాదం ఉందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం, ఐరాస అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) 2021 నాటికి దాదాపు 4.7 కోట్ల మంది మహిళలు,బాలికలు తీవ్ర పేదరికంలోకి జారే అవకాశం ఉందని నివేదించింది.ఫలితంగా మహిళల విషయంలో కొన్ని దశాబ్దాలుగా సాధించిన పురోగతి పూర్తిగా తిరోగమనంలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా దక్షిణాసియా ప్రాంతంలో ఈ పేదరిక వ్యత్యాసం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని యూఎన్‌డిపి అభిప్రాయ పడింది.25 నుంచి 34 ఏళ్ల వయస్సు కలిగిన మహిళలు,బాలికలు దుర్భర పరిస్థితిని ఎదుర్కోవచ్చని తెలపడంతో పాటు రానున్న దశాబ్దకాలంలో పురుషుల కంటే మహిళలు ఆర్థికంగా వెనకంజ వేస్తారని నివేదిక స్పష్టం చేసింది. ఉద్యోగాలు కోల్పోయింది మహిళలే.ఇటీవల అమెరికాలో పురుషులతో పోలిస్తే ఉపాధిని కోల్పోయిన వారిలో మహిళలే ఎక్కువ ఉన్నారని అక్కడి జాతీయ మహిళా న్యాయ కేంద్రం (ఎన్‌డబ్ల్యుఎల్‌సి) విశ్లేషణ స్పష్టం చేసింది. ఈ అధ్యయనం ప్రకారం డిసెంబరు నెలలో అమెరికాలో పెద్దసంఖ్యలో ఉద్యోగాలు పోయాయి.అవన్నీ మహిళలకు సంబంధించినవే కావడం గమనార్హం. లింగ సమానత్వంలో మెరుగ్గా ఉన్న అమెరికాలోనే ఈ స్థాయిలో మహిళలు ఉపాధిని కోల్పోతే మధ్యస్త, అల్పాదాయ దేశాల పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. అనాదిగా లింగపరమైన అసమానతలు వేళ్లూనుకుని ఉన్న వర్తమాన భారత్‌లో మహిళల పరిస్థితి చెప్పనక్కర్లేదు.



అందుకే ప్రభుత్వాలు ముందుజాగ్రత్తగా మేల్కొని లింగసమానత్వం దిశగా అడుగులేస్తూ ఉద్యోగ, ఉపాధి కల్పనల్లో మహి ళలకు తగిన అవకాశాలు కల్పించాలని యుఎన్‌డిపి సూచించడం ప్రాధాన్యం సంతరించుకుంది.దేశాభివృద్ధిలో పురుషులతో పాటు మహిళల పాత్ర కీలకం.పురుషులతో సమానంగా మహిళలు సామాజిక,ఆర్థిక,రాజకీయ అభివృద్ధి సాధించినప్పుడే పేదరికం అంతమవుతుంది.నేటి సంక్షోభంలో మహిళలకు ఆర్థిక రక్షణ కల్పించి స్వావలంబన దిశగా అడుగులు వేయడానికి ప్రపంచ దేశాలు విభిన్న రీతుల్లో అవకాశాలను అన్వేషించాల్సిన అవసరం ఉంది.ప్రపంచాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు మొదటగా చేయాల్సిన పని స్త్రీలలోని పేదరికాన్ని నిర్మూలించాలన్న సంగతిని ప్రభుత్వాలు గుర్తించాలి. లింగ సమానత్వం కోసం కృషి చేయాలి.

నవతెలంగాణ
మనసు తెలుగు దినపత్రిక
కరీంనగర్
శనివారం | మార్చి 08, 2025 | www.navatelangana.com

నిరంతర శ్రామికులు

అద్భుత విజయాలవైపు అతివలు పురోగమిస్తున్నా.. అన్ని రంగాల్లోనూ కొనసాగుతున్న వివక్ష

- సమాన పనికి సమాన వేతనం కరువే
- ఇంటా, బయట మానసిక, శారీరక అణచివేతలే!
- పేరుకు ఇల్లాలని సంభోదించినా జీతం లేని జీవితాలే వారివి...
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్పెషల్ స్టోరీ




అతివ పురోగమిస్తోంది. అద్భుత విజయాలను సాధిస్తోంది. అత్యున్నత శిఖరాలను చేరుకుంటోంది. విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం ఇతోధికంగా పెరుగుతోంది. ఈ మాటలన్నీ నాణేనికి ఒకవైపు మాత్రమే. మరోవైపు అన్ని రంగాల్లోనూ మహిళలపై వివక్ష కొనసాగుతూనే ఉంది. ఇప్పటికీ ఇంటా, బయటా అణచివేతకు గురవుతున్నారు. లింగ వివక్షను నేరంగా పరిగణించే చట్టాలు ఎన్ని ఉన్నప్పటికీ మహిళల ప్రాతినిధ్యాన్ని, విస్తతిని సమాజం ఆమోదించ లేకపోతోంది. పర్యవసానంగా సంఘర్షణ, అణచివేత, హింస, వేధింపులు, నిత్యకత్యంగా మారాయి. పేరుకు ఇల్లాలుగా జీతం లేని జీవితాన్ని గడుపుతున్న వంటింటి మహారాణులకూ ఇంటా, బయట వివక్ష తప్పడం లేదు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నాణేనానికి రెండువైపులా ఉన్న మహిళల ప్రతిభాపాటవాలు, వారిపట్ల వివక్ష రూపాలపై 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం...

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / కరీంనగర్

ఆదిశక్తిగా మహిళలనే కొలుస్తాం. ఆకాశంలో సగంగా అభివర్ణిస్తాం. చరిత్ర పుటలను ఒకసారి చూసినా కాకతీయుల రాణి రుద్రమాదేవి, వీరనారి ఝాన్సీలక్ష్మిభాయి వంటి మహనీయులు కనబడుతారు. మొన్నటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరోచిత ఉద్యమాన్ని నడిపించిన మల్లు స్వరాజ్యమూ ఇప్పటి తరానికి ఆదర్శప్రాయమే. అంతరిక్షం వరకు దూసుకుపోయి తన జీవితాన్ని జాతికి అంకితం చేసిన కల్పనాచావ్లా... ధైర సాహసాలకు పెట్టింది పేరు. ఒకింత అంధురాలైనప్పటికీ మహిళల అభ్యున్నతి కోస పోరాడిన హెలెన్‌కెల్లర్ కూడా ఒక ధీర వనితే. ఇలా ప్రపంచంలో ఏమూలన చూసినా ఏదో ఒకస్థాయిలో ఆడవారు తమ సత్తా చాటుతూనే ఉన్నారు. అభివృద్ధిలో సింహభాగం వారి కృషియే కనబడుతోంది.

ఇంకా కొనసాగుతున్న వివక్ష, దాడులు

మహిళల అభ్యున్నతి, వారి విజయగాథలు నాణేనికి ఒకవైపు మాత్రమే. మరోవైపు చూస్తే వారు ఎదుర్కొంటున్న సామాజిక వివక్ష, దాడులు, అత్యాచారాలు కోకొల్లలు. దేశాన్ని ఏలే పాలకులున్న రాజధాని హస్తినాలోనే మహిళకు రక్షణ లేకుండా పోతోన్న రోజులివి. సగటున రోజుకు వందల సంఖ్యలో మహిళలపై అత్యాచారాలు, దాడులు జరుగుతూనే ఉన్నాయి. కుళ్లిన చాందస సమాజంలో వరకట్న దాహానికి ఏడడుగుల బంధం మున్నాళ్ల ముచ్చటగానే మిగులుతోంది. ఇవన్నీ నిత్యం మీడియా స్రవంతిలో చూస్తేనే ఉన్నాం. ఇవి కూడా వెలుగులోకి వచ్చినవి మాత్రమే.

జిల్లా స్థాయి అధికారుల్లో సగం మహిళామణులే..

జిల్లా స్థాయిలో పరిశీలిస్తే అటు అధికారగణంలోనూ, ఇటు ప్రజాప్రతినిధుల జాబితాలోనూ సగం మహిళామణులే ఉన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్, కరీంనగర్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డిప్యూటీ కమీషనర్ స్వరూపరాణీ మొదలుకుని జిల్లాస్థాయి అధికారుల్లో సగమూ మహిళలే ఉన్నారు. ఇటీవల స్థానిక సంస్థల్లో పదవీ విమరణ చేసిన డిప్యూటీ మేయర్, జడ్పీ చైర్‌పర్సన్ సహా కార్పొరేటర్లు, జడ్పిటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, సర్పంచుల్లో 50శాతం రిజర్వేషన్‌తో సగం మంది ఉన్నారు. వీరేగాకుండా డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు ఇలా అనేక రంగాల్లో జిల్లా స్థాయిలో రాణిస్తున్నారు.

సతుల స్థానంలో పతుల రాజ్యం

మరోవైపు పంచాయతీలు, మున్సిపల్ సంస్థల్లో మహిళలకు సగం రిజర్వేషన్ కల్పించినా వారి సాధికారతను పెంచాల్సిందిపోయి... ప్రజలు ఓట్లేసి గెలిపించిన వారిని మళ్లీ వంటింటికే పరిమితం చేస్తూ వారి పతులు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. అంతా తామే అంటూ తెరవెనుక నుంచి పాలన సాగిస్తున్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలను నిశితంగా పరిశీలించి, అవగాహన చేసుకుని, స్త్రీలు కూడా మనలో సమానమే అన్న భావనను సమాజంలో చొప్పించాలి. కలుషిత పురుషాహంకార రాజకీయాలను ప్రక్షాళన చేయడానికి, పతనమవుతున్న నైతిక విలువలను పునరుద్ధరించడానికి ప్రజాస్వామ్యవాదులు ముందుకురావాలి.

'ఆమె'ను గుర్తించరు!

బాగా చదువుకుని, చక్కగా ఉద్యోగం చేస్తున్న ఆడవాళ్ల విషయం పక్కనబెడితే, కేవలం ఇంటి కోసం, పిల్లల కోసం ఉద్యోగం వదిలేసి ఇంటికే పరిమితమైన ఆడవాళ్లను ఇవ్వాల్టికీ చిన్న చూపే చూస్తుంటారు చాలామంది.

కాకపోతే ఇది జీతం లేని ఉద్యోగం అంతే. ఇక ఎంత పెద్ద ఇండస్ట్రీ అయినా, ఒక మహిళ ఎంత పొజిషన్ లోకి వెళ్తున్నా జీతాల విషయంలో మాత్రం ఆడవాళ్ళు ఇప్పటికీ వెనుకబడే ఉన్నారు. మగవాళ్లతో సమానంగా చాలామంది ఆడవాళ్లకు జీతాలు ఇవ్వకపోవడానికి చెప్తున్న కారణమేంటో తెలుసా.. వాళ్లు ఆడవాళ్లు కావడమే.

పని చేసే చోట మౌలిక వసతులు మృగ్యం..

షాపింగ్‌మాల్స్, సూపర్‌మార్కెట్లు, చిరు వ్యాపార సంస్థలు, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, రెస్టారెంట్లు, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాలు, పెట్రోల్ బంకులు, తదితర అన్ని చోట్ల మహిళల శ్రమ, ప్రతిభ ఉంది. వీరి అవసరాలకు తగిన మౌలిక సదుపాయాలు మాత్రం అందుబాటులో లేకుండాపోయాయి. నగరంలో కార్పొరేట్, పెద్ద పెద్ద ప్రభుత్వ ఆస్పత్రులు మినహాయిస్తే అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు అంతంత మాత్రమే.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కె.సవిత, కరీంనగర్ జిల్లా సంక్షేమ అధికారి



ప్రభుత్వ, ప్రైవేటుపరంగా మహిళలకు వస్తున్న ఉపాధి, వ్యాపార రంగ అవకాశాలను సద్వినియోగం చేసుకొని రాణించాలి. ఓటమిలో కుంగిపోకుండా ధైర్యంతో ప్రయత్నించాలి. ఏ రంగంలోనైనా విజయం సాధించగలమనే విశ్వాసం, పట్టుదలతో ముందుకు సాగాలి.

సమాజ నిర్మాణంలో స్త్రీలు నిజమైన అర్కిటెక్ట్‌లు

- కాసం నీలిమ, ఫీటల్ మెడిసిన్ స్పెషలిస్టు, నీలిమా ఫెటో కేర్



స్త్రీవాదం అంటే మహిళల్ని బలోపేతం చేయడం కాదు. మహిళలు ఇప్పటికే దృఢంగా ఉన్నారు. ప్రపంచం ఆ బలాన్ని చూస్తున్న కోణాన్ని మార్చడమే మన లక్ష్యంగా ఉండాలి. కొడుకులను, కూతుళ్లను సమాన అవకాశాలతో పెంచి పోషించే స్థాయికి కుటుంబాలు ఎదగాలి. వివక్ష, అణచివేత కుటుంబం నుంచే మొదలవుతోంది. పేద కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందుల కారణంగా అబ్బాయిల్లా అమ్మాయిలు స్వేచ్ఛగా ఎదగలేకపోతున్నారు.

ఇంటి నుంచే సాధికారత ప్రారంభం కావాలి

- డాక్టర్. శేషశైలజ, ప్రముఖ గైనకాలజిస్టు,



పుట్టిన ఇంటి నుండే మొదట మహిళా సాధికారిత ప్రారంభం కావాలి. తల్లి దండ్రులు మగ, ఆడపిల్లలను సమానంగా చూడాలి. సమాజంలోనూ మార్పు రావాలి. వివక్షకు మూలమైన కుటుంబ వ్యవస్థలోనే మార్పు ఎంతో అవసరం. ప్రతి ఆడపిల్ల ఉన్నత చదువులు చదివితేనే సమాజంలో మంచి గౌరవం ఉంటుంది.

నైతిక విలువలు నేర్పాలి

- డాక్టర్.ఎనమల్ల శ్రీదేవి, ప్రముఖ గైనకాలజిస్టు, రోహణ్ హాస్పటల్



మహిళలపై అఘాయిత్యాలు పెరగడానికి కారణం సమాజంలో నైతికవిలువలు లోపించడమే. పిల్లలకు నైతిక విలువలు నేర్పాలి. మహిళల్లో అక్షరాస్యత పెరగాలి. చట్టాలపై అవగాహన పెంచు కోవాలి. కాలం కంటే వేగంగా.. కాంతి కంటే ప్రకాశవంతంగా.. అన్ని రంగాల్లో నారీమణులు రాణీమణులుగా దూసుకుపోతున్నారు.

మహిళల ఆరోగ్యమే సమాజ ఆరోగ్యం....

- డాక్టర్.రజిని ప్రియదర్శిని, ప్రముఖ గైనకాలజిస్టు, రెనె హాస్పిటల్



మహిళల ఆరోగ్యమే సమాజ ఆరోగ్యం. ఒక మహిళ ఆరోగ్యంగా ఉంటే, కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది, సమాజం అభివద్ధి చెందుతుంది. ఆరోగ్య రంగంలో మహిళలు అనేక రకాల సవాళ్లను ఎదుర్కొంటున్నారు. సరైన వైద్యం అందుకోవడం, ఆరోగ్యంపై అవగాహన పెరగడం ఎంతో అవసరం. 'మహిళలూ.. మీ ఆరోగ్యాన్ని అగ్రస్థానంలో ఉంచుకోండి. మీ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని అలానే ప్రేమించండి, పరిరక్షించండి.'

ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం మెరుగవ్వాలి

- మాజీ డిప్యూటీ మేయర్ చల్లస్వరూపరాణి



ఆకాశంలో సంగం, అవకాశాల్లో సగం ఈ మాటా మున్సిపల్ పాలకవర్గంలో సార్థకమైంది. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారితకు ప్రాధాన్యం ఇచ్చింది. మంచి భవిష్యత్ కోసం మహిళలు ఆత్మ విశ్వాసంతో సాగాలి. చదువులో ర్యాంకులు సాధించడంతో పాటు బాలికలు ఆత్మ స్థైర్యం పెంచుకోవాలి. తద్వారానే సమాజంలో ఎదురయ్యే పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవచ్చు.

చదువుతోనే సాధికారత

- కరీంనగర్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి



సమాజంలో మహిళ పురుషుడితో పాటు సమానంగా ఎదగడానికి చదువు ఒక్కటే మార్గం. చదువుతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. మహిళలు భరించేతత్వం వీడి ప్రశ్నించేతత్వం పెంచుకున్నప్పుడే అన్ని రంగాల్లో రాణించగలరు' కుటుంబ సభ్యులు అందించిన ప్రోత్సాహంతోనే ఉన్నత చదువులు చదివి నేడు అడిషనల్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నెరవేరుస్తున్నా..

మహిళల్ని వేధించారా.. ఇట్టే పట్టేస్తాం

- శ్రీలత, మహిళా టౌన్ సీఐ



ప్రస్తుతం పోలీసు శాఖలో షీ టీంలదే అత్యంత కీలక పాత్ర. దీంతో ఈవ్‌టీజింగ్, ప్రేమ పేరుతో వెంటబడి వేధించే కేసులు చాలా వరకు తగ్గాయి. ప్రత్యేకించి బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రద్దీ ప్రాంతాలు, కళాశాలలు, దుకాణ సముదాయాల వద్ద గతంలో తరుచూ వేధింపుల ఘటనలు నమోదయ్యేవి. షీ టీంలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఈ తరహా కేసులు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి.

లింగబేధం పోవాలి...

- యమున, ఆయుర్వేద ఫిజియోథెరపిస్టు



గతంతో పోల్చితే ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అయినప్పటికీ తల్లిదండ్రుల్లో ఆడ, మగ తేడా అక్కడక్కడ కనిపిస్తోంది. ఈ భావన విడనాడాలి. ఆడ, మగ ఇద్దరు సమానమనే ఆలోచన రావాలి. మగ పిల్లాడి మాదిరిగానే ఆడపిల్లను చదువులో రాణించేలా చూడాలి.

అన్ని రంగాల్లో రాణింపు

- సుధగోని మాధవి, మాజీ కార్పొరేటర్




సష్టికి మూలం మహిళ. ఆకాశమే హద్దుగా అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. సమాజంలో తమకంటూ ఓ ప్రత్యేకత, హోదాను, గుర్తింపును కలిగి ఉండేలా అడుగులు వేస్తున్నారు. అందరికీ హ్యాపీ వుమెన్స్ డే!"

స్త్రీ సాధికారతకు సమానత్వమే పునాది

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి, ఎడ్ల రమేష్

నవతెలంగాణ-కరీంనగర్

స్త్రీ సాధికారతకు సమానత్వమే పునాది అని, కనీస వేతనం కోసం ఉవ్వెత్తున ఉద్యమాలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేష్ అన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కళాభారతి నుంచి ప్రెస్ భవన్ వరకు అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన సభలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల ముకుంద రెడ్డి, ఎడ్ల రమేష్, జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ మరెల్ల శ్రీలత మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మంది మహిళలు, పురుషులు ఆనందోత్సాహాలతో మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపు కుంటున్నారని, ఈ సంవత్సరం ఐక్యరాజ్యసమితి 'కార్యకలాపాలను వేగవంతం చేయండి' అనే నినాదంతో పిలుపునిచ్చిందన్నారు. ఒకవైపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రేరణ ప్రపంచ దేశాల మూలమూలలకు విస్తరిస్తోందన్నారు. 2017లో అమెరికన్ స్టేట్ ప్యాలెస్ ఎదుట 33 సంఘాలు కలసి ప్రదర్శన నిర్వహించాయని, భిన్నత్వాన్ని ఆమోదించి, పరస్పరం సహకరించాలని అందులో కోరారు.. మన దేశంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత, రాజ్యాంగ స్ఫూర్తి, సమానత్వ విలువలు మరుగునపడుతున్నాయి అన్నారు. బేటీ బచావో, బేటీ పడావో లాంటి నినాదాలు కేవలం కాగితాలపై మాత్రమే మిగిలి పోయాయి అని తెలిపారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నా, నిందితులను బహిరంగంగా సమర్థించడం జరుగుతోందన్నారు. సనాతన ధర్మం పేరుతో మహిళలను రెండో స్థాయి పౌరులుగా భావిస్తూ పురుషాధిపత్యాన్ని ప్రోత్సహిస్తున్నార న్నారు. లవ్ జిహాద్ పేరిట మతాంతర వివాహాలపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారని తెలిపారు. మహిళల ఉపాధి పరిస్థితి కూడా సంతృప్తికరంగా లేదు అని, కేవలం 20.5శాతం మహిళలు మాత్రమే సంఘటిత రంగంలో పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రవీందర్, నగర అధ్యక్ష కార్యదర్శులు కవంపల్లి రవి, రాజ మల్లయ్య, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు బుజ్జమ్మ, సీఐటీయూ నాయకులు రాజకుమారి, పద్మ లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గీట్ల ముకుంద రెడ్డి

మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

కనీస వేతనం 26వేలు నిర్ణయించాలని ప్రభుత్వానికి సిఫార్స్ చేయుట, తమరి పరిధిలోని స్థానిక సమస్యలు పరిష్కరించాలని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నా వద్దకు అదనపు కమిషనర్ వేణుమాధవ్ వచ్చి కార్మికుల సమస్యలను తెలుసుకొని 15 రోజుల్లో అన్ని సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం వల్ల ధర్నా విరమించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, యూనియన్ గౌరవ అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి మాట్లాడుతూ..40 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ఒక్క పూట ఉదయం 5 గంటల నుంచి 12 గంటల వరకు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుడు లేదా కార్మికురాలు చనిపోయిన లేదా అనారోగ్యానికి గురైన వారి స్థానంలో కుటుంబ సభ్యులను నియమించడానికి అనేక సార్లు వ్యక్తిగతం గాను యూనియన్ గాను వినతి పత్రాలు ఇచ్చినట్టు చెప్పారు. తక్షణమే విచారణ చేసి సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయిస్ సైడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అశోద రవీందర్, నగర అధ్యక్షులు రాచమల్లయ్య, నగర ప్రధాన కార్యదర్శి కవ్వంపల్లి రవి, నాయకులు బుజ్జమ్మ, కమలమ్మ, పద్మ, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

కరీంనగర్ సీపీ మహంతి బదిలీ

- కొత్త కమిషనర్‌గా గౌస్ ఆలం

నవతెలంగాణ - కరీంనగర్ క్రైమ్



కరీంనగర్ సీపీగా వచ్చిన గౌస్ ఆలం, బదిలీపై వెళ్లిన అభిషేక్ మహంతి

ఎన్నికల బదిలీల్లో భాగంగా కరీంనగర్ కొత్వాల్ గా బాధ్యతలు చేపట్టిన అభిషేక్ మహంతి శుక్రవారం బదిలీ అయ్యారు. కొద్ది రోజులుగా ఏపీ క్యాడర్‌గా ఉన్న ఆయనను ఏపీలో రిపోర్ట్ చేయాలని క్యాట్ ఆదేశించిన నేపథ్యంలో కోర్టు ఆశ్రయించగా కొంతకాలం బదిలీ నిలిచిపోయింది. తర్వాత తప్పనిసరిగా ఏపీకి వెళ్లాల్సిందేనని క్యాట్ నిర్ణయించడంతో మరో మారు అభిషేక్ మహంతి బదిలీ తప్పదని అందరూ భావించారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో బదిలీ నిలిచిపోయింది. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐపీఎస్ బదిలీల్లో కరీంనగర్ కొత్వాల్ గా ఆదిలాబాద్ ఎస్పీగా పని చేస్తున్న గౌస్ ఆలంకు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం కరీంనగర్ సిపిగా ఉన్న అభిషేక్ మహంతిని తెలంగాణ కేడర్ నుండి రిలీవ్ చేశారు. ఈ నేపథ్యంలో అభిషేక్ మహంతి బదిలీ తప్పనిసరిగా మారింది. ఇదిలా ఉంటే ఎన్నికల బదిలీల్లో భాగంగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో కరీంనగర్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన అభిషేక్ మహంతి ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు కమిషనరేట్ లో అనేక కార్యక్రమాలు చేపట్టి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపును తీసుకొచ్చారు. నిజాయితీకి మారుపేరుగా నిలిచి ఏళ్ల తరబడిగా వ్యవస్థలో పాతుకుపోయిన సివిల్ సెటిల్మెంట్ల దందాను నిలువరించడంలో పై చేయి సాధించారు. పార్టీలకతీతంగా భూఆక్రమణదారులను 80 మందికి పైగా జైలుకు పంపిన చరిత్ర అభిషేక్ మహంతి సొంతం చేసుకున్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించి భూఆక్రమణదారులను కటకటాల్లోకి నెట్టడంతోపాటు బాధితులకు న్యాయం జరగడానికి అన్ని చర్యలు తీసుకోవడంలో సఫలమయ్యారు. చిట్ఫండ్ మోసాలను ఉపేక్షించగా బాధితులకు న్యాయం జరిగేందుకు చిట్ఫండ్ యజమానుల సంస్థల ఆస్తులను ప్రభుత్వ పరం చేసి న్యాయం చేసేందుకు కృషి చేశారు. ఎలాంటి వత్తిళ్లకు తలగకుండా సిబ్బంది సంక్షేమం అధికారుల బదిలీ బాధితులకు న్యాయం చేసేందుకు నిరంతరం ఫిర్యాదుల స్వీకరణ వంటి కార్యక్రమాలతో పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచారు. పోలీస్ స్పోర్ట్స్ మీటిలో భాగంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడా పోటీలను కరీంనగర్లో నిర్వహించి విజయవంతమయ్యారు. పోలీస్ కుటుంబాల కోసం ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ క్యాంటీన్ ఏర్పాటుచేసి సిబ్బందికి చేరువయ్యారు.

మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలి



మాట్లాడుతున్న సీఐ

నవతెలంగాణ- హుజురాబాద్

పెళ్లి ఊరేగింపు ఘటనలో గాయపడి మృతి చెందిన బాకారపు ఉమ కుటుంబానికి, సంఘటనలో గాయపడ్డ వ్యక్తులకు నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ముందు గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. కుటుంబ సభ్యుల బంధువుల కథనం ప్రకారం.. గురువారం మెట్టుపల్లి గ్రామంలో ప్రభాకర్ కుమార్తె వివాహం అనంతరం పెళ్లి భరాత్ జరుగుతుండగా కారు డ్రైవర్ వల్ల పెళ్లి భరత్ చూస్తున్న ఉమ, ఆమె కుమార్తె నికితలను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడ్డ ఉమను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాదుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ఆమె మరణించింది. . ఉమా మృతదేహాన్ని తీసుకొని హుజురాబాద్ ఏరియా ఆసుపత్రికి తీసుకొని వచ్చినప్పటికీ ప్రమాదానికి కారణమైన డ్రైవర్ కానీ, పెళ్లి వారు కానీ స్పందించడం లేదని, ఈ సంఘటనలో ఒక మహిళ ప్రాణం పోయినా పట్టించుకోని వారి పై చర్యలు తీసుకోవాలంటూ ఆస్పత్రి ముందు ఆందోళన నిర్వహించారు. హుజురాబాద్ టౌన్ సిఐ తిరుమల్ గౌడ్ తన సిబ్బందితో వచ్చి బాధితులతో మాట్లాడి వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

విజయాలలో కీలకం

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి



నవతెలంగాణ-కరీంనగర్

గణితానికి, సైన్సులో ప్రపంచ వ్యాప్తంగా ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, విజయాలలో కీలకంగా వ్యవహరిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ నేషనల్ టీచర్స్ ఫౌండేషన్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి గణిత ఒలంపియాడ్లో పాఠశాలకు చెందిన జి.సహర్ష్ 6వ తరగతి బంగారు పతకం, ప్రశంసా పత్రం, డి.చంద్రహాస్ 6వ తరగతి బంగారు పతకం, ప్రశంసా పత్రం, యస్.సహర్ష్ 7వ తరగతి బంగారు పతకం, ప్రశంసా పత్రం, ఇ.లిఖిత్ కుమార్ 7వ తరగతి రజత పతకం, ప్రశంసా పత్రం, కృష్ణ ప్రతీక్ 9వ తరగతి బంగారు పతకం, ప్రశంసా పత్రం, జి. హేమంత్ జాదవ్ 9వ తరగతి, రజత పతకం, ప్రశంసా పత్రం, జి.సాయి సంహిత్ 8వ తరగతి బంగారు పతకం, జాతీయ స్థాయి 2వ ర్యాంకు, అలాగే జాతీయ స్థాయి సైన్స్ ఒలంపియాడ్‌లో జి.విభువన్ రామ్ 4వ తరగతి, రజత పతకం, ప్రశంసా పత్రం, డి.అనుశ్రీ 6వ తరగతి బంగారు పతకం, ప్రశంసా పత్రం, కృష్ణచైతన్య 7వ తరగతి బంగారు పతకం, ప్రశంసా పత్రం, కె.తనీష్ రెడ్డి 9వ తరగతి రజత పతకం, ప్రశంసా పత్రం, ఆల్ ఇండియా ట్యాలెంట్ సర్చ్ (ఏఐటీఎస్ఈ)లో యస్.వినాయక్ 7వ తరగతి రజత పతకం, ప్రశంసా పత్రం, జి.సాయి సంహిత్ 8వ తరగతి రజత పతకం, ప్రశంసా పత్రం అందుకున్నారు. విద్యార్థులకు పుష్పగుచ్చాలను అందజేసి అభినందించారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోండి

- సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి
- అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

నవతెలంగాణ-కరీంనగర్

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈనెల 31 లోపు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించినట్లయితే 25 శాతం రిబేటు లభిస్తుందని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని సుడా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. దరఖాస్తు దారులు ఎల్ఆర్ఎస్ 2020 వెబ్‌సైట్‌లోకి వెళ్లి పరిశీలించినట్లయితే వారి దరఖాస్తుకు సంబంధించి ఫీజు వివరాలు తెలుస్తాయని జిల్లాలోని కార్పోరేషన్, సుడా, మున్సిపాలిటీలు అన్ని కలిపి 44 వేల 437 దరఖాస్తులకు ఫీజు నిర్ణయించినట్టు చెప్పారు. పది శాతం ప్లాట్లు అమ్మిన వెంచర్స్‌కు కూడా మిగితా ప్లాట్లకు ఎల్అర్ఎస్ కట్టుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఎల్ఆర్ఎస్ లేని ప్లాట్లకు భవిష్యతులో ఎలాంటి అనుమతులు కానీ రిజిస్ట్రేషన్స్ కానీ కావని తెలిపారు. దరఖాస్తు దారులకు ఏవైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి టోల్ ఫ్రీ నెంబర్లు 9652404978, 7093750333 కు ఫోన్ చేయవచ్చని అన్నారు. సీపీవో ఆంజనేయులు, ఫీల్డ్ ఆఫీసర్లు అజయ్ రెడ్డి, సంపత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుడా చైర్మెన్ నరేందర్‌రెడ్డి

స్టడీ హాల్ ఓపెన్ చేయాలి



ధర్నా చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-కరీంనగర్

శాతవాహన యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ ఎదుట విద్యార్థుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మూసి వేసిన స్టడీ హాల్ ఓపెన్ చేయాలని 2 గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ.. శాతవాహన యూనివర్సి టీలోని మెయిన్ స్టడీ హాల్‌ను యథావిధిగా తెరవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు రోజు ఉదయం క్లాసులైన తర్వాత స్టడీ హాల్‌కి వెళ్లి చదువుకుందాం అంటే నిబంధనలు పెట్టడం జరిగింది, దాని ద్వారా విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతూ వారు మానసిక ధైర్యాన్ని కోల్పుతున్నారన్నారు. యూనివర్సిటీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, నెట్వర్క్ ప్రాబ్లం ఉంది రూటర్లను ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు సౌకర్యవంతమైన సదుపాయాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా స్టడీ హాల్ టైమింగ్‌లో విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా కృషి చేయాలన్నారు. వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్ స్పందించి మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరిస్తామని హామీ చేయడం జరిగింది. కార్యక్రమంలో విద్యార్థులు రోహిత్, గంగాధర్, విజయ్, రాకేష్, సందీప్, వసంత్, రాకేష్, జగన్, నవీన్, వినోద్, రాజు, తరుణ్, భాషా, నరేష్, మల్లేష్, శివ, వినయ్, కళ్యాణి, సౌజన్య, భార్గవి, శ్రావణి, హర్ష, మేఘన పాల్గొన్నారు.

భక్తులకు భద్రతాపరమైన ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలి

జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలనీ ఎస్పీ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈనెల 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఏలాంటి నేరాలకు తావులేకుండా, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో, కోనేరు, క్యూలైన్లలో, వాహనాల రాకపోకలు మొదలైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయవలసిన భద్రత ఏర్పాట్ల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. అదే విధంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ రఘు చందర్, సిఐ రామ్ నరసింహారెడ్డి, ఎస్ఐలు ఉదయ్ కుమార్, ఉమసాగర్ ఉన్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలి


నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

నవతెలంగాణ-పెగడపల్లి

జగిత్యాల జిల్లాలోని సారంగపూర్ మండలంలోని నగునూర్ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రపంచ మేధావి,నవ భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన దానికి నిరసనగా పెగడపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాన్ని అవమానపరిచి దేశ ప్రజల మనోభావాలు దెబ్బతీసిన నిందితుడిని పట్టుకొని కఠినంగా శిక్షించి బహిరంగంగా ఉరితీయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరెల్లి లక్ష్మీరాజాం,ఇరుగురాల భూమేష్, ఉప్పులేటి నరేష్, దీకొండ మహేందర్,బాలే అంజయ్య,కొత్తూరి బాబు, మోదుంపెల్లి అంజయ్య, శనిగరాపు ప్రవీణ్, బోమ్మెన ఆటో స్వామి, బొమ్మెన వినోద్, అంజయ్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌నగర్ కాలనీలో పేలిన గ్యాస్ సిలిండర్



నవతెలంగాణ జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణంలోని టీఆర్‌నగర్‌లోని మదర్ సా అరబిక్ పాఠశాల ఎదుట గల ఓ ఇంట్లో వంట చేస్తుండగా సిలిండర్‌కు మంటలు అంటుకుని అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇంట్లో వస్తువులు కాలిపోగా, 20 వేల వరకు ఆస్తి నష్టం జరిగిందనీ బాధితులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది ఎస్ఎఫ్ఏ కృష్ణకాంత్, ఎల్ఎఫ్‌జి మధు, ఆపరేటర్లు వెంకటేశ్వర్లు, సుధాకర్, ఫైర్ మాన్‌లు ఎం. వేణు, ఎం.రాజేందర్, జే వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాల కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మున్సిపల్, ఎంపీడీవో, ఎంపీఓ, సబ్ రిజిస్టర్ అధికారులతో కలెక్టర్ సత్యప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఆయా మండల వారిగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తులు చేస్తారో మండల వారిగా ఆరా తీశారు. కచ్చితంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల లబ్దిదారులు క్రమబద్ధీకరణ పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల లే అవుట్ క్రమబద్ధీకరణ పైన పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఎల్ఆర్ఎస్ పైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు ఎంపీడీవో, ఎంపీవోలు ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల చేసుకుంటే 25 శాతం తగ్గింపు వర్తిస్తుందని, దీనిని సామాన్య ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అధికారులకు ప్రైవేట్ లైసెన్స్ సర్వేయర్లకు కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ నెల 31 వరకు గడువు ఉన్నందున ఎక్కువ మొత్తంలో దరఖాస్తుల చేపట్టాలని అన్నారు. ఎల్1, ఎల్ 2, ఎల్3 రెవిన్యూ ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. లే అవుట్ క్రమబద్ధీకరణ అనేది ప్రభుత్వం సామాన్య ప్రజలకు భారం తగ్గించాలని అనే ఉద్దేశంతో ఎల్ఆర్ఎస్ రాయితీ ఇచ్చింది అన్నారు. మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేక కాల్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని, ఏమైనా సలహాలు ఇబ్బందులు ఉన్నా కాల్ సెంటర్‌లోని సంప్రదించాలని ప్రవేట్ బిల్డర్స్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.ఎస్ లత, డీపీవో మధన్ మోహన్, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఫస్ట్, సెకండ్ ఎన్సీ సబ్ సెంటర్‌లోనే అందించాలి

గర్భిణులకు ఫస్ట్, సెకండ్ ఎన్సీ సబ్ సెంటర్‌లోనే అందించాలని జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని వైద్య అధికారులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంతో సమీక్షించారు. ఆయా మండల వారిగా సబ్ సెంటర్, పీహెచ్ సెంటర్ల ప్రసవాల సంఖ్య వివరాలను అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలో 100 శాతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు ఫస్ట్, సెకండ్ ఎన్సీ సబ్ సెంటర్ లోనే అందించాలని డెలివరీకి సిద్ధంగా ఉన్న వారిని గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి డెలివరీకి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయనే క్షేత్రస్థాయిలో ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని వైద్య అధికారులకు తెలిపారు. నాన్ కమ్యూనికేబుల్ డిసీసెస్ (ఎన్సీడీ) ఉన్న వారిని మార్చి నెల ఆఖరి వరకు పూర్తిగా గుర్తించి వైద్యం అందించాలన్నారు. షుగర్ పేషెంట్లను మానేటరింగ్ చేసి వారికి కావాల్సిన వైద్యం, మందులు అందించాలని అన్నారు. టీబీ పరీక్షలకు సంబంధించి ప్రణాళికను ప్రకారం చేసుకోవాలన్నారు. రానున్న వేసవికాలం నేపథ్యంలో అన్ని సబ్ సెంటర్ పీహెచ్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్, ద్రావణాలు అందుబాటులో ఉంచుకోవాలని, ఉపాధి హామీ పనులను ఇతర రతర పనులకు వెళ్లి వారికి ఉదయం పూట వెళ్లాలని అవగాహన కల్పించాలని అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో, డీఎంహెచ్ ప్రమోద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ఆర్ఎంఓ, డాక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మహిళసాధికారతపై డాక్యుమెంటరీ చిత్రీకరణ

- మహిళ సమాఖ్య సభ్యుల అభిప్రాయాలు సేకరణ
- పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కృష్ణారావు



నవతెలంగాణ-మెట్‌పల్లి

తెలంగాణ రాష్ట్రంలో మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలతో పాటు మహిళలను ఆర్టీసీ బస్సులకు యజమానులను తయారు చేయుటతో మహిళలకు చేకూరే ప్రయోజనాలపై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన బృందం మహిళల అభిప్రాయాలను శుక్రవారం మెట్‌పల్లి మండలంలోని జాగృతి మండల సమాఖ్య సభ్యుల అభిప్రాయాలను చిత్రీకరించారు. ప్రభుత్వ పథకాలతో కలిగిన ఆర్థిక ప్రయోజనాలను చిత్రీకరించారు. మెట్‌పల్లి మండల సమాఖ్యకు బస్సును అందిస్తున్నందుకు ముఖ్యమంత్రికి మహిళలందరూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు, ఎలాల రమ,పులి జ్యోతి, కసాడి సోని, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ విమోచన, సీసీలు సూరయ్య, శ్రీనివాస్, అశోక్, పురుషోత్తం, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల సేవకురాలు డబ్బా పంతులమ్మ

అనారోగ్యంతో బుధవారం మృతి



నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలో పంతులమ్మ అంటే చుట్టుపక్కల గ్రామాల్లో తెలియని వారు ఉండరు. నల్గొండ జన్మించి వైద్య వృత్తిలో రాణించి సేవ చేస్తూ ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామానికి 1956లో వచ్చి స్థిరపడ్డారు.ఆమె సొంత పేరు సిలివేరి రత్నమ్మ కానీ అందరూ ఆమెను పంతులమ్మ అని పిలుస్తారు. ఆమెకు సిలువేరి ఐజాక్ రత్నంతో వివాహం జరిగింది. అప్పట్లో బీఎస్సీ నర్సింగ్ చేసి డబ్బా గ్రామంలో ప్రజలకు వైద్య పరంగా సేవలందించారు. ఆమె చేస్తున్న వైద్య సేవలకు ఎంతో మంది ఆకర్షితులయ్యారు. ఉన్న ఊరుతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో డబ్బా పంతులమ్మగా పేరు ప్రఖ్యాతలను గాంచింది. అంతే కాకుండా డబ్బా గ్రామంలో వైద్య వృత్తి చేస్తూ ఎంతోమందికి కాన్పులు చేశారు. పంతులమ్మకు నలుగురు కుమారులు. మొదటి కుమారుడు ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ రిటైర్మెంట్ అయ్యారు. రెండో కుమారుడు జ్ఞాన ప్రసాద్ నీటిపారుదల శాఖలో ఇంజనీర్ పనిచేస్తూ రిటైర్మెంట్ తీసుకున్నారు. మూడో కుమారుడు జ్ఞాన సుధాకర్ వెస్లీ డిగ్రీ కళాశాలలో క్లర్కుగా పని చేస్తున్నారు. నాలుగవ కుమారుడు జ్ఞాన కరుణాకర్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. కొన్ని సంవత్సరాల క్రితం పంతులమ్మ భర్త సిలువేరి ఐజాక్ రత్నం మరణించారు. ఇటీవల ఆమె అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మరణంతో డబ్బా గ్రామంలో విషాదం నెలకొంది. ఆమె గ్రామానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

పోలేరమ్మ ఆలయంలో మహిళల పూజలు



నవతెలంగాణ-మెట్ పల్లి

మెట్‌పల్లి పట్టణంలోని గ్రామ దేవత పోలేరమ్మ ఆలయంలో శుక్రవారం విశ్వబ్రాహ్మణ మహిళలు కుంకుమ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ పురోహితుడు రామకృష్ణ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంగల రమ్య, కోటగిరి లావణ్య, గాలిపెల్లి దివ్యవాణి, ఉప్పుల రూప, కత్రోజు లతా ,కడార్ల లావణ్య, తునికి వైష్ణవి, ముమ్మాడి కళ్యాణి, సజ్జనపు లక్ష్మి, తిప్పవరపు అరుణ, తిప్పవరపు రజిత, మహిళ సభ్యులు పాల్గొన్నారు .

మహిళల సంక్షేమం కోసమే శుక్రవారం సభ

- ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలి
- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి


మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కరీంనగర్

మహిళల సమస్యలు పరిష్కరించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు శుక్రవారం సభ ద్వారా సేవలు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని జగ్జీవన్ రావ్‌కాలనీ అంగన్వాడీ కేంద్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మహిళలతో మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రంలో జరిగే ఈ సభకు వస్తే మహిళలకు అన్ని ఆరోగ్య విషయాలు తెలుస్తాయన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, ఊరు తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలు తమ భోజనంలో అన్ని పోషక పదార్థాలు ఉండేలా చూసు కోవాలన్నారు. గర్భిణీగా నిర్ధారణ అయినప్పటి నుంచి మొదటి వెయ్యి రోజులు పోషకాహారం తీసుకుంటేనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణులు తప్పనిసరిగా కాల్షియం, ఐరన్ మాత్రలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా 54 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందిస్తున్నామని, మహిళలు విధిగా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ పరీక్షలే ప్రయివేట్ ఆసుపత్రిలో చేయించుకుంటే రూ.40 వేలకు పైగా ఖర్చు అవుతాయన్నారు.బీపీ, షుగర్, రక్తహీనత తదితర వైద్య పరీక్షలతో పాటు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు కూడా చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవలతో పాటు అన్ని రకాల మందులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు.

ప్రాథమిక పాఠశాల సందర్శన..

కిసాన్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. బోధనా తీరును అడిగి తెలుసుకున్నారు. పలు పాఠ్యాంశాలను ప్రశ్నించగా చిన్నారులు సరైన సమాధానం చెప్పడంతో కిసాన్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా షు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ పాఠశాలలోనే అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయడం కోసం అదనపు గది నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో సబిత, మెప్మా పీడీ వేణుమాధవ్, డిప్యూటీ డీఎంహెచ్వో సుజాత, డీసీపీఓ పర్వీన్, పీఓ సనా తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ టీఎస్ కార్యవర్గం నియామకం

నవతెలంగాణ,-ఎండపల్లి

పీఆర్టీయూటీఎస్ జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎండపల్లి మండలం ఎంపీపీఎస్ (పడకల్)లో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్న శ్రీ మామిడి సంతోష్ ఎన్నుకున్నారు. జగిత్యాల జిల్లా కార్యదర్శులుగా బైరిశెట్టి ధర్మేందర్, ఎంపీపీ ఎస్ (ముంజంపల్లి) రామోజీ, సంతోష్, ఎంపీపీఎస్ (సూరారం)ఎండపల్లి మండల ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దెందుకూరి జగన్నాథరావు, ఎంపీపీఎస్ కొత్తపేట నియమించినట్లు పీఆర్‌టీయూటీఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయినిపల్లి ఆనందరావు యాళ్ల. అమర్ నాథ్‌రెడ్డి తెలిపారు. జగిత్యాల జిల్లా పీఆర్టీయటీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, ఎన్నికకు సహకరించిన మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నిమ్మ రవి జోగం శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మోడల్ స్కూల్ ప్రవేశాల గడువు పెంపు



నవతెలంగాణ-చిగురుమామిడి

మండలంలోని ముల్కనూర్ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు గడువు మార్చి 10, 2025 వరకు పొడిగించినట్లు స్కూల్ ప్రిన్సిపల్ హర్జిత్ కౌర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మండలంలోని ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు 6వ తరగతిలో ప్రవేశానికి, అలాగే 7, 8,9,10 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకునే గడువు మార్చి 20, 2025 వరకు పెంచినట్లు ఆమె తెలిపారు.ప్రవేశాలకు ఆసక్తి ఉన్న విద్యార్థులుhttp://telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



నవతెలంగాణ-జగిత్యాల

పీఆర్టీయూ జిల్లా శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళా మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు వుజగిరి జమున రాణి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ ఏడాది పదవీవిరణ పొందుతున్న జడ్పీహెచ్ఎస్ మోతేకు చెందిన స్కూల్ అసిస్టెంట్ సోషల్ శశికళ, జడ్పీహెచ్ఎస్ మెట్‌పల్లి(బాయ్స్)కు చెందిన స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ జయప్రదలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయినపల్లి ఆనంద్‌రావు, యాల్ల అమర్నాథ్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వసంత, అనిత, చందన, రాష్ట్ర కార్యదర్శి అనూజా, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రశాంతి, జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, మండల అధ్యక్షురాలు విద్య దేవి, కార్యదర్శి పద్మ సునీత, సరోజన, తరంగిణి, నాగరాణి, సుజాత, శ్రీలత, రచన, రజనీ పాల్గొన్నారు.

మహిళా అధికారులకు ఘన సన్మానం



నవతెలంగాణ-చొప్పదండి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ కీర్తన, హెల్త్ సూపర్వైజర్ శ్రీదేవి, హాస్పటల్ సిబ్బందిని సావిత్రిబాయి అవార్డు గ్రహీత మాజీ సర్పంచ్ తాళ్లపల్లి సుజాత, కౌన్సిలర్ పెరుమండ్ల మానసలు ఘనంగా సన్మానించారు.

రైతు ధర్నాను విజయవంతం చేయాలి

రైతు ఐక్య వేదిక నాయకుల పిలుపు


నినాదాలు చేస్తున్న రైతులు

నవతెలంగాణ - మెట్ పల్లి

మార్చి 11 మంగళవారం పసుపుకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని రైతు ఐక్య వేదిక నాయకుల పిలుపునిచ్చారు. శుక్రవారం మెట్‌పల్లి మండలంలోని జగ్గాసాగర్, రామలచ్చక్కపేట, ఆత్మకూరు గ్రామాల్లో రైతులను కలిసి ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. రోజురోజుకు పడిపోతున్న పసుపు ధరలతో రైతు పెట్టిన పెట్టుబడి సైతం రాక తీవ్రంగా నష్టపోతున్నా దన్నారు. పసుపు క్వింటాల్‌కు రూ.15 వేలు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం ఇదే సీజన్‌లో పసుపు ధర రూ.16 నుండి 18 వేల వరకు ధర పలికిందని, నేడు ఎనిమిది వేల నుండి పదకొండు వేలు వరకు మాత్రమే ధర పలు కుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.పసుపుకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే పసుపుని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మారు మురళీధర్‌రెడ్డి, కొట్టాల మోహన్‌రెడ్డి, వేముల కర్ణాకర్‌రెడ్డి, కుంట సాయిరెడ్డి, తుమ్మల రాజిరెడ్డి, కాటిపెల్లి సురేష్, దుద్దుల్ల తిరుపతి, నరేష్, ఏలేటి లింగారెడ్డి, గడ్డం లింగారెడ్డి, మాసం గంగారం, భూమేష్ పాల్గొన్నారు.

సారుపై ప్రేమతో.. కారు శుభ్రం


కమిషనర్ కారు తూడుస్తున్న జూనియర్ అసిస్టెంట్,అటెండర్

నవతెలంగాణ-రాయికల్

పట్టణంలోని పురపాలక సంఘం కమిషనర్ టి.మనోహర్‌కు చెందిన కారును ఉదయం మున్సిపల్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఫయాజ్, ఔట్ సోర్సింగ్ అటెండర్ శంకర్ కారును తూడుస్తున్న సన్నివేశం నవతెలంగాణ కెమెరాకు చిక్కాయి. ఈ విషయంపై నవతెలంగాణ మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా... తాను ఎవరికి కారు శుభ్రపరచమని చెప్పలేదని అసలు ఆ విషయం నాకు తెలియదని,మీకు ఏమైనా డౌట్ ఉంటే కారు క్లీన్ చేసిన వారిని అడగండని, ఎవరు క్లీన్ చేయమన్నారో కనుక్కుంటానని సమాధానం ఇచ్చారు. కారు శుభ్రపరచిన జూనియర్ అసిస్టెంట్ ఫయాజ్‌ను వివరణ కోరగా నేను అప్పుడప్పుడు సార్ కారు డ్రైవింగ్ చేస్తానని ముందర అద్దం శంకర్‌కు అందకపోవడం వల్ల తుడిచానని, సాధారణంగా అంటెండర్ కారు తుడుస్తాడని తెలిపాడు. శంకర్ మాత్రం సార్ కారు శుభ్రపరచమని చెప్పలేదని సమాధానం ఇచ్చాడు.

ఆశ వర్కర్‌పై లైంగిక దాడి ఘటనలో నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

నవతెలంగాణ-రాయికల్

గత నెల 27న ఆశా వర్కర్‌పై జరిగిన లైంగిక దాడి కేసులో బాధితురాలికి న్యాయం చేయాలంటూ గురువారం ఆశ వర్కర్ల యూనియన్, సీఐటీయు ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ ముట్టడి, రాస్తారోకో కార్యక్రమాలు నిర్వహించిన విషయం విదితమే.. కాగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామని ఈనెల 9న కార్మిక ప్రజా సంఘాలతో సీఐటీయు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పేర్కొన్నారు. కాగా శుక్రవారం జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి వాంగ్మూలం మేరకు నిందితుడు మక్కల రాజు (37)పై ఎస్సీ,ఎస్టీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించి నట్లు ఎస్సై సి.హెచ్ సుధీర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్యవైశ్య మహాసభను ఆర్యవైశ్య మాయ సభగా మార్చిన అమరవాదిని తరిమికొట్టండి



నవతెలంగాణ-ఎండపల్లి

ఆర్యవైశ్య మహాసభను ఆర్యవైశ్య మాయ సభగా మార్చిన అమరవాదిని తరిమికొట్టండి అని సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సముద్రాల రమేష్ గుప్తా అన్నారు. శుక్రవారం మండల ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో తెలంగాణ ఆర్యవైశ్య పేద కుటుంబాల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సముద్రాల రమేష్ గుప్తా మాట్లాడారు. అయ్యా అమరవాది లక్ష్మీనారాయణ తెలంగాణ ఏర్పడక ముందు నుంచి ఇప్పటి వరకు మీరే ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా కోట్లు సంపాదించావు అని, ఇప్పుడు ఆర్యవైశ్య మాయసభగా మార్చి చలామణి అవుతున్నారన్నారు. కానీ నీ మీద పోటీకి వేరే ఒక వ్యక్తి నాగర్ కర్నూలు చెందిన మిడిదొడ్డి శ్యాంసుందర్ పోటీలో ఉండగా మంచితనంగా తప్పుకొని అతనికి ఏకగ్రీవంగా తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా ఇచ్చినట్లయితే మీకు ఎంతో గౌరవం దక్కేదన్నారు. కానీ అతను పోటీలో నిలబడగానే అక్కడక్కడ జరిగే సభలలో కొంతమంది ఈ సంఘంలో సభ్యులు కాదు వారికి ఏం పని పాట ఉండదు వెదవలు అని తిట్టడానికి నీకు నోరు ఎలా వచ్చిందన్నారు. మీరు ఇంత వరకు చేసిన పనులు ఏమిటంటే ఏ గ్రామంలో ఆర్య వైశ్య సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, వార్డు మెంబర్స్ మా ఆర్య వైశలు ఉన్నారో వారిని రూ.5వేలు ఖర్చు పెట్టించి హైదరాబాద్‌కు పిలిపించుకొని రూ.50తో శాలువ తీసుకొని సన్మానించడం తప్ప 13 ఏండ్లలో కనీసం ఒక్క సంవత్సరానికి ఇద్దరి చొప్పున 26 మంది పేద వైశ్యులకు పెళ్లిళ్లకు ఉపాధికి తిండి లేని వారికి ఇల్లు లేని వారికి ఏమైనా సహకారాలు అందించినారో చెపాల్సని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-గన్నేరువరం

మండలంలోని జంగపల్లి గ్రామానికి చెందిన ముత్యం ధర్మయ్యగౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. ముత్యం ధర్మయ్యగౌడ్ కుటుంబాన్ని మండల గౌడ సంఘం నాయకులు పరామర్శించి 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర తిరుపతిగౌడ్ మాట్లాడుతూ.. ధర్మ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, వారి కుటుంబానికి 10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు న్యాలపట్ల రవికుమార్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి బుర్ర కనకయ్యగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీధర్‌గౌడ్, మండల గౌడ సంఘం మెంబర్ చెక్కిళ్ల చంద్రయ్య గౌడ్ ,సహకార సొసైటీ డైరెక్టర్ అటికం రవిగౌడ్, గౌడ సంఘం నాయకులు రంగు రవి, అటికం పరుశు రాం, శంకరయ్య, శ్రీనివాస్, అటికం రవి, వరుకోలు వెంకటి, తాళ్ల పెల్లి రఘురాం, బుర్ర అక్షిత్, బుర్ర ఉదయ్ పాల్గొన్నారు.



ఎన్నికల కోడ్ ముగిసినా... మహనీయుల విగ్రహాలపై తొలగని ముసుగు



నవతెలంగాణ-రాయికల్

రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన మూడు ఎమ్మెల్సీ స్థానాల పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) ఎత్తివేసింది.కానీ జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి ఎన్నికల కోడ్ నియమాల వల్ల వేసిన ముసుగును సంబంధిత అధికారులు తొలగించడంలో విఫలమయ్యారు. అధికారులు స్పందించి పటేల్ విగ్రహానికి వేసిన ముసుగును తొలగించాలని, ప్రజాస్వామ్య దేశంలో మహనీయులపై ఉన్న విలువలు కాపాడాలని పట్టణ ప్రజలు, స్థానికులు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే దాము జయంతి


నివాళులర్పిస్తున్న బిజెపి నాయకులు

నవతెలంగాణ - మెట్‌పల్లి

మెట్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే తుమ్మల వెంకటరమణ రెడ్డి జయంతి ఆయన గృహంలో నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు దాము చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దాము ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో మంచినీటి సౌకర్యం, రవాణా సౌకర్యము కల్పించారన్నారు. ఆయన కృషితోనే నిర్మల్ జిల్లాకు దూరం తగ్గించడానికి బాదన్ కుర్తి బ్రిడ్జి నిర్మాణం చేపట్టారన్నారు. నియోజకవర్గ ప్రజలు ,ఆయన చేసిన అభివద్ధిని మరిచిపోలేరన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు, నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, గుంటుక సదాశివ్, రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ నెంబర్ ఇల్లెందుల కృష్ణమాచారి, గడ్డం రాజిరెడ్డి, అంబల్ల జగన్ ,ఆర్కే గణేష్, కొండేపు శ్రీనివాస్, కలాల రాజిరెడ్డి ,సుతారి లింగారెడ్డి, తోకల సత్యనారాయణ, వేముల రవీందర్, శ్రీకర్‌గౌడ్, గుంటుక రవీందర్ పాల్గొన్నారు.

నూతన ఎస్పీగా మహేష్ బాబా సాహెబ్ గీతే



నవతెలంగాణ-సిరిసిల్ల
రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా మహేష్ బాబాసాహెబ్ గీతే నియమితుల య్యారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం 21 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా మహేష్ బాబా సాహెబ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. 2020 ఐపీఎస్ బ్యాచ్ కి చెందిన మహేష్ బాబా సాహెబ్ ఇప్పటివరకు ములుగు జిల్లా ఓఎస్డిలో విధులు నిర్వర్తించారు. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా పనిచేసిన అఖిల్ మహాజన్ ఆదిలాబాద్ ఎస్పీగా బదిలీపై వెళ్లారు. మహారాష్ట్రలోని అహమ్మద్ నగర్ చెందిన మహేష్ బాబా సాహెబ్ ఏలాంటి కోచింగ్ లేకుండానే రెండో ప్రయత్నంలోనే ఐపీఎస్ సాధించారు. అయితే ఉమ్మడి కరీంనగర్ జిల్లా చొప్పదండిలో ట్రేని ఐపీఎస్ విధులు పూర్తి చేసుకోవడం విశేషం.

ఎల్ఆర్ఎస్‌పై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్



నవ తెలంగాణ-చందుర్తి
ఎల్ఆర్ఎస్ విధి విధానాలపై శుక్రవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ప్రదీప్, ఆర్ఐ శ్రీనివాస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీపై కుక్క దాడి..

నవ తెలంగాణ-చందుర్తి
పిచ్చి కుక్కదాడిలో ఆర్ఎంపీ వైద్యుడికి గాయాలైన ఘటన మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన రాజలింగం తన ఇంటి ముందు ఉండగా అటు వైపుగా వస్తున్న పిచ్చికుక్క హఠాత్తుగా దాడి చేసి గాయపరిచింది. స్థానికులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స చేయించి, వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రాజన్నను దర్శించుకున్న కేంద్ర అధికారులు

నవ తెలంగాణ-వేములవాడ
దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని శుక్రవారం కేంద్ర సమాచారశాఖ ప్రసార భారతి అధికారులు దర్శించుకున్నారు. ప్రసార భారతి తెలంగాణ క్లస్టర్ హెడ్ హరిసింగ్, దక్షిణాది రాష్ట్రాల జోనల్ హెడ్ గీతారాణిలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కోడె మొక్కు చెల్లించుకున్నారు. నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వదించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్ శ్రీనివాస్, టీసీ లక్ష్మీనారాయణ, ఆలయ సిబ్బంది ఉన్నారు.

కార్మికుల ఆందోళన...

నవతెలంగాణ-ముస్తాబాద్
ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే విడుదల చేయాలంటూ మండలం లోని వివిధ గ్రామపంచాయతీ కార్మికులు ఆందోళన చేపట్టారు. ముస్తాబాద్ గ్రామ పంచాయతీ వద్ద నుండి ఎంపీడీవో ఆఫీస్ వరకు వేతనాలు వెంటనే చెల్లించాలంటూ కార్మికులంతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికులు మాట్లాడుతూ గత నాలుగు ఐదు నెలల నుండి కార్మికులకు ప్రభుత్వం జీతభత్యాలు ఇవ్వడం లేదని మేము ఎట్లా బతికేదని ప్రశ్నించారు. రేక్కాడితేగాని కానీ డొక్కాడని బతుకులు మావని తక్కువ జీతమైనా పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎల్. శ్రీనివాస్ ఉపాధ్యక్షులు పి.బాబు, కార్యదర్శి ఎల్.రమేష్, కార్మికులు లక్ష్మణ్, రాజు, కరుణాకర్, రవీందర్‌తో పాటు వివిధ గ్రామాల గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

నవతెలంగాణ-ముస్తాబాద్
మండల కేంద్రంలోని అయ్యప్ప దేవాలయంలో శంకర్ నేత్రాలయం చెన్నై ఆధ్వర్యంలో డాక్టర్ లక్ష్మణ్ రావు కుటుంబసభ్యులు ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినది. ఈనెల 7వ తేదీ నుండి 13వ తేదీ వరకు కంటి పోర పరిశీలించి అవసరమున్నవారికి అత్యాధునిక పరికరాలు గల మొబైల్ వాహనంలో వెంటనే ఉచితంగా కంటి ఆపరేషన్ చేసి మందులు కంటి అద్దాలు పంపిణీ చేస్తామని డాక్టర్ లక్ష్మణ్ రావు తెలిపారు. ఆపరేషన్ అయిన రెండు గంటలకే ఇంటికి వెళ్ళవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శంకర్, డాక్టర్ చంద్రశేఖర రావు, తహసీల్దార్ సురేష్, ఎస్సై గణేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాణి నర్సయ్య, విద్యుత్ సహకార సంఘం డైరెక్టర్ అంజిరెడ్డి, అయ్యప్ప దేవాలయ కమిటీ శాశ్వత చైర్మన్ రాజు గురు స్వామి పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కంటి వైద్యులు

అంబేద్కర్, భగత్ సింగ్ చిత్రపటాలను తొలగించడం సరికాదు



నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్
ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఢిల్లీ సీఎంవో నుండి అంబేద్కర్, భగత్‌సింగ్ చిత్రపటాలను తొలగించడం సరికాదని మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి ఆరోపించారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం సీఎంవో నుంచి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, అదేవిధంగా భగత్ సింగ్ చిత్రపటాలను తొలగించడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

కేకే మహేందర్ రెడ్డి పై అనుచిత వాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్
కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు గడ్డం కిరణ్ తెలిపారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లెల్ల గ్రామ మాజీ సర్పంచ్ కేకే మహేందర్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని మండిపడ్డారు. గత పది ఏళ్ల పాలనలో సిరిసిల్లను కేటీఆర్ ఏం అభివృద్ధి చేశారో తెలపాలన్నారు. ఇసుక దోపిడి, ల్యాండ్ మాఫియా చేస్తూ వచ్చిన డబ్బులతో ఫాం హౌస్ లు కట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కేకే మహేందర్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. మరోసారి కాంగ్రెస్ నాయకులపై ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంసాల మల్లేశం, వంతడుపుల రాము, రెడ్డి మల్ల భాను, ప్రభాకర్, అనాల్దాస్ భాను, గుడిసె పవన్, కొంపల్లి విజయకుమార్, బుర్ర యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట
ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు హన్మాండ్లు ఆధ్వర్యంలో ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల చైర్‌పర్సన్ సిరిసిల్ల రేణుక, మహిళ ఉపాధ్యాయులు సౌజన్య, ఖాతీజలను పూలమాలలు వేసి శాలువాలు కప్పి మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీకాంత్, రాజయ్య, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



మహిళ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలి

- సామాజిక ఫించన్‌లను రుణాల కింద జమ చేస్తే క్రిమినల్ చర్యలు
- బ్యాంకర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

నవ తెలంగాణ-సిరిసిల్ల
ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బ్యాంకర్లను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో డీసీసీ/డీఎల్ఆర్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే సామాజిక పింఛన్లను కొన్ని బ్యాంకులు వివిధ రుణాల కింద జమ్మ చేసుకుంటున్నట్లు సమాచారం అందుతుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం అందించే పథకాలు సొమ్మును రుణాల కింద జమ చేసుకోవడానికి వీలులేదని, వెంటనే సంబంధిత లబ్దిదారులకు ఆ సొమ్మును చేర వేయాలని, లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేసే బ్యాంకులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. గత సమావేశంలో జిల్లాలో 3 కొత్త బ్యాంకులో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించామని, ప్రస్తుతం చందుర్తి మండలం మల్యాల గ్రామంలో యూబిఐ బ్యాంకు బ్రాంచ్ ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయని, రుద్రంగి మండలం, కొనరావు పేట్ మండలంలో కూడా బ్యాంకుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించా రు. గ్రామీణ స్థాయిలో ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. వ్యవసాయ టర్మ్ రుణాల కింద 421 కోట్ల రూపాయల రుణ పంపిణీ లక్ష్యానికి గాను 405 కోట్ల 92 లక్షల రుణాలను డిసెంబర్ నాటిక పూర్తి చేయడాన్ని కలెక్టర్ అభినందించారు. రైతుల రుణాలకు రైతు భరోసా నిధులను కొన్ని బ్యాంకులు ఆపుతున్నాయని, ఈ ప్రక్రియను వెంటనే నిలిపి వేయాలని ప్రభుత్వం అందించే సహాయాన్ని రైతులకు తప్పనిసరిగా అందించాలని కలెక్టర్‌తెలిపారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ టిఎన్.మల్లిఖార్జున్ రావు, యూబిఐ రీజనల్ హెడ్ అపర్ణ రెడ్డి, ఆర్‌బిఐ ఎల్‌డీవో వి. సాయి తేజ్ రెడ్డి, వివిధ శాఖల బ్యాంక్ కంట్రోలర్స్, మేనేజర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్స తీసుకోవాలి

మండల వైద్యాధికారిణి సారియా అంజుం



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట
క్షయ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్సలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చేయవద్దని మండల వైద్యాధికారిణి సారియా అంజుం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్ల ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మండల వైద్యాధికారి డాక్టర్ సారియా అంజుమ్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి అవగాహన క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సారియా అంజుం మాట్లాడుతూ షుగర్, క్యాన్సర్, ఆస్తమా దీర్ఘకాలిక వ్యాధులు ఉంటే మందులు నిత్యం వాడాలన్నారు. పొగాకు తీసుకునే వారిలో క్షయ వ్యాధికి గురయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. క్షయ లక్షణా లను గుర్తించాలంటే రెండు వారాలు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, రాత్రి పూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం ఉంటాయన్నారు. ఇలాంటి లక్షణాలు ఉంటే తెమడ పరీక్షలు చేయించు కోవాల్సిందిగా సూచించారు. ఈ క్యాంపులో 50 మందికి టీబి స్క్రీనింగ్ చేశామని అందులో 23 మంది అనుమానితుల నుండి తెమడ నమూనా లను సేకరించి ల్యాబ్‌కి పంపించామన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి 6 నెలల పాటు పూర్తి ఉచితంగా పరీక్షలు, మందులు ఇస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో టిబి సూపర్వైజర్ మహిపాల్, టిబి నోడల్ అధికారిణి పద్మ, ఏఎన్ఎం రాజేశ్వరి, శారద, పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

ఆలిండియా లాయర్స్ యూనియన్
రాష్ట్ర మహిళా కన్వీనర్, సీనియర్ న్యాయవాది చందాల శైలజ



నవతెలంగాణ-గోదావరిఖని:
సమానపనికి సమాన వేతనం, లింగవివక్ష రూపుమాపి రాజకీయ, ఆర్థిక రంగాల్లో మహిళలు రాణించినప్పుడే అసలైన మహిళదినోత్సవం. కానీ కొన్ని సంఘాలు, రాజకీయ పార్టీలు మహిళా దినోత్సవం పేరిట మహిళ లకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించి ఈ ఒక్క రోజు సందడి చేసి తర్వాత మహిళలపై నిత్యం వివక్ష కొనసాగిస్తున్నాయి. మహిళలకు నిత్యం గౌరవం దక్కినప్పుడు ప్రతీ రోజు మహిళా దినోత్సవమే. బాలికలు, మహిళ లు, వద్దుల పై నిత్యం దాడులు జరుగుతున్నా ఆ నిందితులకు సకాలంలో శిక్షలు పడడం లేదు. సమాజంలో పలు రూపల్లో ఉన్న అశ్లీలత, మాదక ద్రవ్యలు, మద్యం వినియోగం తగ్గినప్పుడే మహిళల పై దాడులు ఆగిపోతాయి. మహిళా చట్టాల పై మహిళా న్యాయవాదులు అవగాహన కల్పించడంతో పాటు వాటి అమలుకు ప్రజావారాదులుగా కషి చేయాలి. మహిళా కార్మికుల హక్కుల కోసం విశాఖ జడ్జి మెంట్ అమలు పరచాలి. మహిళా కార్మికులు హక్కుల కోసం మరో పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. ఈ మహిళా దినోత్సవం దానికి వేదిక కావాలని ఆశిస్తున్నాను.

మహిళా ఉపాధి కల్పనే లక్ష్యంగా..

సింగరేణి భూ నిర్వాసిత ప్రభావిత గ్రామాల
సంక్షేమ సంఘం, ఆర్జీ-1 ఏరియా కో ఆర్డినేటర్ జనగామ కృష్ణవేణి



నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి ప్రభావిత ప్రాంతాల మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా సేవలందిస్తున్నాం. సింగరేణి సేవా సమితో బాధ్యులతో మాట్లాడి జనగామ గ్రామంలో మగ్గం, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్ సెంటర్లను ఏర్పాటు చేయించాము. ఈ సెంటర్ల ద్వారా వందలాది మందికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు కషి చేశాను. సింగరేణి భూ నిర్వాసిత ప్రభావిత గ్రామాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోనే మొదటిసారిగా సింగరేణి పార్కులు, గార్డెన్లు, ఆర్జీ-1 సెంట్రల్ నర్సరీలలో జనగామ మహిళలతో పాటు పురుషులకు ఉపాధి కల్పించేలా కషి చేశాం. దీని కోసం సింగరేణి ముఖ్య అధికారులను కలిసి ప్రభావిత గ్రామాల ప్రజల కష్టాలను తెలియజేశాం. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉపాధి కల్పించి వారిని ఆదుకోవడం ఎంతో ఆత్మసంతప్తినిచ్చింది. ఇదే స్ఫూర్తితో సింగరేణి ప్రభావిత గ్రామాల అభివద్ధి కోసం మరింత ముందుకెళ్తాం.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదు

మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



నవ తెలంగాణ-తంగళ్ళపల్లి
సభ్య సమాజం తలదించుకునేలా బీఆర్ఎస్ నాయకుల మాటలు ఉన్నాయని, తెలంగాణ ఉద్యమంలో నేను పనిచేశానని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదని కాంగ్రెస్ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్ కుమార్ అన్నారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన కేకే మహేందర్ రెడ్డిని విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు మెమోలు

నవతెలంగాణ-తంగళ్ళపల్లి
సమయపాలన పాటించని పంచాయితీ కార్యదర్శులకు మెమోలు జారీ చేసినట్లు జిల్లా ఇన్‌చార్జీ పంచాయతీ అధికారి శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తంగళ్లపల్లి మండలంలోని నర్సింహులపల్లి, బద్దెనపల్లి, అంకిరెడ్డిపల్లి, బాలమల్లుపల్లి కార్యదర్శులకు మెమోలు జారీ చేశారు. ఇల్లంతకుంట మండలంలోని వెల్జిపూర్, పొత్తూరు, ఓబులాపూర్, వల్లంపట్ల, కిష్టారావుపల్లి, తెనుగువానిపల్లి, పెద్దలింగాపూర్, వెంకట్రావుపల్లి, కోనరావుపేట మండలంలోని కొండాపూర్, గొల్లపల్లి, గంభీరావుపేట మండలంలోని నర్మాల, లక్ష్మీపూర్, ముస్తఫానగర్ పంచాయతీ కార్యదర్శులకు మేము జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వీరందరూ మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆయన ఆదేశించారు. గ్రామ పంచాయతీకి ఉదయం 9 గంటల లోపు హాజరు కావలసిన పంచాయతీ కార్య దర్శులు 9 గంటల తరువాత రావడం, హాజరు నమోదు చేయడంలో అలసత్వం, డీఎస్ఆర్ ఆలస్యంగా చేయడంతో వారికి మెమోలు జారీ చేసినట్లు తెలిపారు.

బీసీ నూతన కార్యవర్గం ఎన్నిక



నవ తెలంగాణ-వీర్నపల్లి
వీర్నపల్లి మండలం వన్ పల్లి గ్రామంలో బీసీ సంఘం మండల అధ్యక్షులు పరమల మల్లేశం అధ్వర్యంలో నూతన బీసీ గ్రామ కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షులుగా కావేరి సతీష్, ఉపాధ్యక్షులు ఉప్పునీటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నాయుడు రవి, సెక్రటరీగా దుంపటపల్లి వెంకటస్వామి, కార్యవర్గ సభ్యులుగా ఉప్పునీటి తిరుపతి, స్వామి, సత్తయ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జోగినపల్లి మల్లేశం, సలహాదారు దేశరాజు సత్తయ్య, కార్యదర్శి లింబద్రి, నాగరాజు నాయకులు ఉన్నారు.

అనేక రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుంది

సీఐటీయూ నాయకురాలు జ్యోతి



నవతెలంగాణ-గోదావరిఖని:
సిఐటియు తరపున మహిళలందరికీ శ్రామిక మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నాం 115 సంవత్సరాల కిందట మహిళలకు ఓటు హక్కు కల్పించాలని వారిపై జరుగుతున్న క్రూరమైన దోపిడి, అమానవీయ పని పరిస్థితులకు వ్యతిరేకంగా మహిళా కార్మికులు అనేక సంవత్సరాలు పాటు చేసిన పోరాట ఫలితంగానే అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆవిర్భవించింది. అనేక రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతున్నది. కానీ ఈ రోజు దేశవ్యాప్తంగా మహిళలపై ఇంట బయట హత్యలు అత్యాచారాలు పెరుగుతున్నాయి. ఇది చాలా ఆందోళనకరంగా ఉన్నది. మతం ముసుగులో స్త్రీలను కట్టడి చేయాలని ప్రయత్నాలు జరుగుతు న్నాయి. అంగన్‌వాడీ ఆశా మున్సిపల్, గ్రామపంచాయతీ తదితర ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో మహిళా కార్మికుల సంఖ్య పెరుగుతు న్నప్పటికీ వారికి పని భద్రత ,కనీస వేతనాలు, చట్టాలు అమలు కావడం లేదు. మహిళల ఇంటి పనిని కూడా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నాం.

పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలి : జిల్లా కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

నవతెలంగాణ-సిరిసిల్ల
ప్రణాళికాబద్ధంగా పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మార్చి చివరి లోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఎల్ఆర్ఎస్‌పై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎల్ఆర్ఎస్ 2020 క్రింద 42 వేల 942 దరఖాస్తులు రాగా 23 వేల 515 దరఖాస్తులు ఆమోదించామని, 1230 దరఖాస్తులు తిరస్కరించామని అన్నారు. ప్రస్తుతం ఎల్ 1 వద్ద 6776 దరఖాస్తులు, ఎల్2 వద్ద 385, ఎల్3 వద్ద 76 పెండింగ్ ఉన్నాయని, వీటిని మార్చి చివరి నాటికి పరిష్కరించాలని అన్నారు. ఎల్ఆర్ఎస్ స్క్రూటినీ పూర్తి చేసుకుని ఆమోదించిన దరఖాస్తుదారులను ఫాలో అప్ చేయాలని అన్నారు. జిల్లాలో 23 వేల 515 దరఖాస్తులు రుసుం చెల్లింపు కోసం ఆమోదిస్తే ఇప్పటి వరకు 184 మాత్రమే ఫీజు చెల్లించారని, మిగిలిన దరఖాస్తుదారులు మార్చి 31 లోపు రుసుం చెల్లించి ప్రభుత్వం అందించే 25 శాతం రాయితీ వినియోగించుకునేలా చూడాలని అన్నారు. పెండింగ్ ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్క్రూటినీ కోసం అవసరమైన మేర బృందాలను ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి బృందంలో నీటి పారుదల శాఖ అధికారి, రెవెన్యూ అధికారి, టౌన్ ప్లానింగ్/ పంచాయతీ కార్యదర్శి ఉండాలని అన్నారు. మండలంలో అవసరమైన మేర లాగిన్ అందించడం జరుగుతుందని, అవసరమైన బృందాలను ఏర్పాటు చేసుకొని ప్రతి రోజూ ఎన్ని దరఖాస్తుల స్క్రూటినీ జరుగుతుందో లక్ష్యాలు నిర్దేశించుకో వాలని అన్నారు. ఈ సమావేశంలో డీపీవో శేషాద్రి, ఆన్సర్ ఎంపీడీవోలు, తహసీల్దార్లు, నీటి పారుదల శాఖ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలి...

జీపీ వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నల్ దాస్ గణేష్



నవ తెలంగాణ-వీర్నపల్లి
గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరించాలని జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్య దర్శి అన్నల్ దాస్ గణేష్ ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ఎంపీడీవో ఆఫీస్ ఎదుట గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణేష్ అర్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్బంగా జిల్లా కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ప్రతినెల గ్రీన్ ఛానల్ ద్వారా 2025 జనవరి 1 నుండి వేతనాలు చెల్లిస్తామని ప్రకటించిన విధంగా వేతనాలు చెల్లించాల న్నారు. ఎస్టీవోలతో నిలిచిపోయిన బకాయి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్ కుమార్, గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు న్యాత నర్సయ్య, ప్రధాన కార్యదర్శి మంత్రి వినీత్, గ్రామ పంచాయతీ కార్మికులు శారద, రమేష్, లద్దూరి నర్సయ్య, మల్లేశం, జింక లింగవ్వ నర్సవ్వ, పూజా, నగేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిల్స్, గ్లాసల పంపిణీ



నవ తెలంగాణ-వీర్నపల్లి
వీర్నపల్లి మండలం గర్జనపల్లి తండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కు వాటర్ బాటిల్స్, గ్లాసలను మాజీ సర్పంచ్ శ్రీనివాస్ శుక్రవారం అందించారు. ఈ సందర్బంగా మాజీ సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా దాహం తీర్చుకోవడానికి వాటర్ బాటిల్‌ను రాగి జావ త్రాగడానికి 10 వేల సామగ్రి అందిం చామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం తిరుపతి జాదవ్, సీతారాం నాయక్ తండా మాజీ సర్పంచ్ రవి నాయక్, నాయకులు రాకేష్ గౌడ్, నవీన్, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

ప్రతి మహిళకు రాజన్న కుటుంబం అండగా ఉంటుంది

మక్కాన్‌సింగ్ సేవా సమితి అధ్యక్షురాలు మనాలీ ఠాకూర్



నవతెలంగాణ-గోదావరిఖని:
శక్తి రూపానికి ప్రతీక అయిన మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి. వారి అభివద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ పలు పథకాలు ప్రవేశ పెట్టి నిత్యం వాటిని పర్యవేక్షస్తూ అమలు చేస్తోంది. డ్వాక్రా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పలు రకాల స్కీమ్స్ ను అమలు చేస్తోంది. మహిళ లు పాజిటివ్ మైండ్, మంచి విల్ పవర్ తో ముందుకు వెళ్ళాలి. మహిళలే ప్రతీ కుటుంబానికి ఒక వెన్నుముఖలాగా ప్రతీ మహిళా ఎదిగేలా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కషి చేస్తున్నారు. నియోజక వర్గంలోని ప్రతీ మహిళకు రాజ్ ఠాకూర్ కుటుంబం అండగా ఉంటుంది.

చాలెంజ్‌లను స్వాగతించండి...



- ప్రతి అడ్డంకిని ఒక అవకాశంగా మలుచుకోండి
- బీజేపీ రామగుండం ఇన్‌ఛార్జి కందుల సంధ్యారాణి

నవతెలంగాణ-గోదావరిఖని:
ఈ రోజుల్లో రాజకీయాల్లో మహిళగా నిలబడటం సవాలు తలపెడుతుంది. సామాజిక, కుటుంబ, రాజకీయ స్థాయిల్లో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించాలంటే పట్టుదల, సహనం, నిబద్ధత అవసరం. ప్రతీ రోజు నా లక్ష్యాలను గుర్తు చేసుకోవడం. కుటుంబం, స్నేహితులు, సహచరుల మద్దతు. నా పనితీరు ద్వారా నన్ను నిరూపించుకోవడం. ప్రతీ ఎదురు దెబ్బను ఒక పాఠంగా భావించడం. పార్టీ సిద్ధాంతాలు, న్యాయం, సమానత్వం, ప్రజా సేవ అనే దక్పథంతో ముందుకి వెళ్ళడం ద్వారా గత 2 దశాబ్దాలుగా రాజకీయాల్లో నిలబడి ప్రజాసేవ చేస్తున్నాను.

మహిళలకు అన్ని రంగాల్లో ఉన్నత స్థానం...

ఆర్జీ 1 ఏరియా సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్



నవతెలంగాణ-గోదావరిఖని:
భారతీయ సంస్కతీ సంప్రదాయాల్లో మహిళలకు ఉన్నత స్థానం ఉంది. లేడీస్ ఫస్ట్ అనే మాట మనం పిలిచే శ్రీమతి, శ్రీలో ఉంటుంది. కాని మారిన సామాజిక పరిస్థితులు టెక్నాలజీ మనుషుల్ని ఎంత ఉన్నతంగా నిలబెట్టాయో మహిళల పట్ల అంతే నీచమైన అభిప్రాయాలు కొందరిలో కలగజేస్తున్నాయి. అవే నేడు మహిళల పట్ల అఘాయిత్యాలకు కారణమ వుతున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు ఇంకా రావాల్సిఉంది. సింగరేణిలో ఉన్నతస్థాయి ఉద్యోగం అంటే చాలా ఒత్తిడితో కూడుకున్నది పారిశ్రామిక ప్రజా సంబంధాలు జాగ్రత్తగా నిర్వహిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించడం, ఏరియా జి ఎం గా అందరి బాగోగులు చూడడం ఒక టాస్క్ ఫోకస్ గా ఉండాలి. ఒత్తిడి తగ్గాలంటే ఇంట్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చూడటం చిన్న చిన్న బాధ్యతలను నేనే చూసుకోవడం ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందివ్వడం లాంటి సహకారం నేను చేస్తాను. జీవిత భాగస్వామిగా ఈ మాత్రం ఒకరికొకరు సహకరించుకోవడం వల్ల కుటుంబం అభివద్ధిలోకి వస్తుందని నేను నమ్ముతాను. సింగరేణి గత రెండు దశాబ్దాలుగా సేవ సంస్థ ఏర్పాటు చేసి మహిళల ఆర్థికాభివద్ధికి సహకరిస్తోంది, ఎందరో మహిళలు ఈ అవకాశాన్ని వాడుకొని ఆర్థిక స్వాతంత్రం పొందుతున్నారు. అత్యంత కష్టంతో కూడిన ఉద్యోగమైన భూగర్భ గనుల్లో మహిళా అధికారులు బాధ్యతలు చేపట్టి సగర్వంగా వృత్తిని నిర్వర్తిస్తున్నారు, మరో వైపు వుమెన్ ప్రొటెక్షన్ టీం ప్రతి ఆఫీస్ లో ఏర్పాటు చేసి మహిళల రక్షణకు సింగరేణి సంస్థ కట్టుబడి ఉంది.

మహిళల ఉద్యోగస్తులకు క్రచ్ ఏర్పాటు చేసి కానుక ఇవ్వాలి

ఆరేపల్లి రాజమౌళి, కార్యదర్శి మెండె శ్రీనివాస్



నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణిలో వివిధ గనులు, విభాగాల్లో పనిచేస్తున్న మహిళల ఉద్యోగస్తుల కోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా క్రచ్ ఏర్పాటుపై సింగరేణి యాజమాన్యం ఆదేశాలు జారీ చేసి బహుమతిగా ఇవ్వాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆర్జీ 1 బ్రాంచ్ అధ్యక్షులు ఆరేపల్లి రాజమౌళి, కార్యదర్శి మెండె శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. వారు మహిళలందరికీ ఒక ప్రకటనలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో భూపాలపల్లిలో మొదలుపెట్టి అన్ని ఏరియాలలో మహిళా ఉద్యోగుల సమస్యలపై క్రచ్ ఏర్పాటు కోసం జిఎంలకు వినతి పత్రాలు, డైరెక్టర్లకు వినతి పత్రాలు ఇచ్చిన ఇప్పటివరకు ఎక్కడ ఆచరణలోకి తీసుకు రాలేదని, మరోవైపు గెలిచిన సంఘాలు స్ట్రక్చర్ సమావేశంలో మాట్లాడమని దాటవేస్తున్నారే తప్ప ఆచరణలోకి తీసుకురావడం లేదని, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్ట్రక్చర్ సమావేశంలో యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి క్రచ్ ఏర్పాటుపై సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలని గుర్తింపు సంఘాన్ని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు తరుపున కోరారు.

కృష్ణవేణి హైస్కూల్‌లో క్రీడా పోటీలు...



నవతెలంగాణ-గోదావరిఖని: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గోదావరిఖని మార్కండేయ కాలనీలోని కృష్ణవేణి హైస్కూల్‌లో చదివే పిల్లల మాతమూర్తులకు క్రీడాపోటీలను శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాఠశాల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి హాజరై జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతరం అలుపెరుగని పనులల్లో నిమగ్నమై ఉన్న మహిళలకు కాస్త ఊరట కలిగించేందుకు, వారి మానసిక ఉల్లాసానికి ఇలాంటి పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

తల్లిదండ్రుల స్ఫూర్తితోనే...



- అవంతరాలు ఎదురైనా చదువు ఆపలేదు
- చిన్నతనం నుంచే లీడర్‌షిప్ క్వాలిటీస్
- చదువే ప్రధానంగా పెరిగాను
- అమ్మతోపాటు కుటుంబ బాధ్యతలను పంచుకున్నా
- మహిళా దినోత్సవం సందర్భంగా నవతెలంగాణతో సింగరేణి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్

రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ విభాగంలో అదనపు డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే రామగుండం సింగరేణి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, పీడియాట్రిక్ విభాగం ప్రొఫెసర్‌గా, చిన్నపిల్లల్లో వచ్చే సమస్యలు పరిష్కరించే ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్ విభాగంలో కీలకంగా వ్యవరహిస్తూ, యుక్త వయస్సు పిల్లల స్థితిగతులను అర్థం చేసుకొని వారి సమస్యలకు పరిష్కారం చూపే ఆడలోసెన్స్ హెల్త్ అకాడమీ చైర్‌పర్సన్‌గా బహుముఖ బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ హిమబిందు సింగ్ ఈ తరం యువతకు ఎంతో ఆదర్శం. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్ఫూర్తి దాయక మహిళ అనుభవాలకు నవతెలంగాణ అక్షరరూపం ఇచ్చింది.

నవతెలంగాణ-గోదావరిఖని/కోల్‌సిటి

అమ్మే నాకు స్ఫూర్తి..

మా అమ్మనాన్నలు ఇద్దరు డాక్టర్లే. నాతో పాటు ముగ్గురు బ్రదర్స్ మొత్తం నలుగురు సంతానం. అమ్మ చదువుకునే రోజుల్లో ఆడపిల్లలపై చాలా వివక్ష ఉండేది. అమ్మాయిలను ఒంటరిగా బయటకి పంపే పరిస్థితి లేకపోయినా అమ్మ గ్వాలియర్ రోడ్లపై సైకిల్ తొక్కుతూ మగపిల్లలతో పోటీ పడుతూ వారి నుంచి రకరకాల ఇబ్బందులు ఎదురైనా తాను మెడికల్ కోర్సును పూర్తి చేసింది. పెళ్లి అయ్యి మేం పుట్టిన తర్వాత ఇంటిని నడిపిస్తూ, మమ్మల్ని పెంచుతూ, నైట్ డ్యూటీలు చేస్తూ క్లిష్ట పరిస్థితులు ఎదురైనా తాను వెనెక్కి తగ్గలేదు. దాంతో చిన్నతనం నుంచే మా పనులు మేం చేసుకునేలా అమ్మ మమ్మల్ని తయారు చేసింది. మేము పుట్టిన తర్వాత ఎంతో శ్రమకోర్చి అమ్మ తన పీజీ కోర్సును పూర్తి చేసింది. చదువుకు నేందుకు అమ్మ పడుతున్న కష్టం చిన్నతనంలోనే మా మనసుల్లో బలంగా నాటుకుపోయింది. చదువే మనకు ప్రధానం అన్నట్లుగా మమ్మల్ని మార్చివేసింది. చిన్నతనం నుంచే అమ్మ చదివే మెడికల్ పుస్తకాలను పరిశీలించడం, అమ్మతో పాటు ఇంటి బాధ్యతలను పంచుకోవడం, పాఠశాల వయస్సు నుంచే తమ్ముళ్లకు వంటచేయడం లాంటి పనులు అలవాటు చేసుకున్నాను. పాఠశాల, కాలేజీ స్థాయిలో చదువు, క్రీడల్లో బాగా రాణించడం టీచర్లు అప్పగించిన పనులు బాధ్యతగా నెరవేర్చడంతో లీడర్‌గా టీచర్లు ప్రోత్సాహందించేవారు. మంచి ర్యాంకు సాధించడంతో మెడికల్ కళాశాలలో సీటు వచ్చింది. ఎంబీబీఎస్ చదువుతున్న క్రమంలో ఇంజినీరింగ్ చదువుతన్న బ్రదర్స్‌కు ఇంట్లో వంట చేసి నేను కళాశాలకు వెళ్లేదాన్ని. ప్రభుత్వ డాక్టర్లుగా అమ్మనాన్నలు వేరువేరు చోట్ల విధులు నిర్వర్తిస్తుంటే ఇంటి బాధ్యతలు చూసుకునేదాన్ని ఇలా మల్టీ టాస్కింగ్ బాధ్యతలు అలవాటయ్యాయి.

నాన్న ప్రోత్సాహం మరవలేనిది..

చిన్నతనం నుంచి బ్రైట్ స్టూడెంట్‌గా ఉన్న నాకు నాన్న ప్రోత్సాహం అందించేవారు. ఎంబీబీఎస్‌లో డిస్టింక్షన్ సాధిస్తే నాన్న ఎంతో గర్వపడేవారు. ఇంట్లో బాధ్యతలు చూసుకోవడంతో పాటు చదువులో ఉన్నతంగా రాణిస్తోందని, మంచి కాంపిటేటివ్ స్పిరిట్ ఉందని తమ్ముళ్లకు నన్ను స్ఫూర్తిగా చూపిస్తూ ఎంతో ప్రోత్సహించేవారు.

పెళ్లైన తర్వాత పీజీ..

పెళ్లి గురించి ఆలోచన రాకముందే తల్లిదండ్రులు నాకు పెళ్లి చేశారు. పెళ్లి అయితే ఏంటి చదువు మానేయాలా అని అత్తింటి వారిని ఒప్పించి కుటుంబానికి దూరంగా హాస్టల్లో ఉంటూ మెడికల్ పిడీయాట్రిక్ విభాగంలో పీజీ పూర్తి చేశాను. ఎప్పుడైనా సెలవుల్లో ఇంటికెళ్లినప్పుడు అత్తతో సమానంగా పూజలు చేసి, వంటింట్లోకి వెళ్లి వంట పనులు చేసేదాన్ని. కూతురుగా, కోడలుగా, భార్యగా అన్ని బాధ్యతలు సక్రమంగా నిర్వహించాను. పీజీలో మా ప్రొఫెసర్లు అందించిన సహకారం మరవలేనిది వారి సహకారంతో విజయవంతంగా పీజీ కోర్సును పూర్తి చేయగలిగాను. అనంతరం హైదరాబాద్‌లో కొన్నిరోజుల అనంతరం వరంగల్ జిల్లా సంగెం మండలం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగం వచ్చింది. అప్పటికే పాప పుట్టినా విధులకు వెళ్లడం మానివేయలేదు. అత్తమ్మ పాపను పట్టుకుంటే ఆమె సహకారంతో నేను టీమ్‌లీడర్‌గా విజయవంతంగా 2 సంవత్సరాలు బాధ్యతలు నిర్వర్తించాను. అనంతరం నా సర్వీస్‌ను సరెండర్ చేసి మెడికల్ ఎడ్యుకేషన్ వైపు వచ్చి ప్రొఫెసర్‌గా మొదటి పోస్టింగ్‌ను గాంధీ మెడికల్ కాలేజీలో చేరాను.

యువత సమస్యల పరిష్కారం కోసం

2010 ప్రభుత్వం, ప్రిన్సిపాల్ సెక్రటర్ చాయ రతన్ సహకారంతో యువత కోసం యువ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ అడలోసెన్స్ పేరుతో యువ అనే ప్రోగ్రాంను చేపట్టాము. ఎడ్యుకేషన్ విభాగం అధికారుల సహకారంతో యువత సమస్యలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా పరిష్కార మార్గాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ప్రారంభించాం. డాక్టర్లు స్వయంగా స్కూళ్లు, కాలేజీలకు వెళ్లి కౌన్సెలింగ్ చేసేవారు. యుక్త వయస్సులో పిల్లలు ఎదుర్కొనే ప్యూబర్టీ లాంటి సమస్యలు, మెంటల్, ఫిజికల్ హెల్త్, సెక్స్ ఎడ్యుకేషన్, రోడ్ సేఫ్టీ లాంటి ఎన్నో అంశాలపై అవగాహన కల్పించేందుకు పీడియాట్రిక్ విభాగంలో పనిచేసిన 4 వేల మంది డాక్టర్లు కషి చేస్తున్నారు. ఆ విభాగానికి నేను ప్రస్తుతం చైర్ పర్సన్‌గా పనిచేస్తున్నాను. కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తునే కీలకమైన విధులు నిర్వర్తిస్తున్న నేను ఎన్ని అవాంతరాలు, అడ్డంకులు ఎదురైనా ఎక్కడా ఆగిపోలేదు. మీ లాగే నా గ్రోత్ కూడా ఇంకా ఉంది నా పిల్లలకు ఇప్పటికీ చెబుతునే ఉంటా. మా తో పాటు అమ్మకు ఇతర బాధ్యతలు కూడా ఉన్నాయి అనే విధంగా వారిని నేను ఇండిపెండెంట్‌గా తయారుచేస్తున్నాను.

450 మంది నా పిల్లలే..

నీలోఫర్ ఫిడియాట్రిక్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించి అక్కడ న్యూనెటల్ బేబీల ఆరోగ్య పరిరక్షణ కోసం కషి చేసేక్రమంలో డీఎంఈ లో అడిషనల్ డైరెక్టర్‌గా బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. అప్పటి నుంచి అడ్మినిస్ట్రేషన్ వైపు ఉన్నాను. దీనిలో భాగంగా రామగుండం మెడికల్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వచ్చాను. అప్పుడు ఈ నిర్మాణాలు ఏవి లేవు. చాలా శ్రమకు ఓర్చి ఒక్కొక్కటిగా సమకూర్చుకుంటూ ఆధునాతనంగా ఆస్పత్రిని తీర్చిదద్దడంలో కీలక భూమిక పోషించాను. ప్రస్తుతం 450 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ అకాడమిక్ ఈయర్‌లో ఈ సంఖ్య ఏడు వందలకు చేరుతుంది. వారంతా నా సొంత పిల్లలే అన్నట్లుగా భావిస్తున్నాను.



వారికి ఎలాంటి కష్టం కలగకుండా వారిని కంటికి రెప్పలా కాపాడుతున్నాం. ఒక తల్లి బిడ్డకు నేర్పించినట్లుగా బాడీ లాంగ్వేజ్ పట్ల, వారు ఉపయోగించే పదజాలం పట్ల చిన్న పిల్లల్లాగా శ్రద్ధ తీసుకుంటున్నాం. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ నివారించేలా ఒకరికొకరు కలిసి ఉండేలా గౌరవించుకునేలా జెండర్ ఈక్వాలిటీ పాటించేలా, మహిళా ఉద్యోగులు, ఇతరుల పట్ల సుహ్రుద్భావం, గౌరవంతో మెలిగేలా వారికి ఎప్పటికప్పుడు క్రమశిక్షణను బోధిస్తున్నాం.

స్త్రీలు ఇంటికి పరిమితం కావొద్దు..

స్త్రీలు వంటింటికే పరిమితం కావొద్దు. డిగ్రీలు హోదా కోసం, అలంకార ప్రాయంగా మిగిలిపోవద్దు. మనం కూడా బోర్డర్‌లో ఒక సైనికుడిలాగా పనిచేయాలి. ఇంటి పెద్ద మగవారే, మనం నిమిత్త మాత్రులమే అన్నట్లుగా వ్యవహరించవద్దు. మన ఆలోచనల్లో మార్పు రావాలి. కొన్నింటకే పరిమతం కాకుండా ఉద్యోగ జీవితంలో ఉన్నత గుర్తింపు సాధించేలా కషి చేయాలి. భర్తతో పాటు తన పాత్ర కూడా ఈ కుటుంబానికి అవసరం అన్నట్లు ఆలోచన విధానం మారాలి. దీని కోసం నా చుట్టు పక్కన ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నా. స్త్రీలకు క్రమశిక్షణ, డెడికేషన్ తో పాటు విజన్ అధికంగా ఉంటాయని గుర్తు చేస్తూ వారిని మోటివేట్ చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నా.

ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడీయాట్రిక్ నుంచి మెడల్స్

44 వేలకు పైగా డాక్టర్లు, అమెరికా తర్వాత మనదేశంలోనే అతిపెద్దదిగా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడీయాట్రిక్ (ఐఏపీ) ఆర్గనైజేషన్ న్యూ నెటాలజీ (న్యూబార్న్‌బేబి)లో నేను చేసిన రిసెర్చ్‌ను గుర్తించి గోల్డ్‌మెడల్‌తో బహుకరించింది. మెడికల్ పుస్తకాలు రాసిన మెహబర్ సింగ్ లాంటి వారి పర్యవేక్షణలో మెడల్ సాధించడం నా జీవితంలో మరిచిపోలేని అనుభవం. నీలోఫర్‌లో పీడియాట్రిక్ విభాగం హెడ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత న్యూనెటాలజీ విభాగాన్ని ప్రపంచంలోనే ఎక్కడ లేని విధంగా న్యూ బార్న్ బేబీల కోసం తీర్చిదిద్దాం. దీనికి అనుబంధంగా ఎన్నో కాన్ఫరెన్సులు నిర్వహించడం, ఐసీఎంఆర్, బ్రిటీష్ మెడికల్ జర్నల్లలో ప్రచురణలు మెడికల్ ఫీల్డ్‌లో ఉన్న ఎన్నో గొప్ప అనుభవాలు. మా ప్రొఫెసర్ రాఘరావు సహకారంతో మొదటిసారి ఐఏపీ ఎక్జిక్యూటివ్ బోర్డు మెంబర్‌గా కీలక బాధ్యతలు చేపట్టాను. ప్రొఫెసర్లపై ఉన్న గౌరవం, ఇంట్లో, డ్యూటీలో నా పనితీరును అభినందించే ఆయన నేను చేయగలను అనే నమ్మకంతో మొదటిసారిగా నాకు ఐఏపీ ట్విన్ సిటీస్ బ్రాంచ్ బాధ్యతలను అప్పగించారు. ప్రభుత్వ సర్వీసుకు సమానంగా 30 ఏళ్లుగా ఆ బాధ్యతలను నిర్వర్తిస్తున్నాను. అనంతరం అదే బ్రాంచ్‌కు ఉమెన్ ప్రెసిడెంట్‌గా, అనంతరం 2018లో స్టేట్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించాను. న్యూ నెటాలజీ ఫోరం స్టేట్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించాను. ఈ మేరకు చిన్న పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ఎన్నో సోషల్ వర్క్ కార్యక్రమాలు చేపట్టాము.

టీచింగ్‌పై ఉన్న గౌరవంతో పిల్లలతో ఇంటరాక్టింగ్ విధానాల ద్వారా బోధించడంతో బెస్ట్ మెడికల్ టీచర్‌గా గాంధీ మెడికల్ కళాశాల నుంచి అవార్డు అందుకున్నాను. అనంతరం ప్రమోషన్‌పై నీలోఫర్ ఆస్పత్రికి వెళ్లాను. ఆస్పత్రికి వచ్చిన పిల్లలకే కాకుండా స్కూళ్లు కాలేజీలు, అంగన్‌వాడీలకు పిల్లల పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణపై క్యాంపులు నిర్వహించి అవగాహన కల్పించడం గొప్ప అనుభూతినిచ్చాయి.

సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ..



నవతెలంగాణ-పెద్దపెల్లి టౌన్ సీఐటీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ నుండి అమరవీరుల స్థూపం వరకు అన్ని రంగాల్లో పనిచేస్తున్న శ్రామిక మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ జి.జ్యోతి మాట్లాడుతూ 100 సంవత్సరాల క్రితం మహిళా కార్మికులు పై జరుగుతున్న దోపిడికి వ్యతిరేకంగా ఓటుహక్కు కావాలని డిమాండ్స్ పై చేసిన పోరాటాల ఫలితంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆవిర్భవించిందని అన్నారు. దేశంలో శ్రామిక మహిళలపై దారుణమైన శ్రమదోపిడీ జరుగుతుందని, లింగ వివక్ష కొనసాగుతుందని, మహిళలపై ఇంటా బయట హింస పెరుగుతుందని వీటిని అరికట్టడంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.వనజారాణి భాగ్యలక్ష్మి,రజిత, ఎస్ రామలక్ష్మి, లక్ష్మి, శారద సువర్ణ, సులోచన అమృతతోపాటు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు నాయకులు ఎస్.రవీందర్, ఎస్.వెంకట స్వామి పాల్గొన్నారు.

డీజే సౌండ్స్ ఉపయోగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు

రామగిరి ఎస్సై పెట్టం చంద్రకుమార్



నవతెలంగాణ-రామగిరి రామగుండం కమిషనరేట్ పరిధిలో డీజే సౌండ్స్ ఉపయోగించడం పై నిషేధం ఉన్నప్పటికీ రామగిరి మండల పరిధిలో పెళ్లి బరాత్ లకి ర్యాలీలు ఇతర కార్యక్రమాలకు డీజే సౌండ్స్ ఉపయోగిస్తూ శబ్ద కాలుష్యం, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న డీజే నిర్వాహకులను రామగిరి ఎస్సై పెట్టం చంద్రకుమార్ శుక్రవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ డీజే సౌండ్స్ ఉపయోగించడం వల్ల వృద్ధులు,గుండె జబ్బులు గల వారికి, చిన్నపిల్లలకి ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. అనుమతులు లేకుండా డీజేలను ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళా దినోత్సవ వేడుకలు

నవ తెలంగాణ-రామగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మండల ఎంపీడీవో బద్రి శైలజరాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటుతున్నారని, ప్రతి మహిళా తన కాళ్లపై తన నిలబడే విధంగా ఉపాధి చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో దేవరకొండ ఉమేష్, జూనియర్ అసిస్టెంట్ షరీఫ్, ఈజీఎస్ ఏపీవో మౌనిక, టీఏలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమల్లో దళారులకు తావులేదు

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణా రావు

నవతెలంగాణ-ఎలిగేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో దళారీ వ్యవస్థకు, పైరవీలకు ఎలాంటి తావులేదని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఎలిగేడు మండలం శివపల్లిలో శుక్రవారం తొమ్మిది ఇందిరమ్మ ఇళ్లకు స్థానిక అధికారులు, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే విజయరమణారావు భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతూ నిరుపేద ప్రజల సొంతింటి కలను సాకారం చేస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి మండలంలోని ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. నియోజక వర్గంలో ఏడాదికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి, ప్రతి లబ్దిదారునికి రూ. 5 లక్షలు ఇవ్వనుందన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి,యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్ రావు, ఎంపీడీవోభాస్కర్ రావు, పీఆర్ ఎఈ రవీంద్ర నాథ్, కార్యదర్శి శ్రావణ్, కాంగ్రెస్ నాయకులు మండిగ రాజనర్సు, అర్షనపల్లి వెంకటేశ్వర్ రావు, చింతకుంట గోపి, నరహరి సుధాకర్ రెడ్డి, పల్లెర్ల వెంకటేష్ , కొత్తిరెడ్డి అశోక్ రెడ్డి, తిరుపతి గౌడ్, పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు

ప్రభుత్వ విప్పు అడ్లూరి లక్ష్మణ్ కుమార్



నవతెలంగాణ జూలపల్లి /ధర్మారం పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించిన ధర్మారం మండలం బంజేరుపల్లి తండ- బి గ్రామంలో ఇటీవల మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం కొరకు నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంజేరుపల్లి తండా-బిలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. 2 లక్షల రూపాయల రుణమాఫీ కానీ వారికి కూడా రుణమాఫీ చేసి తీరుతామని,సన్నవడ్ల బోనస్ కూడా రైతుల ఖాతాలో జమ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు.

పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



నవతెలంగాణ-జూలపల్లి మండలం కోనరావుపేట గ్రామాలల్లో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టారు. కోనరావుపేటలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరామణారావు మాట్లాడుతూ గతంలో ప్రజలను మభ్యపెట్టి రెండుసార్లు అధికారంలోకి వచ్చి ఇల్లు ఇవ్వకుండా మోసం చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పథకాలను దశలవారీగా అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం మడమ తిప్పకుండా ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తున్నాం.త్వరలోనే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ నిర్మాణాలకు మంజూరు ఇవ్వడం జరుగుతుందిఅని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గందు సంజీవ్, దూలికట్ట పీఏసీఎస్ చైర్మన్ వేణుగోపాల్ రావు, మాజీ ఎంపీపీ రమ రాంగోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ దారా బోయిన నరసింహం యాదవ్, ఎంపీడీవో పద్మజ ఎంపీవో అనిల్ రెడ్డి, ఎమ్మార్వో స్వర్ణలతలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారించాలని వినతి



నవతెలంగాణ-మంథని మంథని పట్టణంలోని శ్రీపాద కాలనీలో గత కొద్దిరోజులుగా మిషన్ భగీరథ మంచినీళ్లు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,వెంటనే స్పందించి అవార్డులో సింటెక్స్ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి నీటి ఎద్దడి నివారించాలని శుక్రవారం మంథని మున్సిపల్ కమిషనర్ కు యూత్ నాయకులు డిగంబర్ వినతి పత్రం అందజేశారు.

సింగిరెడ్డిపల్లిలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ సింగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆర్జీ-2 ఏరియా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఓటు జీఎం ఏం.రాముడు ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతిమనిషికి డబ్బు సంపాదన కంటే ఆరోగ్యకరమైన జీవితం ఎంతో ముఖ్యమని అన్నారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి ఉత్పాదకత కాకుండా పరిసర ప్రభావిత గ్రామాల మౌలిక వసతుల కోసం సింగరేణి సంస్థ ఎప్పుడు సామాజిక బాధ్యతగా ముందుంటుందని అందులో బాగంగానే ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, సింగిరెడ్డిపల్లి గ్రామ ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ జిగురు రవీందర్, మెడికల్ సూపరింటెండెంట్ డా.మహిపాల్, పర్యావరణ అధికారులు సురేష్ బాబు, వేణుకుమార్, పాల్గొన్నారు.

ఆర్జీ-2లో మహిళలకు ఆటల పోటీలు

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ-2 ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఎన్సీఓఏ క్లబ్ నందు మహిళలకు శుక్రవారం పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా సేవా అధ్యక్షురాలు వనజా వెంకటయ్య ముఖ్య అతిధిగా హాజరై ఆటల పోటీలను ప్రారంభించారు.ఆటల పోటీల వల్ల ఆరోగ్యం, పోటితత్వం అలవడుతుందని, మహిళలందరు కలిసి మెలసి స్నేహభావంతో పని చేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని వనజా వెంకటయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సూపర్వైజర్ నరేందర్ రెడ్డి, సేవా కోఆర్డినేటర్ బి.దేవరెడ్డి, ఎన్సీవోఏ క్లబ్ సెక్రెటరీ కల్పనా, సభ్యులు సృజన, లత పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-మంథని మహిళలు అన్ని రంగాల్లో రాణించి మగవారితో సమానంగా అవకాశాలను అందిపుచ్చుకో వాలని మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ కె.కృష్ణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఐక్యూఏసి కళాశాల మహిళ సాధికారత విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పలువురు వ్యక్తులు మాట్లాడారు. మహిళలు తలుచుకుంటే అనేక సాహసాలు విజయాలు సాధించవచ్చన్నారు. బ్రిటిష్ వారిని ఎదిరించి పోరాడిన ఝాన్సీ లక్ష్మీబాయి కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించిన రాణి రుద్రమదేవి ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సతీష్,మహిళ సాధికారత విభాగం కన్వీనర్ మానస,పర్జన, సహజ,స్వేత బిందు,అమర్నాథ్ ముకుందం రజిత,అశోక్, ఉపాధ్యాయురాలు శ్రీలత, పంచాయతీ సెక్రెటరీచంద్రశేఖర్, పాల్గొన్నారు.

పట్టణ ప్రజలకు తాగునీరు అందించాలి :సీపీఐ(ఎం)



నవతెలంగాణ-మంథని పట్టణ ప్రజలకు గత మూడు రోజులుగా తాగునీరు రాకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తాగు నీటిని అందించాలని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ సంబంధిత అధికారులను కోరారు. శుక్రవారం మంథని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ పరిధిలోని శ్రీపాదకాలనీ,గంగాపురి, శ్రీరామ్ నగర్‌లో మిషన్ భగీరథ అధికారులు వాల్స్ కు మట్టి పోయడం వల్ల నీరు సరఫరా కాక ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చిందన్నారు. నిర్లక్ష్యం వహించిన మిషన్ భగీరథ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు బాపు.రవిలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-గోదావరిఖని: ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) ఎన్టీపీసీ రామగుండం ఏరియా కార్యదర్శి ఎం.రామాచారి డిమాండ్ చేశారు. నిత్యం రద్దీగా ఉండే ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేయడం లేదని, సిగ్నల్ లైట్స్ పనిచేయకపోవడంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రజలు రోడ్డు దాటే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఉదయం డ్యూటీలకు వెళ్ళే వారు, పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, వ్యాపార వర్గాలు వారు రోడ్డు దాటుతుంటారని తెలిపారు. ప్రదానంగా ఎన్టీపీసీ గేట్ నెంబర్ 2 మేడిపల్లి సెంటర్, టిటిఎస్ గేట్, ఎఫ్‌సిఐ ఎక్స్ రోడ్డు వద్ద ప్రమాదాలు జరుగుతుంటాయని, సిగ్నల్స్ పని చేయని కారణంగా ట్రాఫిక్ కంట్రోల్ ఉండటం లేదని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ సిగ్నల్స్‌కు పని చేసేలా మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, అలాగే ఎన్టీపీసీ గేట్ 2 వద్ద బారీ కేడ్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నాసా స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో పాల్గొన్న శ్రీ చైతన్య విద్యార్థులు



నవతెలంగాణ-గోదావరిఖని: ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థులు నాసా ఎన్ఎస్ఎస్ గెరార్డ్ కె ఓనీల్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్నారు. ఈ పోగ్రాంలో రెండు టీంలుగా పాల్గొన్న విద్యార్థులు టీమ్ ఫేనీస్‌లో 5 మంది విద్యార్థులు, టీమ్ నెబ్యులాలో 8 మంది విద్యార్థులు విజయం సాధించారు. విజయాన్ని సాధించిన విద్యార్థులను,వారికి ప్రోత్సాహాన్ని అందించిన నాసా ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఎస్.వెంకట రమణ, ప్రోగ్రాం ఇన్‌చార్జి రమేష్ కోడూరిని ఏజీఎం తిరుపాలు, అకాడమిక్ కో-ఆర్డినేటర్ జయ కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ ఉదయ్ కుమార్ అభినందించారు.

అత్యాచారానికి పాల్పడ్డ నిందితుడిని శిక్షించాలి

ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో ప్లకార్డులతో నిరసన



నవతెలంగాణ-గోదావరిఖని: జగిత్యాల జిల్లా ఒడ్డే లింగాపూర్ గ్రామంలో విధులు నిర్వహించుకొని ఇంటికి వెళ్తున్న దళిత మహిళా ఆశా వర్కర్‌పై అత్యాచారం చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.బిక్షపతి, ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో సీఐటీయూ ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ప్లకార్డులతో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత 18 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తున్న దళిత మహిళా, ఆశా వర్కర్ జగిత్యాల జిల్లా వడ్డే లింగాపూర్ వద్ద తన విధులు నిర్వర్తించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆమెను బలవంతంగా ఎత్తుకు వెళ్లి అత్యాచారం చేసిన నిందితున్ని పోలీసులు వెంటనే అరెస్టు చేసి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠినంగా శిక్షించాలని, బాధిత నిరుపేద దళిత మహిళ కుటుంబానికి 50 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.బిక్షపతి, సీఐటీయూ ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి, కాదాసి మల్లేష్, సునీత, లక్ష్మణ్, లక్ష్మయ్య, రాణి, దేవమ్మ, సమ్మి తదితరులు పాల్గొన్నారు.

రామగుండం పోలీస్ కమిషనర్‌గా అంబర్ కిషోర్ ఝా



నవతెలంగాణ-గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనర్‌గా అంబర్ కిశోర్ ఝాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది.ఇందులో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.శ్రీనివాస్‌ను సీఐడీకి బదిలీ చేయగా, ఆయన స్థానంలో వరంగల్ పోలీస్ కమిషనర్‌గా పనిచేస్తున్న అంబర్ కిషోర్ ఝాను ఇక్కడకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా పెద్దపల్లి డిసిపిగా పనిచేస్తున్న చేతనను తెలంగాణ ఉమెన్స్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేయగా, ఆమె స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న నాన్ క్యాడర్ ఎస్పీ పి.కరుణాకర్‌ను బదిలీ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
శనివారం | మార్చి 08, 2025 | www.navatelangana.com

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల ధర్నా

నవతెలంగాణ - జమ్మికుంట : గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జీపీ కార్మికులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో భీమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీపీ కార్మికుల మండల అధ్యక్షుడు రవీందర్‌రావు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ కార్మికులకు గత నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో కుటుంబ పోషణ భారమై అప్పుల పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, 60జీవో ప్రకారం రూ. 16వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క డిసెంబరులో హామీ ఇచ్చినప్పటికీ, మూడు నెలలు గడిచినా వేతనాలు అందలేదని దుయ్యబట్టారు. ఒక్కో గ్రామ పంచాయతీలో రెండు, మూడు నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, కార్మికులకు కనీస భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కార్మికుడికి రూ.15 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం రూ.24 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ తర్వాత రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో జీపీ కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాల కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికుల మండల ప్రధాన కార్యదర్శి లద్దు నూరి కుమార్, కార్యదర్శి మేక మల్ల రాము, సంపత్, వాసాల సారయ్య, సంజీవ్, రవి, రాజ కొమురయ్య రాజు, తిరుపతి, మైపాల్ రెడ్డి, ఉమా, వనిత, అలీమా, స్వప్న, రాజమణి పాల్గొన్నారు.

పనుల్లో తేడాలు.. డబ్బు వెచ్చింపులో వ్యత్యాసం

- ఈజీఎస్ సామాజిక తనిఖీలో బయటపడిన నిజాలు

నవతెలంగాణ - గంగాధర

ఈజీఎస్ పథకం కింద గ్రామాల్లో చేపట్టిన పనుల్లో అనేక రకాల తేడాలు దొర్లగా, డబ్బు వెచ్చింపులో వచ్చిన వ్యత్యాసంపై ఈజీఎస్ సామాజిక తనిఖీ బృందం ఆరా తీసింది. రోడ్ల వెంట నాటిన మొక్కలు కొత్తగా వేస్తున్న రహదార నిర్మాణం పనుల్లో కోల్పోగా, పలు గ్రామాల్లో కమ్యూనిటీ ప్లాంటేషన్‌తోపాటు పలు రకాల చెట్లను తొలగించారు. ఈ అంశాలపై డీఆర్డీవో ఉప్పుల శ్రీధర్, ఏపీడీ కృష్ణ, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ శ్రీనివాస్, సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్ పర్సన్ సాయిలు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. తప్పిదం జరిగింది ఎక్కడ.. పనుల్లో దొర్లిన పొరపాట్లను, డబ్బు వెచ్చింపులో వచ్చిన వ్యత్యాసాలపై ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో సుమారు రూ.1లక్షా 11వేల 202 చేపట్టిన ఈజీఎస్ పనుల్లో వ్యత్యాసం వచ్చినట్టు సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. గ్రామాల్లో జరిగిన పనుల అవకతవకలపై ఆరా తీసిన సామాజిక తనిఖీ బృందం ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెం ట్లను తప్పుపడుతూ డబ్బు రికవరీలకు ఆదేశించారు. ఈజీఎస్ పనులు పారదర్శకంగా జరగాలని, ఉన్న ఊళ్లో ఉపాధి కూలీలకు పనులు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తుందన్నారు. ఈ పథకాన్ని నీరుగార్చే విధంగా ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్స్ ఎవరు వ్యవరించిన చర్యలు తప్పవని సామాజిక తనిఖీ బృందం హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దమ్మని రాము, ఇంచార్జీ ఏపీవో సత్య ప్రకాష్, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ కారదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్డీవో ఉప్పుల శ్రీధర్

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ - చొప్పదండి : మండలంలోని చిత్యాలపల్లి, భూపాలపట్నం గ్రామాలకు చెందిన కొండపర్తి అరుణ్ కుమార్, నాంపల్లి అలేఖ్యలు కరీంనగర్‌లో ఆత్మహత్య చేసుకోగా, కాంగ్రెస్ నాయకులతో కలిసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చొప్పదండిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాగంపేట వాసి ఓడ్నాల రమేష్ కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

టిప్పర్లపై క్రషర్ యజమాని జులుం

తమ పరిధిలోకి కంకరను తీసురావద్దని టిప్పర్ లారీ పంచర్ చేసిన వైనం



నవతెలంగాణ - తిమ్మాపూర్ : తమ పరిధిలోకి కంకరలోడు టిప్పర్ లారీలు తీసుకురావద్దంటూ ఓ క్రషర్ యజమాని టిప్పర్ లారీపై తన అనుచరులతో ఆపించి, వారిని బెదిరించి టైర్లను పంచర్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే బావుపేట నుండి తిమ్మాపూర్ మండలంలో ఓ నిర్మాణానికి కంకర లోడును టిప్పర్ లారీలో తీసుకువస్తున్న తరుణంలో మానకొండూర్ మండలంలో గల ఓ క్రషర్ యజమాని తన అనుచరులతో కలిసి అలుగునూర్ కాకతీయ కెనాల్ సమీపంలో మోహరించి అటుగా వెళ్తున్న టిప్పర్ లారీలను ఆపారు. తమ పరిధిలోకి రావద్దని చెప్పినా వినకుండా పదే పదే కంకర సప్లై చేస్తున్నారని మండిపడి ఆ టిప్పర్ లారీల టైర్లను పంచర్ చేశారు. ఆ టిప్పర్ లారీ డ్రైవర్లు డయల్ 100కు సమాచారం అందించగా స్థానిక ఎల్ఎండీ కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా, ఓవర్ లోడుతో కంకర సప్లై చేస్తున్నారని, తాము ప్రభుత్వ అనుమతులకు లోబడి క్రషర్‌ను నడిపిస్తూ టాక్సీలు కడుతున్నామని, బావుపేటలో ఉన్న గ్రానైట్ నుంచి వచ్చే బండను ఎటువంటి అనుమతులు, ఖర్చు లేకుండా తయారు చేసి చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు తక్కువ ధరకు సప్లై చేస్తున్నారని, వీరికి ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదనీ ప్రభుత్వానికి అన్ని విధాలా పన్నులు కడుతూ నడిపిస్తున్న తాము ఏమీ చేయాలో అర్థం కాక లారీలను ఆపినట్లు తెలిపారు. మైనింగ్, ఆర్టీఏ అధికారులకు ఎన్నిసార్లు వివరించినా పట్టించుకోక పోవడంతో ఇలా చేసినట్లు తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న సదరు క్రషర్ యజమానితోటు అక్రమంగా రావాణా చేస్తున్న వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

యాక్సిస్ మాక్స్ ఆధ్వర్యంలో.. మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలు



నవతెలంగాణ - కరీంనగర్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని యాక్సిస్ మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కరీంనగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ 13వ డివిజన్ మాజీ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ హాజరై మాట్లాడారు. పురుషులతో సమానంగా బాధ్యతలు నిర్వహిస్తూ వృత్తిలో రాణిస్తున్న మహిళా ఉద్యోగులను ప్రశంసించారు. బ్రాంచ్ మేనేజర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని, వారి కోసం యాక్సిస్ మాక్స్ నుంచి ప్రత్యేక టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ పాలసీలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు చొప్పరి జయశ్రీని సన్మానించేరు. కార్యక్రమంలో సిబ్బంది, ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ బీభత్సం

నవతెలంగాణ - హుజురాబాద్ :

హుజురాబాద్ పట్టణంలోని జమ్మికుంట రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. అతివేగంగా దూసుకొచ్చిన ట్రాక్టర్ రోడ్డు పక్కన ఆగి ఉన్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. అనంతరం పక్కనే ఉన్న పాఠశాల గోడను ఢీకొట్టడంతో గోడ పిల్లర్ విరిగిపోయింది. మోటార్ సైకిల్‌పై ఉన్న యాకూబ్, ముజాహిద్ అనే ఇద్దరు వ్యక్తులు ఎగిరి కిందపడ్డారు. యాకూబ్‌కు తీవ్ర గాయాలు కాగా, ముజాహిద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. యాకూబ్‌కు 108 వాహనంలో ప్రాథమిక చికిత్స అనంతరం జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్రచికిత్స నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తె మెట్టెలు అందజేత

నవతెలంగాణ - గన్నేరువరం : గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన పాల ఉత్పత్తిదారుడు సంపంగి కొమురయ్య పోచవ్వ కుమార్తె వివాహం శుక్రవారం జరిగింది. గ్రామ పాల ఉత్పత్తిదారుల చైర్మన్ జాగిరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పుస్తె మెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాడి రైతులకు సంక్షేమ పథకాలు అందించడంలో కరీంనగర్ డైరీ నంబర్ వన్‌గా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ధనుర్జాన్, న్యాలపట్ల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో శ్రీ ప్రగతి విద్యార్థుల సత్తా

2 స్వర్ణాలు, 5 రజతాలు, 7 కాంస్య పతకాలు కైవసం



నవతెలంగాణ - రామడుగు : జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 2న నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా తైక్వాండో పోటీల్లో శ్రీ ప్రగతి పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. గోపాలరావుపేటకు చెందిన ఈ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 2 స్వర్ణాలు, 5రజతాలు, 7కాంస్య పతకాలు సాధించారని పాఠశాల యాజమాన్యం శుక్రవారం తెలిపింది. విద్యార్థుల ప్రతిభను కొనియాడుతూ పాఠశాల యాజమాన్యం వారికి బహుమతులు అందజేసి అభినందించింది.

మహిళా ఉపాధ్యాయులకు ఘన సన్మానం



నవతెలంగాణ - చొప్పదండి : మండల కేంద్రంలోని వీణాధరి ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మహిళా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలను గుర్తించడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ - వీణవంక : వీణవంక మండలం ఎల్బాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు నల్లగొని వీరయ్య గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను అతిథి బిల్డర్స్ అధినేత కొమ్మిడి రాకేష్ రెడ్డి పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ సతీష్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, ఎలకపల్లి లక్ష్మణ్, సమ్మిరెడ్డి, సతీష్, మద్దుల ప్రశాంత్, పరిపూర్ణ చారి, శ్యామ్, మాడ కొండల్ రెడ్డి, గడ్డం కుమార్, డానియల్, కార్తీక్, శ్రీకాంత్, గణేష్ రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

జనరిక్ మందులను సద్వినియోగం చేసుకోవాలి

- డాక్టర్ సన్నిల్లా రాజేష్
- వావిలాల పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం



నవతెలంగాణ - జమ్మికుంట: ప్రజలకు నాణ్యమైన, సరసమైన ధరలకు జనరిక్ మందులు అందుబాటులో ఉంచడం కోసం ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సన్నిల్లా రాజేష్ తెలిపారు. శుక్రవారం ఆరోగ్య కేంద్ర పరిధిలోని అన్ని ఆరోగ్య ఉపకేంద్రాల వైద్య సిబ్బందితో కలిసి జనరిక్ ఔషధాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన(పీఎంబీజేపీ) ద్వారా ప్రజలకు మెరుగైన నాణ్యత కలిగిన ఔషధాలను తక్కువ ధరకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. జనరిక్ ఔషధాల వినియోగంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు నాణ్యతలో రాజీ పడకుండా, అధిక ధరలు మెరుగైన మందులను సూచిస్తాయనే తప్పుడు భావనను రూపుమాపడం అవసరమని పేర్కొన్నారు. ప్రజలు డాక్టర్ల సూచన మేరకు జనరిక్ ఔషధాలను వినియోగించి ఆరోగ్య సంరక్షణ ఖర్చులను తగ్గించుకోవచ్చు అని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మహెూన్నత పటేల్, సంధ్యారాణి, హిమబిందు, ఫరహానుద్దీన్, కార్తీక్, సంధ్య, విజయ్ కుమార్, అలాగే సూపర్వైజర్లు అరుణ, రత్నకుమారి, సదానందం, దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

మొలంగూర్‌లో వరుస చోరీలు

- ఆలయాల్లో హుండీలు ధ్వంసం
- ప్రజల్లో భయాందోళనలు,

రాత్రిపూట గస్తీ పెంచాలని విజ్ఞప్తి

నవతెలంగాణ - శంకరపట్నం



శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలోని రేణుక ఎల్లమ్మ పోచమ్మ దేవాలయాలలో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. దేవాలయాల తాళాలు పగలగొట్టి, హుండీల తాళాలు ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎల్లమ్మ దేవాలయంలో చోరీ జరగడం ఇది మూడోసారి అని గౌడ సంఘం నాయకులు తెలిపారు. ఇటీవల కాలంలో గ్రామంలోని కెనాల్ కాల్వకు అమర్చుకున్న విద్యుత్ మోటార్లు వరుసగా చోరీకి గురవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుస దొంగతనాలు తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని, రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ పెంచి దొంగతనాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.ఈ విషయంపై ఎస్ఐ కొత్తపల్లి రవిని వివరణ కోరగా అవేమీ తమ దృష్టికి రాలేదని, ఎవరైనా ముందుకువచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మహిళలు అన్ని రంగాల్లో పురోగతి చెందాలి

డాక్టర్ ముషం ప్రణీత, సంజీవని ఆసుపత్రి డైరెక్టర్



నవతెలంగాణ - జమ్మికుంట : మహిళలు అన్ని రంగాల్లో ఇంకా పురోగతి చెందాలని సంజీవని ఆసుపత్రి డైరెక్టర్, ఐఎంఏ హుజురాబాద్ జమ్మికుంట నాయకురాలు డాక్టర్ ముషం ప్రణీత అన్నారు. మహిళలకు గౌరవం, గుర్తింపు, ఆర్థిక, రాజకీయ, సామాజిక హక్కులపై అవగాహన పెంచే విధంగా అన్ని రంగాల్లో వారికి అవగాహన అవసరమని చెప్పారు. యువతులు గర్భవతి కావడానికి ముందే పౌష్టికాహారం తీసుకోవాలని, రక్తహీనత సమస్య ఉందో లేదో తెలుసుకోవడానికి హీమోగ్లోబిన్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. గర్భిణులు కనీసం నాలుగు సార్లు పరీక్షలు చేయించుకోవాలని, ప్రత్యేక యోగాసనాలు వేయడం ద్వారా సాధారణ ప్రసవం జరిగే అవకాశం ఉందని తెలిపారు. నెలసరి సమస్యలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయవద్దని, సంతాన లేమికి వైద్యం అందించేందుకు అనేక మార్గాలు ఉన్నాయని చెప్పారు.

మహిళా సాధికారతపై సదస్సు



నవతెలంగాణ - హుజురాబాద్ టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, మహిళా సాధికారత విభాగం, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో విద్యార్థులకు మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఎ. శోభారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరాదేవి , కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మల్లారెడ్డి, అకడమిక్ సమన్వయకర్త లింగారెడ్డి, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ రేణుక, అధ్యాపకులు డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ సుమలత, డాక్టర్ స్వప్న, రమ పల్లవి, మంగమ్మ, డాక్టర్ నరేందర్, డాక్టర్ మహిపాల్ రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ - మానకొండూర్ : మండలంలోని అన్నారం (గొల్లపల్లి)లో కొండపల్కల సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులు రూ. 15 లక్షలతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బందెల మహేందర్, రామగిరి సంతోష్, స్వామి, లక్ష్మయ్య, రాజయ్య, రామస్వామి, రాసకొండ శ్రీను, అట్ల కొండయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ప్రభుత్వ పథకాలపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ - శంకరపట్నం : మండలంలోని కేశవపట్నం 1 అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ అరుణ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ బత్తుల భాస్కర్, డాక్టర్ శ్రవణ్ కుమార్, హెల్త్ సూపర్వైజర్ అనిల్, గ్రామ కార్యదర్శి నరసయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి అండగా స్నేహితులు



నవతెలంగాణ - చిగురుమామిడి: చిన్ననాటి స్నేహితుడు ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి కిందపడి అకాల మృతి చెందడంతో, అతని స్నేహితులు చలించిపోయారు. అతని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించి, బృందంగా ఏర్పడి ఆర్థిక సహాయం చేశారు. కోహెడ మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో 2000-2001 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన చెంచెల సంపత్, చిగురుమామిడి మండలం రేగొండ గ్రామానికి చెందినవారు. ఆయన మృతి చెందడంతో, అతని స్నేహితులు అతని ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్నారు. అతని ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తు కోసం రూ. 1 లక్ష సేకరించి, ఆ మొత్తాన్ని పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. శుక్రవారం రోజున వారు ఆ బాండ్‌ను సంపత్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు ఎడ్ల రమేష్, కనకం రమేష్, ఆరె కిశోర్, వేల్పుల మహేష్ బాబు, బందెల అజయ్ కుమార్, వేముల శ్రీనివాస్, మేకల సంపత్, మేకల అనిల్ పాల్గొన్నారు.

స్టడీ టూర్‌కు మార్కెట్ కమిటీ పాలకవర్గం

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో పర్యటన



నవతెలంగాణ-మానకొండూర్ : మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం శుక్రవారం స్టడీ టూర్‌కు బయలుదేరింది. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, డైరెక్టర్లతో సహా ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లోని వ్యవసాయ మార్కెట్ కమిటీల పనితీరు, కార్యకలాపాలను అధ్యయనం చేయడానికి ఈ పర్యటనకు వెళ్లారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అండగా నిలుస్తుందని చైర్మన్ ఓదెలు యాదవ్ తెలిపారు. ఈ స్టడీ టూర్‌లో డైరెక్టర్లు యెల్బు గొండ రాజు, బందెల మహేందర్, టేకుమల్ల అంజయ్య, మందల మహిపాల్ రెడ్డి, చలిగంటి ఓదెలు, రావుల రవి, మాతంగి సహదేవ్ పాల్గొన్నారు.

శ్రీ చైతన్య అధ్యాపకుడికి డాక్టరేట్

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని ఎల్ఎండి కాలనీలో గల శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ కళాశాలలో కంప్యూటర్స్ విభాగంలో సీనియర్ అజ్ఞాతకుడిగా విధులు నిర్వహిస్తున్న శనిగారపు నవీన్ కుమార్ గైడ్ డాక్టర్ ఎస్ఎస్ రియాజ్ అహ్మద్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ద్రావిడ విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టాను ప్రధానం చేసిందని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి తెలిపారు. ఆబ్జెక్ట్ ఓరియెంటెడ్ మెషర్ మెంట్స్ ఇన్ సాఫ్ట్వేర్ డెవలప్మెంట్ అనే అంశంపై చేసిన పరిశోధన గాను ఈ డాక్టరేట్ పట్టాను పొందినట్లు తెలిపారు ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి, డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ రాజు, ఇతర విభాగాధిపతులు, పాలనాధికారి రామారావు, మీడియా ఇంచార్జ్ గొంటి రమేష్ అభినందనలు తెలిపారు.

పోతిరెడ్డిపల్లిలో కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ - వీణవంక: వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి (కల్లు పల్లి) గ్రామ కాంగ్రెస్ కమిటీ ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాపర్తి రవి, ప్రధాన కార్యదర్శిగా మునిగాల రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయపతాకం ఎగరవేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎండీ సాహెబ్ హుస్సేన్, నాయకులు గంగాడి తిరుపతిరెడ్డి, ఈదునూరి పైడి కుమార్, గెల్లు శ్రీనివాస్, మాజీ సర్పంచులు పంజాల సతీష్, పానుగంటి మధుకర్, తాళ్లపల్లి సమ్మయ్య కాంగ్రెస్ కార్యకర్తలు చేపూరి రాజు, పానుగంటి రాజు, గౌరిశెట్టి రమేష్, కుమార్ పాల్గొన్నారు.

నటి సీతా మహాలక్ష్మికి ఘన సన్మానం

నవతెలంగాణ - మానకొండూర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ అధ్యక్షురాలు, ప్రముఖ నటి సీతా మహాలక్ష్మిని మండలంలోని అన్నారం గ్రామంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. నటుడు కేశిరెడ్డి కనకా రెడ్డి, సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యుడు రంగు భాస్కరాచారి సీతా మహాలక్ష్మితో పాటు వినీత, లక్ష్మి, మౌనిక, జలజలను శాలువాలతో సన్మానించారు. కళారంగంలో వారు గొప్పగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మణాచారి, షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్ వాయుకుమార్, స్వామి గౌడ్, శివ పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతికి పాటుపడాలి : ఎంఈవో హేమలత



నవతెలంగాణ - జమ్మికుంట : మహిళల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని జమ్మికుంట మండల విద్యాధికారి మంతెన హేమలత అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంఈఓ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, మండలంలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ హేమలత మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతికి తోడ్పడేలా, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆబాది జమ్మికుంట జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు జంపాల పద్మ, మహిళా ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు 25శాతం రాయితీ

నవతెలంగాణ - కరీంనగర్: అనధికారిక లేఅవుట్లను క్రమబద్ధీకరించే ఉద్దేశంతో 2020లో స్వీకరించిన లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుదారులకు ప్రభుత్వం 25శాతం రాయితీ ప్రకటించినట్లు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో, జీవో నెం.28 ప్రకారం ఈ నెల 31లోగా పూర్తి ఫీజు చెల్లించిన వారికి మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు అవగాహన కల్పించేందుకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తుదారులు తమ సందేహాలను హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, ప్రభుత్వ ఇచ్చిన రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

పోషకాహారం ద్వారే ఆరోగ్యం



నవతెలంగాణ - గంగాధర : పోషక విలువలు కలిగిన ఆహార తీసుకోవడం ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సీడీపీవో నర్సింగరాణి అన్నారు. గంగాధర మండలం గోపాలరావుపల్లి అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన శుక్రవారం సభలో సీడీపీవో నర్సింగరాణి మాట్లాడారు. గర్భవతులు, బాలింతలు, తల్లులు, పిల్లలు మంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. తమ పిల్లలకు తల్లులు అవసరమైన అన్ని రకాల నాణ్యమైన ఆహార పదార్థాలు ఇంట్లోనే తయారు చేసి అందించాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే సేవలు, పౌష్టికాహారం వినియోగించుకోవాలని,పిల్లలకు బాలామతం తప్పకుండా తినిపించాలని అన్నారు. ఆరోగ్య మహిళా ప్రోగ్రాం, న్యూట్రి గార్డెన్ వంటి పలు అంశాలను వివరించారు. గర్భిణీ స్త్రీలు తప్పకుండా అయోడైజ్డ్ ఉప్పునే వాడాలని, మార్కెట్‌లో లభించే అన్ని రకాల ఆకుకూరలు, మునగాకు, కరివేపాకు, గోంగూర, చుక్క కూర వంటి ఆకుకూరలన్నీ తప్పకుండా భుజించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ రేణుక, అంగన్వాడీ టీచర్ అరుణ, వైద్య సిబ్బంది, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

చల్లూరులో ఎలక్ట్రిక్ బైక్ షోరూం ప్రారంభం



నవతెలంగాణ - వీణవంక : వీణవంక మండలంలోని చల్లూరులో ఎలక్ట్రిక్ బైక్ షోరూంను శుక్రవారం జమ్మికుంట మార్కెట్ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని, రానున్న కాలంలో పెట్రోల్ తో నడిచే బైక్‌లను కొనలేని పరిస్థితి వస్తుందన్నారు. పర్యావరణ కాలుష్యం కాకుండా ఉండడానికి బ్యాటరీ బైక్‌లు ఎంతో ఉపకరిస్తాయని తెలిపారు. అనంతరం బ్యాటరీతో నడిచే బైక్‌లను పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మిడి రాకేష్ రెడ్డి, షోరూం నిర్వాహకులు ఎండీ నసీరుద్దీన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నల్లగొని సతీష్ గౌడ్, ఎండీ రషీద్ పాషా, సీనియర్ నాయకులు చింతల శ్యాంసుందర్ రెడ్డి, నల్ల కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ - జమ్మికుంట : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జమ్మికుంట ప్రముఖ వైద్యురాలు డాక్టర్ ఉడుగుల అనిత అన్నారు. 40 ఏళ్లు దాటిన మహిళలు తప్పనిసరిగా బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేయించుకోవాలని, 60 ఏళ్లు దాటిన వారు ఎముకల సాంద్రత పరీక్ష (బీఎండీ) చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య సూత్రాలు పాటిస్తే వృద్ధాప్యం సౌఖ్యంగా ఉంటుందని తెలిపారు. రొమ్ము గడ్డలు, గర్భసంచిలో గడ్డలు, అండాశయంలో గడ్డలు, పిత్తాశయంలో రాళ్లు, కిడ్నీ రాళ్లు, ఫిషర్, ఫిస్టులా, పైల్స్, కడుపు నొప్పి, మంట వంటి మహిళల ఆరోగ్యానికి అవసరమైన అన్ని రకాల వైద్య సేవలను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.



బడ్జెట్‌లో యువజనరంగానికి అధిక నిధులు కేటాయించాలి

- యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలి : డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే 2025-26 వార్షిక బడ్జెట్‌లో యువజన రంగానికి అధిక నిధులను కేటాయించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని కోరింది. శుక్రవారం హైదరాబాద్‌లో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ హామీనిచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నిరుద్యోగ భృతి గురించి ఊసెత్తడం లేదని విమర్శించారు. రాబోయే వార్షిక బడ్జెట్‌లో నిరుద్యోగ భృతిని అమలు చేసేందుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు. యూత్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. యువతకు స్వయం ఉపాధి రుణాలిచ్చి ప్రోత్సహించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియమాక నోటిఫికేషన్లు, పరీక్షల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా ఫిబ్రవరిలో జాబ్ క్యాలండర్‌ను ప్రకటించినా ఇప్పటి వరకు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. లక్షలాదిమంది నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉద్యోగ నియామకాలను చేపట్టాలని తెలిపారు. ఉద్యోగాలు ఇచ్చేంతవరకు నిరుద్యోగ భృతి రూ.నాలుగు వేలు ఇవ్వాలని సూచించారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన తప్పులను చేయకుండా నిరుద్యోగ యువతకు నమ్మకం కలిగించేలా పారదర్శకంగా ఉద్యోగాల నియమకాలను చేపట్టాలని కోరారు. యూత్ డిక్లరేషన్ హామీలన్నింటిని ప్రభుత్వం అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి తిరుపతి, గడ్డం వెంకటేష్, జావెద్, శివవర్మ, క్రిష్ణనాయక్, జి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పునర్విభజన ప్రక్రియపై సమైక్య పోరు

(మొదటిపేజీ తరువాయి)

బలహీనపడుతుందని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం పలువురు ముఖ్యమంత్రులకు, మాజీ ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న ఈ పునర్విభజన ప్రణాళికలు సమాఖ్యవాదంపై దాడి అని ఆయన అభివర్ణించారు. భారతదేశ ప్రజాస్వామ్య స్ఫూర్తి అంతా దాని సమాఖ్య స్వభావంపైనే ఆధారపడి వుంది. ఈ వ్యవస్థలో ఒక దేశంగా వుండాల్సిన మన పవిత్ర ఐక్యతా భావనను గౌరవిస్తూనే ప్రతి ఒక్క రాష్ట్రానికి తన వాణిని వినిపించే హక్కు వుందని స్టాలిన్ తన లేఖలో పేర్కొన్నారు. కానీ ఈనాడు ఈ సమతుల్యతకు తీవ్రమైన ముప్పు ఏర్పడుతోందని, మన దేశ భవిష్యత్తును రూపుదిద్దడంలో తమిళనాడు వంటి రాష్ట్రాల ప్రాబల్యం శాశ్వతంగా తగ్గిపోవడానికి ఇది దారి తీస్తోందని ఆయన పేర్కొన్నారు. రాజకీయ విభేదాలను పక్కనబెట్టి అన్ని పార్టీలు కూడా తమిళనాడు రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోయే పరిస్థితులపై అఖిల పక్షంలో ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్రానికి తీర్మానం పంపిన నేపథ్యంలో స్టాలిన్ లేఖ వెలువడింది. తమిళనాడుకు సీట్ల సంఖ్య తగ్గిపోతుంటే, ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలకు వారిజనాభా దామాషాను బట్టి ప్రాతినిధ్యం పెరుగుతందని స్టాలిన్ పేర్కొన్నారు. పునర్విభజన జరుగుతుందా లేదా అనేది ఇప్పుడు ప్రశ్న కాదని, కానీ మన జాతీయ ప్రాధాన్యతలను ముందుకు తీసుకెళ్ళిన రాష్ట్రాలు అందించిన సేవలను ఎప్పు గుర్తిస్తారనేది ఇక్కడ ప్రశ్న అని స్టాలిన్ పేర్కొన్నారు. పునర్విభజనకు తాము వ్యతిరేకం కాదని, కానీ జాతీయ కర్తవ్యాలను విజయవంతంగా నిర్వర్తించిన రాష్ట్రాలపై ఒక ఆయుధంగా ఉపయోగించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. సమస్య తీవ్రంగా వున్నప్పటికీ దాన్ని పట్టించుకోకుండా కేంద్రం స్పష్టతను ఇవ్వడంలో విఫలమవుతోందని విమర్శించారు. ప్రొ రేటా ప్రాతిపదికను అనుసరిస్తామని చాలా అస్పష్టంగా చెబుతున్నారని ఆ ప్రొ రేటాను లెక్కించడానికి ఉపయోగించే ప్రాతిపదిక ఏమిటనేది వివరించడం లేదని విమర్శించారు. మన ప్రజాస్వామ్యమే ముప్పులో పడుతున్నపుడు ఇటువంటిఅస్పష్టమైన హామీలను మనం ఆమోదించగలమా అని ఆయన ఆ లేఖలో ప్రశ్నించారు. కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, పశ్చిమ బెంగాల్, ఒడిశా, పంజాబ్ సీఎంలకు ఆయన లేఖ రాశారు. ప్రతిఘటనా పోరాటాన్ని సమన్వయం చేసేందుకు సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ)ని ఏర్పాటు చేయడంలో చేతులు కలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సవాలు యొక్క రాజ్యాంగ, చట్టబద్ధమైన, రాజకీయ పార్శ్వాలను మనందరం కలిసికట్టుగా పరిశీలించాల్సి వుందన్నారు. అప్పుడు మాత్రమే మన ప్రస్తుత ప్రాతినిధ్య స్థాయిపై రాజీపడకుండా జాతి నిర్మాణంలో మన పాత్రను గౌరవించేలా పునర్విభజన ప్రక్రియను సాధించుకోగలమని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఈ సారైనా న్యాయం జరిగేనా?

బడ్జెట్‌లో వాటా కోసం రజక వృత్తిదారుల ఎదురు చూపులు

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రిక్తహస్తం

కేటాయింపులు రూ.451 కోట్లు, ఖర్చు రూ.31 కోట్లు

రాబోయే బడ్జెట్‌పై గంపెడాశలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రజక వృత్తిదారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వమైనా బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయిస్తుందా? లేదంటే గత బీఆర్ఎస్ సర్కార్ మాదిరిగానే మాటలు ఘనంగా చెప్పి, అరకొర నిధులు కేటాయించి, వాటిని కూడా ఖర్చు చేయకుండా దారిమళ్లిస్తుందా? అనేది ఇప్పుడు చర్చనీయాంశమవుతున్నది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రేవంత్ సర్కార్ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో ఈసారైనా తమకు న్యాయమైన వాటా దక్కుతుందా? లేదా? అనే ఆందోళన రజక వృత్తిదారుల్లో వ్యక్తమవుతోంది.

రజకుల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాటలు ఘనం..చేతలు శూన్యమన్నట్టుగా వ్యవహరించింది. వారి సంక్షేమం, అభివృద్ధికి బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసింది. పైగా కేటాయించిన అరకొరా నిధులను సైతం ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయకుండా వివక్ష చూపింది. 2014 నుంచి 2024 వరకు తెలంగాణ రజక సహకార సంఘాల సమాఖ్యకు రూ.451.04 కోట్లు కేటాయించింది. ఇందులో రూ. 71.52 కోట్లునే విడుదల చేసింది. అందులో రూ. 31.21 కోట్లు మాత్రమే ఖర్చు చేయటం గమనార్హం. దోభీఘాట్ల విషయంలోనూ అదే జరిగింది. కమ్యూనిటీ సేవలు-దోభీఘాట్ల నిర్మాణానికి రూ.180.30 కోట్లు కేటాయించిన బీఆర్ఎస్ సర్కార్ రూ. 30.98 కోట్లు విడుదల చేసి, కేవలం రూ.14.85 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది.

లాండ్రీలు, దోభీఘాట్లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా పథకం కింద 2021-22 నుంచి 2023-24 వరకు రూ.210.50 కోట్లు కేటాయించి రూ.75.80 కోట్లను విడుదల చేసింది. రూ.75.86 కోట్లు ఖర్చు చేసింది.

కాంగ్రెస్ సర్కార్ సైతం...

బీఆర్ఎస్ సర్కారు రజకులకు ఆ రకంగా అన్యాయం చేస్తే... ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే బాటలో నడుస్తున్నట్టు కనబడుతోంది. 2024-25 వార్షిక బడ్జెట్‌లో వృత్తిదారుల సంక్షేమ రుణాల కోసం కేవలం రూ.30 కోట్లు మాత్రమే కేటాయించటం గమనార్హం. రాష్ట్రంలో 3,400కు పైగా రజక వృత్తిదారుల సొసైటీలున్నాయి. వీటి నిర్వహణకు కనీసం రూ.వెయ్యి కోట్లయినా అవసరమవుతాయి. ప్రభుత్వం ఆ దిశగా కేటాయింపులు చేయలేదని వృత్తిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రజక సహకార సంఘాల సమాఖ్యకు 2014-15 నుంచి 2023-24 వరకు కేటాయింపులు, విడుదలైన నిధులు, ఖర్చు వివరాలు (రూ.కోట్లలో)

సంవత్సరం	కేటాయింపు-	విడుదల	ఖర్చు
2014 -15	16.54	0	0
2015-16	16.43	0	0
2016-17	18.07	4.52	4.50
2017-18	200	15.00	1.27
2018-19	200	52	25.44
2019-20	0	0	0
2020-21	0	0	0
2021-22	0	0	
2022-23	0	0	0
2023-24	0	0.01	0
మొత్తం	451.04	71.52	31.21

జీపీలకు కనీస వేతనాలివ్వాలి

మల్టీపర్పస్ పని విధానం రద్దు చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికుల ధర్నాలు



నవతెలంగాణ- విలేకరులు

మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేశారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బాల శంకర్, ఎంపీఓ ఉమారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాలను వెంటనే విడుదల చేయాలన్నారు. గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేసి, జీవో నంబర్ 51ని సవరించాలన్నారు.

గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26000 నిర్ణయించి, 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ డ్రాఫ్ట్ కనీస వేతనాల జీవోను తక్షణమే సవరించాలని సీఐటీయూ మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. జిల్లా లేబర్ కమిషనర్ సూపరింటెండెంట్ రఘువీర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు అన్నారు. గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కల్వకుర్తి ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి సీనియర్ అసిస్టెంట్‌కి వినతిపత్రం అందజేశారు. నాగర్‌కర్నూల్ ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో కోటేశ్వర్‌కి వినతిపత్రాన్ని అందజేశారు.పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓలకు అందజేశారు. మెదక్ జిల్లాలో మాసాయిపేట మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు అర్ధాకలితో అలమటిస్తూ పూట గడవక పస్తులు ఉంటున్నామంటూ బిక్షాటన చేసి నిరసన తెలిపారు. మాకు బిక్షం వేయాలంటూ కటౌట్లను మెడలో వేసుకొని వాడవాడలా తిరుగుతూ బిక్షాటన చేశారు. మెదక్ జిల్లాలో మనోహరాబాద్, సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట, నారాయణరావుపేట, తోగుట, నంగునూర్ తదితర మండలాల్లో, సంగారెడ్డి జిల్లాలో సదాశివపేట, వట్‌పల్లి మండలాల్లో ఎంపీడీవో కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు.

ఉద్యోగుల సేవలు మరువ లేనివి

సీసీఎల్ఏ కార్యదర్శి నవీన్ మిట్టల్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంలో ఉద్యోగుల సేవలు మరువలేనివని సీసీఎల్ఏ కార్యదర్శి నవీన్ మిట్టల్ అన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి కృషి చేసినందుకు ఆయనతో పాటు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డిని శుక్రవారం ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మిట్టల్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య ఉద్యోగులు వారధిగా పని చేయాలని ఆకాంక్షించారు. మెరుగైన సేవలు అందిస్తూ నిబద్ధతతో పని చేయాలని సూచించారు. రాష్ట్రంలో 10,954 జీపీఓలు, కొత్త డివిజన్లు, మండలాలకు 361 పోస్టులు, 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల భర్తీ వల్ల రెవెన్యూ విభాగం మరింత బలోపేతమవుతుందని అభిప్రాయపడ్డారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి విశేషంగా కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి, ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర మంత్రులకు ఈ సందర్భంగా లచ్చిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, మహిళా అధ్యక్షురాలు రాధ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సీసీఎల్ఏలో మహిళా దినోత్స వేడుకలను రెవెన్యూ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఉత్తమ్‌తో కరీంనగర్ ప్రజాప్రతినిధుల భేటీ

జిల్లా అభివృద్ధిపై సమీక్ష

ప్రణాళికబద్ధంగా ముందుకెళతాం : మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించి ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఆ జిల్లాకు సంబంధించి ప్రజాప్రతినిధులు భేటీ అయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జిల్లా అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ అంశాలను మంత్రితో చర్చించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, విద్యా వైద్యం, మౌళిక సమస్యలు పరిష్కారం చేసుకుంటూ ముందుకు పోవాలని నిర్ణయం తీసుకోవడం తీసుకున్నట్టు సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్ చెప్పారు. జిల్లా మంత్రులుగా నాతోపాటు శ్రీధర్‌బాబు , శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు కలిసి త్వరలోనే ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిని కలిసి వారి దృష్టికి తీసుకుపోతామని వివరించారు. గతంలో తెలంగాణ నినాదానికి పరిమితమైన కరీంనగర్ గత పదేండ్లుగా అధికారంలో ఉన్న ప్రభుత్వం మాటలకే పరిమితమైన పరిస్థితి ఉందన్నారు. అధికారంలో ఉన్న పార్టీ సభ్యులంగా జిల్లా అభివద్ధిని ముందుకు తీసుకుపోతున్నామని వ్యాఖ్యానించారు.



కనీస మద్దతు ధరల చట్టం తీసుకురావాలి

సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్

నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక.. కార్పొరేట్ అనుకూల విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చా పోరాటం కొనసాగిస్తుందని నాయకులు నంది రామయ్య, దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతాంగం నడ్డి విరుస్తూ వ్యవసాయ రంగం మొత్తాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలు పన్నుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు చట్టాల రద్దును దొంగ దారిలో జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదా పేరుతో తీసుకురావడం చూస్తుంటే మోడీ ప్రభుత్వం ఎవరికోసం పనిచేస్తున్నదో తెలుస్తోందన్నారు. రైతాంగం పండించిన పంటలకు మద్దతు ధరలు లభించక అప్పుల పాలై అనేకమంది ఆత్మహత్య చేసుకుంటున్నారని, మద్దతు ధరల చట్టం చేయమని అడుగుతుంటే వీటి గురించి పట్టించుకోని మోడీ కార్పొరేట్ల కోసం మాత్రం వేగంగా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధరల చట్టం చేసే వరకు రైతాంగం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు జె.రాజు, కె.రాజన్న, డాకూర్ తిరుపతి, నాగెల్లి నర్సయ్య, భూక్యా విలాస్, గంగారాం, గోరేభాయ్, సుందర్, దేవ్‌రావు, మోహన్, రాజేష్, గంగాధర్ పాల్గొన్నారు.

అది క్యాబినెట్ కాదు..కుస్తీల పోటీ

పొంగులేటి కబ్జాల మంత్రి..భట్టి కమీషన్ల మంత్రి..ఉత్తమ్ ప్యాకేజీల మంత్రి

సీఎం సీటుపై ఉత్తమ్ కన్ను : బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'నిన్న జరిగింది క్యాబినెట్ కాదు. అది కుస్తీల పోటీ. ఆరు గంటల పాటు జరిగిన క్యాబినెట్‌లో మంత్రులు ఒకరికొకరు కుస్తీలు పట్టుకోవడానికే సరిపోయింది. అది కలహాల క్యాబినెట్. నారాయణపేట్, కొడంగల్ ప్రాజెక్టులపై సీఎం ప్రతిపాదనలు పెడితే మంత్రులందరూ వ్యతిరేకించారని సమాచారం. క్యాబినెట్‌లో పంపకాల పంచాయతీలపైనే జరిగింది. పొంగులేటికి సంబంధించిన రాఘవ కంపెనీ విషయంలో మంత్రుల మధ్య కుస్తీలాట జరిగింది. మంత్రుల స్వార్థం కోసం, మంత్రుల పంపకాల కోసం క్యాబినెట్ పెట్టినట్టు ఉంది. మంత్రులు సమావేశంలోనే రచ్చరచ్చ చేయడం ఎప్పుడూ చూడలేదు.' అని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కమీషన్ల మంత్రిగా భట్టి విక్రమార్క మారారనీ, ప్రతిబిల్లులోనూ కాంట్రాక్టర్లు పర్సంటేజీ ఇస్తేనే నిధులు రిలీజ్ చేస్తున్నారని ఆరోపించారు. కమీషన్ ఇస్తే నేల రోజుల్లోనే బిల్లు విడుదలవుతున్నదనీ, ఇవ్వకపోతే ఏడాదైనా గడపదాటడం లేదని విమర్శించారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంత్రి అనాలా? కాంట్రాక్టర్ అనాలా? అనేది అర్థం కావడం లేదన్నారు. పొంగులేటికి 50 శాతం కమీషన్ ఇస్తే ఏ లిటికేషన్ భూమినైన క్లియర్ చేస్తున్నారని ఆరోపించారు. ఉద్దండపూర్ ప్రాజెక్ట్‌లో పొంగులేటి శ్రీనివాసరెడ్డి కంపెనీ రాఘవ కన్‌స్ట్రక్షన్‌కి కాస్ట్ ఎస్కలేషన్ చేసారనీ, పొంగులేటి మంత్రిగా ఉండి ప్రాజెక్ట్ రివైజ్ ఎస్టిమేట్ చేసుకుంటారా?అని ప్రశ్నించారు. క్యాబినెట్ మంత్రులు స్వార్థం కోసమా? ప్రజల సంక్షేమం కోసమా? అని నిలదీశారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్యాకేజీల మంత్రిగా మారారనీ, ఇరిగేషన్‌లో ప్యాకేజీ లేనిదే పని కావడం లేదని ఆరోపించారు. ఆయన కన్ను సీఎం సీటుపై పడిందని చెప్పారు. కేవలం దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులపై దృష్టి పెడుతూ ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులను విస్మరించడం న్యాయమా? అని ప్రశ్నించారు. ఉత్తమ్, పొంగులేటి, రేవంత్ రెడ్డి మధ్య గ్యాప్ స్పష్టంగా కనిపిస్తోందని బాంబు పేల్చారు. మంత్రుల చేతుల్లో రాష్ట్రం దోపిడీకి గురవుతున్నదనీ, తన దగ్గర అన్ని ఆధారాలున్నాయని చెప్పారు.

దక్షిణాదిపై బీజేపీ ప్రతీకారం

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అహ్మదాబాద్‌లో ఐటీ ఏం ఉంది" అని ప్రశ్నించారు.

"హైదరాబాద్ ఇప్పుడు ప్రారంభమైంది కాదు. కులీ కుతుబ్ షాహీ నుంచి ప్రారంభమైంది. కులీ కుతుబ్ షా తరువాత నిజాం సర్కార్, తరువాత బ్రిటిష్ ప్రభుత్వం, స్వాతంత్ర్యం తరువాత మర్రి చెన్నారెడ్డి, చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి.. అలా ఆ తరువాత ఇప్పుడు నేను ఉన్నా. 450 ఏండ్లకుపైగా చరిత్ర తెలంగాణ, హైదరాబాద్‌కు ఉంది. చార్మినార్, గోల్కొండ కోట చంద్రబాబు కట్టారా? సికింద్రాబాద్ కంటోన్మెంట్ రాజశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ రావు కట్టారా..? హైదరాబాద్‌లో ప్రముఖ కట్టడాలన్నీ 450 ఏండ్ల నుంచే ప్రారంభమయ్యాయి. ప్రభుత్వాలు మారినా ముఖ్యమంత్రులు మారినా అభివృద్ధి కొనసాగింది. మీరు హైదరాబాద్ రండి.. ప్రపంచంలోనే అత్యుత్తమమైన గాజులు, ముత్యాలు చార్మినార్ వద్ద దొరుకుతాయి. ఇప్పుడు డాలర్ల మార్పిడి చేస్తున్నాం. 400 ఏండ్ల క్రితమే అక్కడ నగదు మార్పిడి ఉంది. ప్రపంచంలోని ఎక్కడి నగదు (నోట్) తీసుకువచ్చినా అక్కడ మార్చుకోవచ్చు" అని అన్నారు. "మోడీ గిఫ్ట్ సిటీని తీసుకెళ్లారు. గిఫ్ట్ సిటీలో పెట్టుబడులు పెట్టేవారికి ఎన్నో ప్రత్యేక అవకాశాలు, రాయితీలు ఇచ్చారు. నిబంధనలు అతిక్రమించి గిఫ్ట్ సిటీలో ప్రయోజనాలు కల్పిస్తున్నారు. హైదరాబాద్‌కు ఎందుకు ఇవ్వరు? గిఫ్ట్ సిటీలో యూనివర్సిటీ, పరిశ్రమ ఏ పెట్టుబడి వచ్చినా లాభాలు ఆయా దేశాలకు తీసుకెళ్లే అవకాశం ఇచ్చారు. ఆ లాభాలు ఇతర రాష్ట్రాలకు ఎందుకు పంచరు? హైదరాబాద్‌కు ఆ అవకాశం ఎందుకు ఇవ్వరు? అని ప్రశ్నించారు.

వ్యక్తిగతంగా మోడీతో విబేధాల్లేవ్.. విధానపరంగానే...

"మోడీతో నాకు వ్యక్తిగతంగా ఎటువంటి విభేదాలు లేవని, నేను మోడీ విధానాలతో విభేదిస్తున్నాను. మోడీ దేశానికి ప్రధానమంత్రి ఆయనకు గౌరవం ఇవ్వాలి. ఆయనను కలిసి మా రాష్ట్రానికి కావాల్సినవి అడగడం నా హక్కు, బాధ్యత. ప్రజలు నాపై నమ్మకం ఉంచి ఎన్నికల్లో గెలిపించి ముఖ్యమంత్రిని చేశారు" అని అన్నారు.

తెలంగాణ అప్పులు రూ. ఏడులక్షల కోట్లు

"తెలంగాణ అప్పులు రూ. 3.50 లక్షల కోట్లు కాదు. రూ.7 లక్షల కోట్లు. 2014లో మేం తెలంగాణ ఏర్పాటు చేసినప్పుడు రాష్ట్రానికి ఉన్న అప్పులు రూ.69 వేల కోట్లు. కేసీఆర్ పదేండ్ల కాలంలోనే రూ.6 లక్షల కోట్లకుపైగా అప్పులు చేసి వెళ్లారు. మా రాష్ట్రానికి ఇప్పుడు నెలకు ఉన్న ఆదాయం రూ.18,500 కోట్లు. జీతాలు,పింఛన్లకు నెలకు రూ.6,500 కోట్లు, ఈ అప్పులకు వడ్డీలకు రూ.6,500 కోట్లు నెలకు మేం కట్టాలి. మేం తిన్నా తినకపోయినా.. టీ తాగినా, తాగకపోయినా ప్రతి నెల పదో తేదీ లోపు రూ.13 వేల కోట్ల చొప్పున కట్టాలి. మిగిలిన రూ.5,500 కోట్లతో మేం అభివృద్ధి, సంక్షేమం చేపట్టాలి" అని అన్నారు.



"నేను అప్పులకు తిరిగి చెల్లించే గ్యారంటీల గురించి చెబుతున్నా. నేను గ్యారంటీలు చేయమని చెప్పడం లేదు. మా పరుగు సాగుతోంది. మా పరుగును సాగనివ్వండి. మోడీ ఢిల్లీలో అనేక గ్యారంటీలు ఇచ్చారు. ఎవరూ మోడీని ప్రశ్నించడం లేదు. మోడీ గ్యారంటీలకు వ్యతిరేకమైతే ఢిల్లీలో ఎందుకు గ్యారంటీలు ఇచ్చారు? మేం 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణాలను మూడు నెలల్లోపు మాఫీ చేశాం. దేశంలో తొలిసారి నేను ఇంత రుణమాఫీ చేశా. ఇప్పటి వరకు ఎవరూ చేయలేదు" అని అన్నారు.

"ఒకే దేశం - ఒకే ఎన్నిక, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై చర్చ జరగాలి

"ఒకే దేశం - ఒకే ఎన్నిక, నియోజకవర్గాల పునర్విభజన, ఇతర అంశాలపై చర్చ జరగాలి. మూల ధన వ్యయంపై (క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్) చర్చ జరగాలి. నేను నెలకు రూ.500 కోట్లు కూడా క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్‌పై పెట్టలేకపోతున్నా. రానున్న రోజుల్లో రాష్ట్రం, దేశం ఏం కావాలి" అని అన్నారు. "ఏం చేసినా బీజేపీకి దక్షిణాదిలో ఏం రావడం లేదు. దక్షిణాదిపై ప్రతీకారం తీర్చుకోవాలని బీజేపీ భావిస్తోంది. ఇందుకు నియోజకవర్గాల పునర్విభజన అనే ఆయుధాన్ని బీజేపీ ఎంచుకుంది. దక్షిణాది ప్రాతినిధ్యాన్నితగ్గించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది" అని అన్నారు. "ఈ దేశంలో ప్రతి రాష్ట్రానికి కొన్ని హక్కులున్నాయి. ఇది రాష్ట్రాల సమాఖ్య. దక్షిణాదిలో బీజేపీకి అధికారం లేదు. ప్రాతినిధ్యం లేదు. కొత్త కొత్త మార్గాల ద్వారా దక్షిణాదిని శిక్షించే పనులు చేయకూడదు. దక్షిణాది రాష్ట్రాలే కాదు పంజాబ్ నుంచి మనీశ్ తివారి ఏం చెబుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకూ నష్టమే. బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలే ఎక్కువగా లబ్ధిపొందుతున్నాయని చెబుతున్నారు. అందుకే దక్షిణాది రాష్ట్రాలే కాదు, ఉత్తరాది రాష్ట్రాలు కూడా కలిసి రావాలి" అని తెలిపారు.

మోడీ సర్కారులో మైనార్టీలు ఎంతమంది ఉన్నారు..?

"మోడీ ప్రభుత్వంలో ఎంత మంది మైనారిటీలు ఉన్నారో మీరు చెప్పండి. స్వాతంత్ర్య ఉద్యమంలో మైనారిటీలు పాల్గొనలేదా? అమరులు కాలేదా? ప్రధానమంత్రి ఎందుకు ఇవ్వలేదో అడగండి? ప్రధానమంత్రి ఏ ఒక్క మతానికీ అన్యాయం చేయకూడదు కదా..?" అని పేర్కొన్నారు. "ప్రతి మత విశ్వాసాన్ని మేం గౌరవిస్తున్నాం. మనం దసరా, నవరాత్రి జరుపుకోవడం లేదా? తిరుపతి వెళ్లే వారికి రాయితీలు ఇస్తున్నాం. ఈ దేశంలో ఉన్న ప్రతి మతంలోని వ్యక్తి విశ్వాసాలను మనం గౌరవించాలి. హిందూ, ముస్లిం, క్రైస్తవం ఎవరివైనా...? 200 ఏళ్లకుపైగా పాలించిన బ్రిటిషర్లు వెళ్లిపోయిన తర్వాత ఆంగ్లో ఇండియన్లకు పార్లమెంట్, అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఇచ్చాం" అని తెలిపారు.

బీజేపీకి అనుబంధ సంస్థలుగా ఈడీ, సీబీఐ, ఐటీ

"మాకు అనుబంధ సంస్థలుగా యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, విద్యార్థి కాంగ్రెస్ ఉన్నాయి. బీజేపీకి అనుబంధ సంస్థలుగా ఈడీ, సీబీఐ, ఐటీ ఉన్నాయి. వారు నైస్ ఆర్ ఐస్‌తో పోరాడుతున్నారు. నైస్ అంటే నార్కొటిక్స్, ఇన్‌కంటాక్స్ బ్యూరో, సీబీఐ, ఐడీ... ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారికి బీజేపీవారి నుంచి నైస్ కావాలా. ఐస్ కావాలా అని ఫోన్ వస్తుంది. నైస్ వస్తే జైలుకు పోతారు. ఐస్ వస్తే బీజేపీ టిక్కెట్ వస్తుంది" అని ఎద్దేవా చేశారు.

భద్రాచలానికి రమ్మంటే...

"నేను భద్రాచలం రావాలని మోడీ, అమిత్ షాను ఆహ్వానించినా రాలేదు. భద్రాచలం పరమ పవిత్ర క్షేత్రమని నేను నమ్ముతా. అయినా మోడీ, అమిత్ రావడం లేదు" అని అన్నారు. "ఒలింపిక్స్ గేమ్స్ నిర్వహణకు హైదరాబాద్‌కు అవకాశం ఇవ్వాలని ప్రధానికి విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రపంచ సుందరి పోటీలు మేలో హైదరాబాద్‌లో జరగబోతున్నాయి. ప్రపంచ సుందరి పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్నప్పుడు ఒలింపిక్స్ ఎందుకు జరగకూడదు" అని ప్రశ్నించారు.

75 ఏండ్లైనా ఏ కులం ఎంతో లెక్కతేలలేదు..

75 ఏండ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఏ కులం లెక్క ఎంతో తెలియకపోతే ఎలా? జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీ లెక్కలు చేస్తున్నప్పుడు బీసీ లెక్కలు ఎందుకు చేయకూడదు. మేం అందుకే జన గణనలో కుల గణన చేపట్టాలని శాసనసభలో తీర్మానం పెట్టాం" అని అన్నారు. "రిజర్వేషన్లు ఎందుకు ఆపాలి.

మేం అందుకే రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటున్నాం. బీసీలకు బీజేపీ అన్యాయం చేసిందనేది మేం చెబుతున్నాం. ఎస్సీ, ఎస్టీలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇచ్చింది. ఇప్పుడు ఓబీసీలకు ఇవ్వాలనుకుంటున్నాం. ఎలాగైనా మేం రిజర్వేషన్లు ఇస్తాం. మండల్ కమిషన్ 29 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది. మేం వాటిని ఇంకా పెంచాలనుకుంటున్నాం" అని అన్నారు.



సముచిత స్థానం కల్పించాలి

మహిళకు స్వేచ్ఛ కావాలనే ఉద్దేశంతో మహిళ దినోత్సవం ఏర్పడింది. మహిళ ఇంటి బాధ్యతలతో సమానంగా వృత్తిలో కూడా అదే స్థాయిలో కృషి చేస్తుంది. అన్ని విధాలుగా సమాజంలో భాగం అవుతుంది. నేటి అమ్మాయిలే రేపటి మహిళలు కాబట్టి రేపటి తరాన్ని చైతన్య వంతం చేయాలి. ఆ ఉద్దేశంతోనే మా బాలోత్సవ్ కమిటీ ఈసారి మహిళా దినోత్సవానికి షీరోస్ అనే కార్యక్రమాలు నిర్వహించబోతుంది. పుస్తకంలోని కొంత మంది జీవితాలను తీసుకొని వాటి పాత్రలను చూపించబోతున్నాం. మహిళలకు సమాజం సముచిత స్థానం కల్పించాలి, అనేక రంగాలలో ముందుకు దూసుకుపోతున్న మహిళలను గౌరవించుకోవాలనేదే మా ఉద్దేశం.

- ఇందిరా పరాశరం, బాలోత్సవ్ కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్

స్ఫూర్తి నింపే షీరోస్



గత ఏడాది డిసెంబర్‌లో షీరోస్ పుస్తకం తెలుగులోకి తీసుకొచ్చారు. ఏబీసీడీ అనే సంస్థ దీన్ని తీసుకొచ్చింది. షీరోస్ అంటే ధీర వనితలు. పాత తరం నుండి నేటి వరకు ఎన్నో విజయాలు సాధించిన మహిళల గురించి ఇందులో ఉంది. స్ఫూర్తిదాయక జీవితాలు వీరివి. అందుకే వీటిని నేటి తరానికి కండ్లకు కట్టినట్టు చూపించాలనే ఉద్దేశంతో ఉమెన్స్‌డే రోజు బాలోత్సవ్ ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. స్కూల్ టీచర్లు, నాట్య గురువులు ఇందులోని పాత్రలు చేయబోతున్నారు. సాధారణ మహిళలు కూడా కొందరు పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నారు.

స్ఫూర్తిని కొనసాగించాలి

సమాజంలో చాలామంది మార్చి 8 అంటే పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ ఏదో ఆ ఒక్కరోజు జరిపి చేతులు దులుపుకుంటున్నారు. మహిళకు గిఫ్టులు ఇచ్చి, సన్మానాలు చేసి గొప్పగా ఏదో చేసేశాము అనుకుంటున్నారు. కానీ మహిళ సమస్యలు పరిష్కరించడంలో, వివక్షను రూపుమాపడంలో మాత్రం వెనకబడి పోతున్నారు. నిజమైన మహిళా దినోత్సవ స్ఫూర్తిని కొనసాగించడానికి ఎలాంటి ప్రణాళికలు రూపొందించడం లేదు. ముఖ్యంగా మన దేశ పాలకులు మహిళా సమానత్వం కోసం కృషి చేయాల్సింది పోయి తిరిగి మహిళలను నాలుగ్గోడలకు పరిమితం చేయాలని చూస్తున్నారు. మహిళలపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయి. ఎన్ని చట్టాలు వచ్చినా ప్రయోజనం ఉండడం లేదు. అలాగే 33 శాతం రిజర్వేషన్ అని 25 ఏండ్ల నుండి చర్చ జరుగుతూనే ఉంది. కానీ అది ఆచరణ సాధ్యం కాలేదు. పాలకులు గానీ, ప్రజల్లో గానీ దీనిపై ఎలాంటి అవగాహన లేదు. మహిళలకు ఇవ్వాల్సినంత ప్రాధాన్యం ఈ సమాజం ఇవ్వడం లేదు. అందుకే మహిళల్లో చైతన్యం నింపేందుకు బాలోత్సవ్ షీరోస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

మగవారు అత్యంత ధైర్య సాహసాలు చూపిస్తే 'అబ్బా వాడురా అసలైన హీరో అంటే' అంటారు. మరి మహిళలు అదే ధైర్యాన్ని చూపిస్తే... ఎంతో కాలం నుండి ఇదో పెద్ద ప్రశ్నగా మిగిలిపోయింది. దీనికి సమాధానంగానే గత ఏడాది 'షీరోస్' పేరుతో 256 మంది ధీర వనితల స్ఫూర్తిదాయక జీవితాలను మన ముందుకు తీసుకొచ్చింది ఎనిమిదో తరగతి చదువుతున్న అహల. ఇంగ్లీష్‌లో ఉన్న ఈ పుస్తకాన్ని అనువదించి తెలుగు పాఠకులకు అందించారు వంగపల్లి పద్మ. ఈరోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా షీరోస్‌లోని కొన్ని పాత్రలను బాలోత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో నేటి తరానికి చూపించబోతున్నారు.



మహిళలంటే చిన్న చూపు



మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నా సమాజంలో చిన్న చూపు చూస్తున్నారు. ఆడవాళ్ళు బయటకు రాని కాలంలోనే మహిళలు ఎన్నో విజయాలు సాధించారు. కవయిత్రి మొల్ల, ఝాన్సీ లక్ష్మీబాయ్, రుద్రమదేవి వంటి వాళ్ళు ఈ కోవలోకే వస్తారు. అలాంటి వాళ్ల జీవితాను చూసి నేటి తరం స్ఫూర్తిపొందుతారు. అలాగే ఈ మధ్య కాలంలో అమ్మాయిలపై అత్యాచారాలు పెరిగిపోయాయి. ఈ సమాజంలో మనం ఎలా ఉండాలి అనే విషయం నేటి ఆడపిల్లలకు తెలియడం లేదు. అది తెలియజేయాల్సిన అవసరం కూడా ఉంది. అందుకే ఉమెన్స్ డే రోజు మేము షీరోస్ కార్యక్రమం చేస్తున్నాము.

- మాఢభూషిణి రమణీ సిద్ధి, కమిటీ సభ్యురాలు

తర్వాతి తరాలకు స్ఫూర్తి



మేము మహిళా దినోత్సవం జరుపుతుంటే చాలా మంది బాలోత్సవ్‌కి మహిళలకు సబంధం ఏంటీ అని అనుకుంటున్నారు. పిల్లలు సామాజిక కార్యక్రమాల్లో భాగం పంచుకోవాలంటే ముందు వాళ్ల తల్లులు చైతన్యం కావాలి. అందు కోసమే మేము మహిళా దినోత్సవం సందర్భంగా షీరోస్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. షీరోస్ అంటే మహిళా ధీరవనితలు. ఈ పుస్తకంలోని అట్టడుగు స్థాయి నుండి పైకి ఎదిగిన 70 నుండి 80 మంది పాత్రలు ఎంపిక చేశాము. వీళ్ళ జీవితాలు తర్వాతి తరానికి స్ఫూర్తిగా నిలబడతారు. ఉపాధ్యాయులు ఈ పాత్రలు చేస్తే వాళ్ల ద్వారా విద్యార్థులు కూడా స్ఫూర్తి పొందుతారు. అందుకే ఉపాధ్యాయులకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాము.

- సుజావతి, బాలోత్సవ్ కమిటీ ఉపాధ్యక్షురాలు

మనలోని ధైర్యాన్ని గుర్తించాలి



నేను టీచర్‌గా వర్క్ చేస్తున్నాను. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా షీరోస్ పుస్తకంలోని కొన్ని పాత్రలు ఎంపిక చేసుకున్నాము. టీచర్స్‌తో పాటు ఆసక్తి ఉన్న మహిళలతో ఈ పాత్రలు వేయించాలనుకున్నాం. దీని వల్ల పాత్రలు చేసిన వారు, అలాగే చూసిన వారు కూడా స్ఫూర్తి పొందే అవకాశం ఉంటుంది. అయితే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం మహిళల కోసం ఏం చేస్తున్నది అనేది పెద్ద ప్రశ్న. కాబట్టి మనకు మనమే స్ఫూర్తి పొందాలి. ఆ ఆలోచన నుండే ఈ కార్యక్రమం పుట్టుకొచ్చింది. మహిళ లేనిదే జీవనం లేదు, గమనం లేదు ఈ సృష్టే లేదు. కానీ అలాంటి మహిళ ఈ పురుషాధిక్య సమాజంలో నిత్యం వివక్షకు గురౌతూనే ఉంది. మనకంటూ ఓ రోజు ఉంది. మన హక్కులను, మనలోని ధైర్యాన్ని గుర్తించేలా చేసుకోవాలి. అందుకే ఇలాంటి కార్యక్రమాల ద్వారా మహిళల్లోని శక్తిని బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం.

- అంకమ్మ బాలోత్సవ్ కమిటీ సభ్యురాలు

ఏడాదికోసారి..



ప్రతిఏటా మార్చి నెలలో ఆమె గుర్తుకొస్తుంది
ఆమె నెత్తిమీద అక్షర అభిషేకం జరుగుతుంది
సభలు సమావేశాలు ఊపందుకుంటాయి
దేవత.. తల్లి..ఇల్లాలు.. ప్రేమ స్వరూపిణి అంటూ
పదాలన్నీ కూర్చి పేర్చిన మాటల గులాబీ మాల
ఆమె మెడలో అందంగా అలంకరించబడుతుంది
ఆమెను వర్ణించేందుకు కలాలన్నీ కొట్లాడుకుంటాయి
కళ్ళతోను కాంక్షతోను చూపుల బాణాలు
సంధించబడతాయి
ప్రశంసల పూల జల్లులతో కీర్తి
కిరీటాలు సిద్ధమవుతాయి
ఏడాదంతా ఇకపై ఆమె కనిపించదు
ప్రతిరోజు విరిసిన కొత్త పూల పరిమళం
రాత్రిపూట మెరిసే నక్షత్రాల వెలుగులు
ఆమెపై ప్రసరింపబడవు..
కానీ..వినిపించేదొక్కటే
ఎండ వానల ప్రమేయం లేని
పని యంత్రపు చప్పుడు
కవులారా గాయకులారా
పదబంధాలను సిద్ధం చేయండి
రాగాలన్నీ ఈరోజే కూర్చండి
కీర్తనలన్నీ ఇప్పుడే పాడండి
రేపటి రోజున అంతా నిశ్శబ్దమే
అంతటా ఆవరించిన శూన్యమే
తాగి వచ్చి గొడ్డులా బాదినా
ఉదయాన్నే ఒంటిమీద గాయాలను
చీర చుట్టులో దాచుకొని పనికి పరిగెట్టాలి
ఆమె పరుగును ఆపకు
తాను తినకున్నా బిడ్డలకు బాక్సులు కట్టి
బువ్వ పెట్టి బూట్లు తొడిగి బడికి సాగనంపినప్పుడు
ఆలస్యం నీ వల్లే అని విసుక్కోకు
కుతుకుతా ఉడికే అన్నంతో పాటు ఆవిరయ్యే ఆశలను
గంజి వార్చి మూతపెట్టినప్పుడు
అన్నం మాడ్చేసావని అక్కసు వెళ్ళగక్కకు
పళ్ళెంలో అన్నం పెడుతూ
అడ్డొచ్చిన పచ్చిమిర్చి కరివేపాకు
తీసి మరీ వడ్డించే ఆ ప్రేమను
పక్కనపెట్టి కంచాన్ని విసిరి కొట్టకు
కిక్కురు మనకుండా ఉన్నతనను
ఆత్మాభిమానం నీకెందుకని ఆవేశంతో అరవకు
ఎలా అణగదొక్కాలా అని
పదేపదే పథకాలు రచించకు
ఆమెలేని నీ జీవితం నీ ఊహలలో
ఒకే ఒక్కసారి నింపుకో..
నీ ఆలోచన మారుతుందేమో
నీ చుట్టూ అల్లుకున్న జీవితంలో
అపశృతులను భరించే ఆమెను చూడు
నీవు చూపే ప్రతాపం నీ పెత్తనం
ఎప్పటికీ తనమీదేనని ఆమెకు తెలుసు
ఆ సహనం అలుసుగా ఆవేశపడకు
నీకు ప్రతి రాత్రి చీకటి
ఆమెకు నీతో బ్రతుకంతా చీకటే!
ఆమెపై నీ దృష్టి సాగనంత వరకు
ఆమె కోసం నిన్ను నీవు మార్చుకోనంతవరకు
ఆమెను ఆమెగా చూడనంతవరకు
ఆమెను పొగిడే ప్రతి అక్షరం
నిన్నే ప్రశ్నిస్తుంది
సమాధానాలు చెప్పగలవా
సిద్ధం చేసుకో ఇక మొదలెట్టు..

- డా. సమ్మెట విజయ

కార్మికుల కడుపుకొట్టి

యాజమాన్యాలకు దోచిపెడతారా?

(మొదటిపేజీ తరువాయి)

వేతనాల సవరణ విషయంలో తొందరపాటును ప్రదర్శించిందన్నారు. నెల రోజులు తిరగకముందే అన్ని షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌కు డ్రాఫ్ట్ జీవోలు జారీ చేసిందన్నారు. గత జీవోలోని బేసిక్, విడిఏ పాయింట్ల రేట్లకు కలిపి కొత్త బేసిక్‌గా నిర్ణయించారని వాపోయారు. దీనివల్ల కార్మికులకు వేతనాలు ఒక్క రూపాయి కూడా పెరగలేదని చెప్పారు. పైగా గత ప్రభుత్వం పెంచిన వేతనం కన్నా తక్కువ నిర్ణయించటమేంటని ప్రశ్నించారు. ధర్నా అనంతరం యూనియన్ నాయకత్వంతో జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్యాంసుందర్ చర్చలు జరిపారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, కార్యదర్శి జె వెంకటేశ్, ఎం వెంకటేశ్, కె ఈశ్వర్‌రావు, జె చంద్రశేఖర్, జె కుమారస్వామి, జి.శ్రీనివాస్, వై సోమన్న తదితరులు పాల్గొన్నారు.

దిశానిర్దేశం

(మొదటిపేజీ తరువాయి)

జరిగే తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో బీఆర్ఎస్ అధినేత పాల్గొంటారని గులాబీ వర్గాలంటున్నాయి. ఎస్ఎల్బీసీ, కాళేశ్వరం, అప్పుల విషయంలో ప్రభుత్వ తీరును సభ సాక్షిగా ఎండగడతారని అంటున్నారు. 'దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడండి కేసీఆర్..' అంటూ కాంగ్రెస్ నేతలు సవాల్ చేయడం.. మరోవైపు బీఆర్ఎస్ అధినేత సభకు రావడం లేదని హైకోర్టులో పిటిషన్ దాఖలు కావడం, అనర్హత హెచ్చరికలు కూడా కేసీఆర్ అసెంబ్లీకి వెళ్లేందుకు కారణాలుగా చెబుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం నుంచే పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్, హరీశ్ రావు, కవిత, పువ్వాడ అజయ్ కుమార్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్వర్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, అర్ఎస్ ప్రవీణ్‌కుమార్, జోగు రామన్న, ఎమ్మెల్సీ కాట మధుసూదన్, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, దేశపతి శ్రీనివాస్, మధుసూదనా చారి, దాసోజు శ్రావణ్ కుమార్, సబిత ఇంద్రారెడ్డి, రసమయి బాలకిషన్, బండ ప్రకాష్, వినోద్ కుమార్, పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కోర్సుపై అనాసక్తి

(మొదటిపేజీ తరువాయి)

ఖాళీగానే ఉన్నాయి.

ఇంజినీరింగ్ కోర్సుల వైపు విద్యార్థులు ఆసక్తి చూపకపోవటానికి గల ప్రధాన కారణం.. తక్కువ ప్లేస్‌మెంట్లేనని విద్యావేత్తలు, నిపుణులు చెప్తున్నారు. అలాగే, మంచి కెరీర్‌ను అందించే ఇతర కోర్సులూ అందుబాటులోకి రావటమూ ఈ పరిస్థితికి దారి తీసిందని అంటున్నారు. అంతేకాకుండా, అధిక ఫీజులు, కాలం చెల్లిన పాఠ్యాంశాలు, పలు ప్రయివేటు కాలేజీలలో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవటం వంటి అంశాలను ఇతర కారణాలుగా నిపుణులు వివరిస్తున్నారు.

ఏఐసీటీఈ మెంబర్ సెక్రెటరీ రాజీవె కుమార్ మాట్లాడుతూ.. ప్రయివేటు ఇన్‌స్టిట్యూట్‌లలో సీట్లు తరచూ ఖాళీగా ఉంటాయని అన్నారు. ప్రత్యేకించి గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఉన్న సంస్థల్లో ఈ పరిస్థితి ఉంటుందని చెప్పారు. టైర్2, టైర్ 3 నగరాల్లో ఉపాధి అవకాశాలను కల్పించటం తాము పరిష్కరిస్తున్న సవాళ్లలో ప్రధానమైనదని వివరించారు. దీని ఫలితంగా విద్యార్థులు ఇంజినీరింగ్ అడ్మిషన్ల కోసం పెద్ద నగరాలకు వెళ్లటాన్ని నిరోధిస్తుందని చెప్పారు. ఫలితంగా.. ఈ నగరాల్లో ఉండే ఇంజినీరింగ్ కాలేజీలలోని సీట్లు భర్తీ అవుతాయని వివరించారు. సమస్యను పరిష్కరించటం కోసం.. బీటెక్‌తో పాటు బీబీఏ, బీసీఏ వంటి అదనపు ప్రోగ్రామ్‌లను ఆఫర్ చేస్తున్న గ్రామీణ ప్రాంతాల్లోని ఇన్‌స్టిట్యూషన్లను ప్రోత్సహించటానికి, కోర్ ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం ఏఐసీటీఈ స్కాలర్‌షిప్‌లను ప్రవేశపెడుతన్నదని రాజీవె కుమార్ చెప్పారు

కొత్త ఐటీ చట్టం గోప్యతకు ముప్పు

- నూతన చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి అపరిమిత అధికారాలు
- రాజ్యాంగ ప్రాథమిక హక్కులను కాలరాస్తున్న కొన్ని నిబంధనలు
- దేశ ప్రజల డిజిటల్ హక్కులపై కేంద్రం దాడి : ప్రజలు, విపక్షాలు బిల్లును వ్యతిరేకించాలని కేటీఆర్ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైరాబాద్

కేంద్ర ప్రతిపాదిత ఆదాయపు పన్ను బిల్లు, 2025పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లును పౌరుల డిజిటల్ గోప్యతకు తీవ్ర ముప్పుగా అభివర్ణించారు. ఈ బిల్లు నిబంధనలను ఆయన తీవ్రంగా ఖండించారు. పన్ను అమలు పేరుతో కేంద్ర ప్రభుత్వం అతిగా పరిధికి మించి అధికారాలను వినియోగించుకోవడానికి ఈ బిల్లు సహకరించేలా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "కొత్త ఆదాయపు పన్ను బిల్లు ఐటీ అధికారులకు సోషల్ మీడియా, ఈమెయిల్స్, ఆన్లైన్ ట్రేడింగ్ ఖాతాలపై పన్ను తనిఖీ పేరుతో అపరిమిత అధికారాలను ఇచ్చేలా ఉంది. ఈ బిల్లులో ప్రస్తావించిన 'వర్చువల్ డిజిటల్ స్పేసెస్' వేధింపులకు, దుర్వినియోగానికి, విస్తృత నిఘాకు దారితీయవచ్చు. దేశ పౌరుల ఆర్థిక డేటా ఇప్పటికే అనేక సంస్థల ఆధీనంలో ఉందనీ, ఈ కఠినమైన చట్టం పౌరుల ప్రాథమిక హక్కులను, డిజిటల్ గోప్యతను పూర్తిగా తొక్కేస్తుంది. ఈ నూతన చట్టాన్ని ఆధారంగా చేసుకుని కొంతమంది అధికారులు, ఈ నిబంధనల ద్వారా తమ అధికారాలను దుర్వినియోగం చేస్తే దానికి ఎవరిది బాధ్యతనో ప్రధాని మరియు ఆర్థిక మంత్రి సమాధానం చెప్పాలి...." అని కేటీఆర్ అన్నారు.



2025 ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన ఆదాయపు పన్ను బిల్లు, 1961 ఆదాయపు పన్ను చట్టానికి మించి పన్ను అధికారుల అధికారాల పరిధిని విస్తృతంగా పెంచుతుందని విమర్శించారు. సెక్షన్ 247 ప్రకారం, పన్ను ఎగవేత ఆరోపణలు ఉంటే, సోషల్ మీడియా, ఈమెయిల్స్, ఆన్లైన్ ఖాతాలతో సహా ఏదైనా "వర్చువల్ డిజిటల్ స్పేస్"ను యాక్సెస్ చేసి సోదా చేయడానికి అధికారులకు అనుమతి ఇస్తుంది. ఇది 2026 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్నది. సెక్షన్ 261(1)లో విస్తృతంగా నిర్వచించిన ఈ నిబంధన, స్పష్టమైన రక్షణలు లేకుండా డిజిటల్ భద్రతను అతిక్రమించడానికి అనుమతిస్తుంది. ప్రస్తుత చట్టం భౌతిక ఆస్తులపై దృష్టి పెడుతుండగా, ఈ నిబంధన దీనికి పూర్తి భిన్నంగా ఉన్నది. ఈ బిల్లు ద్వారా కేంద్ర ప్రభుత్వం పౌరులకు రాజ్యాంగబద్ధంగా దక్కిన హక్కులను హరించేలా వ్యవహరించే ప్రమాదం ఉంది. ఇది పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఆదాయపు పన్ను వ్యవస్థకు ప్రస్తుత నిఘా వ్యవస్థలు సరిపోతాయి. ఈ అపరిమిత అధికారాలను నియంత్రించడంలో ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి సీతారామన్ దేశ ప్రజలకు వివరణ ఇవ్వాలి. ప్రస్తుతం కేంద్రం ప్రతిపాదించిన ఈ బిల్లు దేశ ప్రజలకు దక్కిన డిజిటల్ హక్కులపై జరుగుతున్న దాడి. పౌరులు, విపక్షాలు ఈ బిల్లును వ్యతిరేకించాలి......" అని కేటీఆర్ కోరారు.

ఏప్రిల్ నుంచి ఉద్యోగుల బిల్లులు చెల్లిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. ఏప్రిల్ నుంచి ఎలాంటి బకాయిల్లేకుండా చూస్తామని చెప్పారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న రూ.ఎనిమిది వేల కోట్ల పాత బకాయిలను రానున్న ఏప్రిల్ నుంచి ప్రాధాన్యతా క్రమంలో ప్రతినెల రూ.500 కోట్ల నుంచి రూ.600కోట్ల వరకు విడుదల చేస్తామన్నారు. గత పదేండ్లు పాలించిన వారి సమయంలో ఉద్యోగులు, పెన్షనర్లకు నెలలో ఏ తేదీలో జీతాలు పడతాయో అర్థం కాని పరిస్థితి ఉండేదని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగులకు ప్రతినెల క్రమం తప్పకుండా ఒకటో తారీఖున జీతభత్యాలు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. రాష్ట్రంలో దాదాపు 13 లక్షల మంది (ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్) సిబ్బంది ఉన్నారని వివరించారు. కేవలం రిటైర్మెంట్ బెనిఫిట్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర బిల్లులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వాటిని సాధ్యమైనంత త్వరలో విడుదల చేస్తామన్నారు. ఉద్యోగుల ఆర్థికేతర సమస్యలను పరిష్కరించడానికి మంత్రివర్గ ఉపసంఘం సభ్యులున్నారనీ, ఆ సమస్యలు కూడా త్వరలో పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని వివరించారు. తమది ఎంప్లాయ్ ఫ్రెండ్లీ ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు,



నేతలు చావ రవి, ఎ వెంకట్, ముజీబ్ హుస్సేనీ, ఎ సత్యనారాయణ, పుల్గం దామోదర్‌రెడ్డి, జి సదానందంగౌడ్, వంగ రవీందర్‌రెడ్డి, బ్యాగరి శ్యామ్, పి మధుసూదన్‌రెడ్డి, పార్వతి సత్య నారాయణ, ఎం సోమయ్య, టి లింగారెడ్డి, ఎన్ తిరుపతి, కస్తూరి వెంకటేశ్వర్లు, సత్య నారాయణ గౌడ్, ఎం అంజిరెడ్డి, మణిపాల్‌రెడ్డి, పోచయ్య, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థలో ఖనిజాలే కీలకం

ఆ రంగంలో పరిశోధనలు పెరగాలి : కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశ ఆర్థిక వ్యవస్థలో ఖనిజాలే కీలకమనీ, వాటికోసం పరిశోధనలు మరింత పెరగాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి అన్నారు. గడచిన దశాబ్ద కాలంలో బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు మొత్తం విద్యుదుత్పత్తిలో 70 శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయని చెప్పారు. దీనివల్ల ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతున్నాయని వివరించారు. శుక్రవారంనాడిక్కడి కవాడిగూడ సీజీఓ టవర్స్‌లో సెంటర్ ఆఫ్ క్లీన్ కోల్ ఎనర్జీ అండ్ నెట్ జీరో (క్లీన్జ్) పేరుతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఏర్పాటు చేస్తూ కోల్ ఇండియా లిమిటెడ్, ఐఐటీ హైదరాబాద్ మధ్య అవగాహనా ఒప్పందం కేంద్రమంత్రి సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్లీన్జ్ ఏర్పాటు కోసం కోల్ ఇండియా లిమిటెడ్ రూ.98 కోట్ల ప్రారంభ గ్రాంటుతో నిధులు సమకూరుస్తుందని వివరించారు. తక్కువ నాణ్యత కలిగిన (లోగ్రేడ్), తిరస్కరించిన భారతీయ బొగ్గుపై ప్రత్యేకంగా దృష్టి సారించడమే క్లీన్జ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లక్ష్యమని తెలిపారు. దీనిపై కోల్ ఇండియా సిబ్బందికి వర్క్ షాపులు, సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో కోల్ ఇండియా లిమిటెడ్ సీఎమ్‌డీ పీఎమ్ ప్రసాద్, ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ మూర్తి, సింగరేణి సీఎమ్‌డీ ఎన్ బలరాంనాయక్, పీఐబీ హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతిపాటిల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంపై పోరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర సమస్యల పరిష్కారానికి అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు ప్రజాభవన్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం వద్ద అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలపై చర్చించనున్నట్టు సమాచారం. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అందుకు సంబంధించిన ముసాయిదా బిల్లుకు గురువారం నాటి క్యాబినెట్‌లో ఆమోదముద్ర పడిన విషయం తెలిసిందే.

త్వరలో జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లుకు ఆమోదం తెలిపి కేంద్రానికి పంపించాలని సర్కార్ నిర్ణయించింది. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో మార్పు చేసి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ పెంచుకునే అవకాశం కల్పించాలని కేంద్రాన్ని కోరనుంది. పెండింగ్ సమస్యలతో పాటు రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం మోడీ సర్కార్‌పై ఒత్తిడి పెంచేందుకు వీలుగా రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపీలు పార్లమెంట్‌లో ఒత్తిడి తేవాలనే లక్ష్యంతో ఈ సమావేశాన్ని నిర్వహించనుంది. ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతున్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు రాష్ట్రానికి సంబంధించిన ఎంపీలందరికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా ఫోన్ చేసి సమావేశానికి ఆహ్వానించారు.

21మంది ఐపీఎస్‌ల బదిలీలు

(మొదటిపేజీ తరువాయి)

ఎస్పీగా నియమించి.. ఇక్కడనున్న అభిషేక్ మహంతిని ఆంధ్రప్రదేశ్‌కు రిలీవ్ చేశారు. రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహజన్‌ను అదిలాబాద్ ఎస్పీగా, సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్‌ను నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా, నగర సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్‌ను యాదాద్రి డీసీపీగా, కొత్తగూడేం ఓఎస్డీ పంకజ్ పరితోష్‌ను సంగారెడ్డి ఎస్పీగా బదిలీ చేశారు. ములుగు ఓఎస్డీ మహేష్ బాబా సాహెబ్‌ను రాజన్న సిరిసిల్ల ఎస్పీగా, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న అంకిత్ కుమార్ షేకావర్ వరంగల్ ఈస్ట్ డీసీపీగా, మరో ఎస్పీ ఎ.భాస్కర్‌ను మంచిర్యాల డీసీపీగా, మరో ఎస్పీ నరసింహను సూర్యాపేట ఎస్పీగా నియమించారు.పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న మరో ఎస్పీ శిల్పవల్లిని సెంట్రల్ జోన్ డీసీపీగా, మరో ఎస్పీ సాయిశేఖర్‌ను ఎస్ఐబీ ఎస్పీగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మరో ఎస్పీ కరుణాకర్‌ను పెద్దపల్లి డీసీపీగా, పి.రవీందర్‌ను ఎస్పీ సీఐడీగా నియమించారు.

12 నుంచి అసెంబ్లీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ఈనెల 12 నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేరిట అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. 12న ఉదయం 11 గంటలకు శాసనసభ, మండలి కొలువుదీరనున్నాయి. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. ఈ సమావేశాల్లోనే బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన ముసాయిదా బిల్లులపై సమగ్రంగా చర్చించి, వాటికి చట్టబద్ధత కల్పించనున్నారని సమాచారం. ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం ఢిల్లీకి వెళ్లి ఈ రెండింటినీ పార్లమెంటులో కూడా ఆమోదించాలంటూ ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేయనుంది. అయితే సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై ఈనెల 13న జరిగే సభా వ్యవహారాల సంఘం (బీఏసీ) సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు.

మిడిల్‌లో అతడు మెరిస్తేనే!





అతడు ఓ సెంచరీ సాధించలేదు. ఏ మ్యాచ్‌లోనూ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గానూ నిలువలేదు. ఒంటిచేత్తో మ్యాచ్‌ను మలుపు తిప్పే ప్రదర్శన సైతం చేయలేదు. పరుగుల వేట కష్టమైన దుబాయ్ పిచ్‌పై ఇన్నింగ్స్‌కు ఇరుసులా మారి.. టీమ్ ఇండియాను గెలుపు బాట పట్టిస్తున్నాడు. ఆదివారం జరిగే చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్‌కు ఎక్స్ ఫ్యాక్టర్‌గా నిలుస్తున్న ఆ ఆటగాడు శ్రేయస్

సహజశైలిలో విధ్వంసక ఇన్నింగ్స్‌లు బాదే శ్రేయస్ అయ్యర్.. దుబాయ్ పిచ్ పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్‌ను మార్చుకున్నాడు. మిడిల్ ఓవర్లలో స్పిన్‌ను అలవోకగా ఆడుతూ.. ప్రత్యర్థులతో ఆటాడుకుంటున్నాడు. ఆదివారం టైటిల్ ఫైట్‌లో భారత్‌కు శ్రేయస్ అయ్యర్ అత్యంత కీలకం.

- ఫైనల్లో భారత్ ఎక్స్ ఫ్యాక్టర్ శ్రేయస్ అయ్యర్
- ఇన్నింగ్స్‌కు ఇరుసులా నిలుస్తున్న నయా నం.4
- ఐసీసీ 2025 చాంపియన్స్ ట్రోఫీ

నవతెలంగాణ క్రీడావిభాగం

భారత్, ఇంగ్లాండ్ ద్వైపాక్షిక వన్డే సిరీస్. తొలి వన్డేకు విరాట్ కోహ్లి దూరం కావటంతో అనూహ్యంగా తుది జట్టులోకి వచ్చాడు శ్రేయస్ అయ్యర్. విరాట్ కోహ్లి గాయంతో అనుకోని అవకాశం అందుకున్న అయ్యర్ ఇప్పుడు చాంపియన్స్ ట్రోఫీలో భారత్‌కు అత్యంత కీలక ఆటగాడిగా మారాడు. బ్యాటింగ్ లైనప్‌లో నాలుగో స్థానంలో క్రీజులోకి వచ్చి.. ఇన్నింగ్స్ స్వరూపాన్నే మార్చివేస్తున్నాడు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలోనూ అయ్యర్ అదిరే జోరు కొనసాగుతుంది. గ్రూప్ దశలో మూడు మ్యాచులు సహా సెమీఫైనల్లోనూ అయ్యర్ అదరగొట్టాడు.

సూపర్ షో

గ్రూప్ దశ చివరి మ్యాచ్. న్యూజిలాండ్‌పై తొలుత భారత్ బ్యాటింగ్. తొలి రెండు మ్యాచుల్లో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా ఇది పరీక్ష. న్యూజిలాండ్ పేసర్లు మాట్ హెన్రీ, కైల్ జెమీసన్ పేస్ సవాల్‌కు భారత టాప ఆర్డర్ తలొంచింది. శుభ్‌మన్ గిల్ (2), రోహిత్ శర్మ (15), విరాట్ కోహ్లి (11) పవర్‌ప్లే ముగియకుండానే పెవిలియన్‌కు చేరుకున్నారు. 6.4 ఓవర్లలో 30/3తో పీకల్లోతు కష్టాల్లో కూరుకున్న తరుణంలో క్రీజులోకి వచ్చిన బ్యాటర్ శ్రేయస్ అయ్యర్. అక్షర్ పటేల్ (42) తోడుగా నాల్గో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేసిన శ్రేయస్ అయ్యర్ కెరీర్‌లో అత్యంత నెమ్మదైన అర్థ సెంచరీ సాధించాడు. మిడిల్ ఓవర్లలో నాణ్యమైన స్పిన్నర్లు మిచెల్ శాంట్నర్, రచిన్ రవీంద్ర, మైకల్ బ్రాస్‌వెల్ త్రయాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. శ్రేయస్ అయ్యర్ 98 బంతుల్లో 79 పరుగులు చేశాడు. అందులో ఏకంగా 46 బంతులు డాట్ బాల్సే కావటం గమనార్హం. టాప్ ఆర్డర్ వైఫల్యంతో కుప్పకూలుతున్న ఇన్నింగ్స్‌ను చక్కదిద్దిన అయ్యర్.. లోయర్ ఆర్డర్ బ్యాటర్ల ధనాధన్‌కు మార్గం సుగమం చేశాడు. అయ్యర్ నిలబెట్టిన ఇన్నింగ్స్‌ను హార్దిక్ పాండ్య, కెఎల్ రాహుల్ ముందుకు తీసుకెళ్లారు. 30/3తో ఉన్న టీమ్ ఇండియా.. 249/9 పరుగులు చేసింది. ఆస్ట్రేలియాతో సెమీఫైనల్లోనూ అయ్యర్ 45 పరుగులు బాదాడు. పాకిస్థాన్‌పై 56 పరుగులతో అర్థ సెంచరీ సాధించాడు. 48.75 సగటుతో రాణించిన శ్రేయస్ అయ్యర్ భారత మిడిల్ ఆర్డర్ కష్టాలు మాయం చేశాడు. ఇంగ్లాండ్‌తో తొలి వన్డే ఆరంభం వరకు భారత్‌కు మిడిల్ ఆర్డర్ సమస్య ఎదుర్కొంది. శ్రేయస్ అయ్యర్ తుది జట్టులో నిలువటంతో మిడిల్ ఆర్డర్ ఇప్పుడు బలంగా తయారైంది. అందుకు కారణం, శ్రేయస్ అయ్యర్.



టెక్నిక్‌లో మార్పులు..

శ్రేయస్ అయ్యర్ పరుగుల వేటలో మెరవటం ఇది తొలిసారి కాదు. భారత జట్టు తరఫున గతంలోనూ అయ్యర్ మెరిశాడు. ఐపీఎల్, దేశవాళీలోనూ తన దమ్ము చూపించాడు. కానీ, దుబాయ్ పిచ్, స్వభావానికి అనుగుణంగా బ్యాటింగ్, టెక్నిక్‌లో మార్పులు చేసుకోవటం అయ్యర్‌ను ప్రత్యేకంగా నిలిపింది. దుబాయ్ పిచ్ నెమ్మదిగా ఉండటంతో సహజంగానే స్పిన్‌కు అనుకూలిస్తోంది. ఇక్కడ మిడిల్ ఓవర్లలో బంతి టర్న్ అవుతుంటే ఆడటం కష్టసాధ్యం. స్పిన్‌ను ఎదుర్కొనేందుకు శ్రేయస్ పాత టెక్నిక్‌ను పట్టుకున్నాడు. స్పిన్నర్ బంతి విసిరేందుకు రనప్ మొదలెట్టగానే.. అయ్యర్ వికెట్లను పూర్తిగా వదిలేస్తున్నాడు. వికెట్లను వదిలేస్తూ స్పిన్నర్లను ఊరిస్తూ.. అలవోకగా పరుగులు పిండుకుంటున్నాడు. పేసర్లను ఆడేటప్పుడు షార్ట్ బాల్ బలహీనత అయ్యర్‌కు ఉండేది. చాంపియన్స్ ట్రోఫీలో ఆ బలహీనతను సైతం అధిగమించాడు. షార్ట్ బాల్‌ను సమర్థవంతంగా ఆడేందుకు బ్యాట్‌ను పట్టుకునే విధానం, బ్యాట్‌ను ఊపుతూ షాట్‌కు సిద్ధపడటం వంటి మార్పులు చేసుకున్నాడు.

మిడిల్‌లో మెరుపులు

చాంపియన్స్ ట్రోఫీలో భారత్ నాలుగు మ్యాచులు దుబాయ్‌లో ఆడింది. ఆదివారం టైటిల్ పోరు సైతం దుబాయ్‌లోనే జరుగనుంది. ఇక్కడ జరిగిన మ్యాచుల్లో మిడిల్ ఓవర్లలో (11-40 ఓవర్లు) పరుగులు, వికెట్లే మ్యాచ్ గమనాన్ని నిర్దేశించాయి. గ్రూప్ దశ తొలి మ్యాచ్ బంగ్లాదేశ్‌తో మినహా మిగతా మూడు మ్యాచుల్లోనూ మిడిల్ ఓవర్లలో భారత్‌దే పైచేయి. బంగ్లాదేశ్ మిడిల్ ఓవర్లలో వికెట్లేమీ నష్టపోకుండా 126 పరుగులు చేయగా.. భారత్ 3 వికెట్లకు 120 పరుగులు చేసింది. కానీ ఆసీస్, కివీస్, పాక్‌పై మిడిల్ ఓవర్లలో భారత్ పైచేయి సాధించింది. సెమీస్‌లో ఆసీస్ 4 వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేయగా.. భారత్ 2 వికెట్లే కోల్పోయి 145 పరుగులు చేసింది. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో భారత్ 2 వికెట్లకు 148 పరుగులు చేయగా.. కివీస్ 5 వికెట్లు కోల్పోయి 121 పరుగులే చేసింది. పాకిస్థాన్ సైతం 3 వికెట్లకు 131 పరుగులు చేయగా.. భారత్ 2 వికెట్లకు 159 పరుగులు చేసింది. మిడిల్ ఓవర్లలో స్ట్రయిక్ రొటేట్ చేస్తూ స్కోరు బోర్డుకు ముందుకు నడిపించటంతో పాటు వికెట్లను సైతం నిలుపుకుంటే.. డెత్ ఓవర్లలో (41-50 ఓవర్లు) లోయర్ ఆర్డర్ బ్యాటర్లు ధనాధన్ మోత మోగించేందుకు స్వేచ్ఛ లభిస్తుంది. శ్రేయస్ అయ్యర్ ప్రతి మ్యాచ్‌లోనూ మిడిల్ ఆర్డర్‌లో తన బాధ్యత నిర్వర్తిస్తున్నాడు. టాప్ ఆర్డర్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు పవర్‌ప్లేలో, డెత్ ఓవర్లలో దంచికొట్టేందుకు ఇన్నింగ్స్‌కు ఇరుసులా వ్యవహరిస్తున్నాడు.

టైటిల్ ఫైట్‌కు సై

2017 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో పరాజయం పాలైన టీమ్ ఇండియా.. ఆ తర్వాత వరుసగా ఐసీసీ టైటిల్ ఫైట్లలో నిరాశకు గురైంది. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో రెండు సార్లు, 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో భారత్‌కు భంగపాటు తప్పలేదు. 2024 టీ20 ప్రపంచకప్‌తో ఐసీసీ టైటిళ్ల నిరీక్షణకు తెరదించిన భారత్.. ముచ్చటగా మూడోసారి చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో పోటీపడనుంది. టైటిల్ ఫైట్‌కు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్య, కెఎల్ రాహుల్ ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నారు. బౌలింగ్ విభాగంలో మహ్మద్ షమి, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజాలు ఉత్సాహంగా ఉన్నారు. నాలుగు మ్యాచుల తరహాలోనే సమిష్టి ప్రదర్శన కొనసాగిస్తే.. భారత్ మరో ఐసీసీ టైటిల్‌ను సొంతం చేసుకోవటం ఖాయమే.

మాట్ హెన్రీ అనుమానమే!

కివీస్ పేసర్‌కు భుజం గాయం



దుబాయ్ : గ్రూప్ దశ మ్యాచ్‌లో భారత టాప్ ఆర్డర్‌ను కకావికలం చేసిన న్యూజిలాండ్ పేసర్ మాట్ హెన్రీ ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌కు అనుమానంగా మారాడు. బుధవారం లాహోర్‌లో జరిగిన రెండో సెమీఫైనల్లో ఫీల్డింగ్ చేస్తుండగా మాట్ హెన్రీ గాయపడ్డాడు. భుజం గాయానికి గురైన మాట్ హెన్రీ ఫైనల్లో ఆడేది లేనిది ఇప్పుడే చెప్పలేమని న్యూజిలాండ్ కోచ్ గ్యారీ స్టీడ్ తెలుపగా.. కెప్టెన్ మిచెల్ శాంట్నర్ మాత్రం హెన్రీ అందుబాటుపై ఆశావహ దృక్పథంతో ఉన్నాడు. టైటిల్ పోరు కోసం న్యూజిలాండ్ దుబాయ్‌కు చేరుకోగా.. మాట్ హెన్రీ భుజం నొప్పితో బాధపడుతున్నట్టు స్టీడ్ తెలిపాడు. ఆదివారం ఫైనల్‌కు హెన్రీ దూరమైతే.. మరో సీమర్ జాకబ్ డఫ్ఫీ తుది జట్టులో నిలిచే అవకాశం ఉంది.


క్వార్టర్స్‌లో ఆయుశ్

ప్రణయ్, శ్రీకాంత్ ఓటమి
ఓర్లీన్స్ మాస్టర్స్ బ్యాడ్మింటన్



ఓర్లీన్స్ (ఫ్రాన్స్) : భారత యువ షట్లర్ ఆయుశ్ శెట్టి ఓర్లీన్స్ మాస్టర్స్ సూపర్ 300 టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు. పురుషుల సింగిల్స్ ప్రీ క్వార్టర్స్‌లో 2-17, 2-17తో హాంగ్‌కాంగ్ షట్లర్ జేసన్ గునవాన్‌పై గెలుపొందాడు. వరల్డ్ నం.38 జేసన్‌పై తొలి గేమ్ నుంచి దూకుడుగా ఆడిన ఆయుశ్ శెట్టి.. ఎక్కడా వెనక్కి తగ్గలేదు. 11-5తో తొలి గేమ్ విరామ సమయానికి ఆయుశ్ మంచి ఆధిక్యంలో నిలిచాడు. ద్వితీయార్థంలోనూ అదే జోరు కొనసాగించాడు. రెండో గేమ్‌లో జేసన్ పుంజుకుని పోటీ ఇచ్చాడు. 7-7 వరకు నువ్వా నేనా అన్నట్టు సాగిన మ్యాచ్‌లో 11-8తో ఆయుశ్ ముందంజ వేశాడు. విరామం తర్వాత జేసన్ పుంజుకునే ప్రయత్నం చేసినా.. ఆయుశ్ ఎటువంటి అవకాశం ఇవ్వలేదు. నేడు జరిగే సెమీఫైనల్లో డెన్మార్క్ షట్లర్ రాస్మస్ గెమ్కెతో ఆయుశ్ తలపడనున్నాడు. మరో మ్యాచ్‌లో కిదాంబి శ్రీకాంత్ 11-21, 17-21తో టాప్ సీడ్ లీ చేతిలో ఓటమిపాలవగా.. రెండో సీడ్ చున్ లిన్ చేతిలో 18-21, 9-21తో ప్రణయ్ పరాజయం చెందాడు. పురుషుల డబుల్స్‌లో సాయి ప్రతీక్, పృథ్వీలు 16-21, 13-21తో నిరాశపరిచారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్, రుత్విక శివాని జోడీ ప్రీ క్వార్టర్స్ మ్యాచ్ నుంచి వాకోవర్ ఇచ్చింది.

తెలుగులో 'కిస్ కిస్ కిస్సిక్'



సుశాంత్, జాన్యాజోషి

బాలీవుడ్‌లో రూపొందిన యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ 'పింటు కి పప్పీ'. ఈ సినిమా ఈనెల 21న హిందీ వెర్షన్‌తో పాటు తెలుగు, తమిళం, మలయాళం కన్నడ భాషలలోనూ 'కిస్ కిస్ కిస్సిక్' టైటిల్‌తో విడుదల కానుంది.

మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషలలో గ్రాండ్ రిలీజ్ చేయనుంది. ఈ చిత్ర ట్రైలర్ నేడు (శనివారం) విడుదల కానుంది.

లవ్, కామెడీ, యాక్షన్‌తో ఉన్న కంప్లీట్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ చిత్రం పింటు అనే తుంటరి కుర్రాడి ప్రేమ, జీవితంలోని ఊహించని మలు పులను నావిగేట్ చేస్తూ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోంది. ఎమోషన్, నవ్వులు, సర్‌ప్రైజ్‌లతో రోలర్‌కోస్టర్‌గా ప్రేక్షకులను కట్టిపడేస్తుంది.

నిర్మాత విధి ఆచార్య మాట్లాడుతూ, 'పింటు కి పప్పీ' గురించి మేము చాలా గర్వపడుతున్నాం. ఇది అద్భుతమైన తారాగణం, టీమ్‌ని ఒకచోట చేర్చింది. మేము సృష్టించిన మాయాజాలాన్ని ప్రేక్షకులు ఎక్స్‌పీరియన్స్ చేయడానికి ఎదురుచూస్తున్నాం' అని అన్నారు.

ఈ సినిమా సుశాంత్, జాన్యా జోషి విధిని పరిచయం చేస్తుంది. వీరితో పాటు విజయ్ రాజ్, మురళీ శర్మ, సునీల్ పాల్, అలీ అస్గర్, అజయ్ జాదవ్, పూజా బెనర్జీ, అదితి సన్వాల్, రియా ఎస్. సోని, ఊర్వశి చౌహాన్, వృమోరి మెహతా దాస్, ముక్తేశ్వర్ ఓజా, గణేష్ ఆచార్య వంటి కీలక తారాగణం కూడా ఉంది. శివ్ హరే రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకాన్ని చిత్ర బృందం వ్యక్తం చేసింది.

ప్రేక్షకులకు కృతజ్ఞతలు



ఆదిత్య ఓం

గత వారం హీరో ఆదిత్య ఓం 'బంది' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. రఘు తిరుమల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని గల్లీ సినిమా బ్యానర్‌పై నిర్మించారు.

ఈ మూవీకి థియేటర్లలో ఆడియెన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా మంచి విజయాన్ని సాధించడంతో చిత్రయూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించింది.

ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, 'ఈ సినిమా అద్భుతంగా ఉంది. పర్యావరణాన్ని రక్షించాలనే ఉద్దేశంతో తీసిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంది. అందుకే ఈ సినిమాకు ఇంకా హౌస్ ఫుల్స్ పడుతున్నాయి. ఆదిత్య ఓం ఎంతో విలక్షణ నటుడు. ఈ సినిమాలోని విజువల్స్, కెమెరా వర్క్ అద్భుతంగా ఉంది. రఘు తిరుమల మంచి పాయింట్‌తో సినిమాను చేశారు. అందరినీ ఆకట్టుకున్న ఈ చిత్రం మరింత ముందుకు వెళ్లాలి. కమర్షియల్‌గా ఈ సినిమా ఆడటం మరింత ఆనందంగా ఉంది' అని అన్నారు.

'మాలాంటి కొత్త వాళ్లని ఆదిత్య ఓం చాలా బాగా ఎంకరేజ్ చేశారు. ఆయన సహకారంతోనే ఈ మూవీని ఇంత బాగా తీయగలిగాం. ఈ సినిమాలో మ్యూజిక్, విజువల్స్ గురించి అందరూ ప్రశంసిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఇంతలా ఆదరిస్తున్న ఆడియెన్స్‌కు థ్యాంక్స్' అని రఘు తిరుమల చెప్పారు.

హీరో ఆదిత్య ఓం మాట్లాడుతూ, 'ప్రస్తుతం పర్యావరణ అసమతుల్యత వల్ల ఎలాంటి అనర్థాలు జరుగుతున్నాయో అందరికీ తెలిసిందే. మంచి సందేశాన్ని ఇచ్చే ఈ చిత్రాన్ని ఇంత బాగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఇలానే సపోర్ట్ చేస్తూ ఉంటే మరిన్ని మంచి చిత్రాలతో మెప్పించే ప్రయత్నం చేస్తాను' అని అన్నారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.